thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 41 | కరీంనగర్ మంగళవారం, 22 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.

# కేంద్రంపై జంగ్!

## సిద్ధమవుతున్న కాంగ్రెస్



## పార్టీ శ్రేణులకు ఏఐసీసీ చీఫ్ కీలక పిలుపు

కేంద్రంలోని ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు కాంగ్రెస్ రెడీ అయింది. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకునేందుకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నది. సామాజిక, ఆర్థిక న్యాయం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇప్పటికే పార్టీ శ్రేణులకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సూచించారు. ఆయన ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణపై సేవ్ కానిస్టిట్యూషన్ పేరిట ర్యాలీలు చేపట్టనున్నారు. తెలంగాణలోనూ వీటిని నిర్వహించనున్నారు. అంతేకాకుండా ఇంటిం టికి కాంగ్రెస్ పేరిట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 'జై బాపు.. జై భీమ్.. జైసంవిధాన్' విజయవంతంగా కొనసాగుతున్నది. నేషనల్ హెరాల్డ్ కేసులోనూ సోమవారం నుంచి ఈనెల 24 వరకు పార్టీ సీనియర్లు మీడియా సమావేశాలు నిర్వహించనున్నారు.

**సేవ్ కానిస్టిట్యూషన్ ర్యాలీలు....** రాష్ట్ర వ్యాప్తంగా టీపీసీసీ ఆధర్యంలో రాజ్యాంగ పరిరక్షణపై ప్రజలను చైతన్య పరిచేలా సేవ్ కానిస్టిట్యూషన్ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈనెల 25 నుంచి మే 30 వరకు స్పెషల్ప్రోగ్రామ్స్ తో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లనున్నారు. ముఖ్యంగా దేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నదని, పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తూ అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నదని ప్రజలకు వివరించనున్నారు. అలాగే, రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ, గౌరవిస్తూ పాలన చేయాల్సిన పాలకులు నేడు వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలోకి తీసుకొని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్న విధానాలను ఎండగట్టి, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మునుపెన్నడూ చేపట్టని తరహాలో సేవ్కాన్స్టిట్యూషన్ ర్యాలీలకు శ్రీకారం చుట్టింది.

**అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా..** జిల్లా స్థాయిలో సైతం రాజ్యాంగ పరిర క్షణపై ప్రజలను చైతన్య పరిచేలా మే 3 నుంచి 10 వరకు సేవ్ కాని స్టిట్యూషన్ ర్యాలీలు నిర్వహించనున్నారు.

ఇందులో జిల్లా స్థాయిలో నేతలు మమేకమై పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అధేవిధంగా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ర్యాలీలు చేపట్టనున్నారు. తద్వారా ఊరు-వాడలోని ప్రజలకు రాజ్యాంగ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్లనుంది.

**ఇంటింటా కాంగ్రెస్..** మే 20 నుంచి 30 వరకు ఇంటింటా కాంగ్రెస్ పేరిట ప్రత్యేక కార్యక్రమానికి పార్టీ సిద్ధమైంది. పార్టీ నేతలు, నాయకులు, శ్రేణులు ప్రతి ఇంటికి తిరిగి ప్రస్తుతానికి ఈ దేశంలో కొనసాగిస్తున్న బీజేపీ అరాచక పాలన గురించి తెలియజేయనున్నారు.

అలాగే, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తే ఏరకంగా అక్రమ కేసులు బనాయించి బెదిరిస్తున్నారో వంటి విషయాలతోపాటుగా దేశవ్యాప్తంగా కులగణన డిమాండ్ ను ప్రజలకు వివరించనున్నారు.

**కొనసాగుతున్న 'జై బాపు.. జై భీమ్.. జైసంవిధాన్'...** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా 'జై బాపు.. జై భీమ్.. జైసంవిధాన్' పేరిట కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇప్పటికే టీపీసీసీ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు సక్సెస్ ఫుల్ గా కొనసాగుతున్నాయి. దాదాపు 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలు, నాయకులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు, వివక్షలు తొలగి, సామాజిక న్యాయం, శాంతి సంక్షేమాలు కాపాడాల్సిన రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నేతలు పిలుపునిస్తున్నారు.

**నేటి నుంచి మీడియా సమావేశాలు...** దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా, రాజీవ్ గాంధీల కుటుంబంపై మోడీ ప్రభుత్వం విషం చిమ్ముతూ సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఈడీ చార్జి షీట్ లో దాఖలు చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే నేటి నుంచి ఈనెల 24వ తేదీ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్లు మీడియా సమావేశాలు నిర్వహించనున్నారు. మోడీ అధికార అహంకారంతో ప్రభుత్వ సంస్థలను నాశనం చేస్తూ స్వయం ప్రతిపత్తి గల సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

## రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు.. మూడేళ్లకే కూలిపోయింది: మంత్రి ఉత్తమ్




నిజామాబాద్: పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో 'రైతు మహోత్సవం' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు. "ఉ మ్మడి నిజామాబాద్ జిల్లాకు మరిన్ని చెక్ డ్యామ్‌లు మంజూరు చేస్తాం. రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు. భారాస నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

**రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలు నిలిపివేశారు: మంత్రి తుమ్మల...** పసుపు పంటకు మద్దతు ధర వస్తేనే.. పసుపు రైతు తలెత్తుకుని ఉండగలడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రుణ మాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. "గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలను నిలిపివేసింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తాం. భారాస హయాంలో పదేళ్ల పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని పునరుద్ధరించింది. ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరిసాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుంది"అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



## జపాన్ పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

టోక్యో: జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఒసాకో ఎక్స్‌పోలో పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. నవ ప్రపంచాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానం, ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఉన్నాయన్నారు.




# సై అంటే సై

## అంటున్న బీజేపీ-ఎంఐఎం..

## 22 ఏళ్ల తర్వాత ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక!

హైదరాబాద్ : 22 ఏళ్ల తర్వాత ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరుగుతుండటంతో అందరి చూపు ఇప్పుడే గ్రేటర్ వార్ వైపేనే నెలకొంది. బలాబలాల్లో మజ్లిస్‌కు మొగ్గు ఉన్నా.. వార్ వన్ సైడ్ కాదంటోంది భారతీయ జనతా పార్టీ. ఇంతకీ ఎంఐఎం వర్సెస్ బీజేపీ పోరులో ఫలితం ఎలా ఉండబోతోంది? గాలిపటాన్ని అడ్డుకునేందుకు కమలం ముందున్న దారేది? అన్నదీ తెలంగాణ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీలో 22ఏళ్లుగా మజ్లిస్ పార్టీ ఏఐఎంఐఎం పార్టీకే ఏకగ్రీవం. కానీ ఇప్పుడలా కుదరదంటూ బరిలోకి దిగింది భారతీయ జనతా పార్టీ. పాతబస్తీపై పట్టున్న మజ్లీస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిలబడింది. దీంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీ రసవత్తరంగా మారింది. దాదారు 22 ఏళ్ల తర్వాత ఏప్రిల్ 23వ తేదీన ఎన్నిక జరగనుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో జరిగే లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో బలాబలాలను పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబట్టలేదు. మెజారిటీ మెంబర్స్ ఉన్న ఎంఐఎం అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అనుకున్న తరుణంలో సెకెండ్ హయ్యేస్టే మెజారిటీ ఉన్న బీజేపీ బరిలో దిగడంతో ఎన్నికల ఓటింగ్ అనివార్యమైంది. ఎంఐఎం తరపున మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ తరపున గౌతమ్ రావు అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఈ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 112 ఓట్లు ఉండగా.. అందులో 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మజ్లిస్ పార్టీకి 40 మంది కార్పోరేటర్లు, 9 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో 49 ఓట్ల బలం ఉంది. బీజేపీకి 19 మంది కార్పొరేటర్లు 6 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 25 మంది , బీఆర్ఎస్ కు 15ం9 కలిపి 24. కాంగ్రెస్ 7ం7 తో 14 సభ్యుల సంఖ్యాబలం ఉన్నాయి.

ఎక్స్ అఫీషియో సభ్యుల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇప్పటికే పోలింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, ఎంఐఎంకు మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ ఆశాభావంతో ఉంది. నామినేషన్ నాడే తమ గెలుపు లాంఛనం అంటూ ఎంఐఎం అభ్యర్థి ధీమా వ్యక్తం చేశారు. గెలుపు కోసం కావాల్సిన సరైన సంఖ్యాబలం లేకున్నా.. బల్దియాపై పట్టు బిగించేందు కాషాయనేతలు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు కాంగ్రెస్, బీఆర్ఎస్ జట్టుగా ఎంఐఎంకు సహకరిస్తున్నాయని ప్రజలకు ప్రూవ్ చేయడం తమ లక్ష్యమని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు హైదరాబాద్ మహానగరంలో ఎంఐఎం ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు బీజేపీ గెలుపును కోరుకుంటున్నారని, అందుకనుగుణంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పోరేటర్లు కూడా తమకు ఓటేస్తారని బీజేపీ అభ్యర్థి గౌతం రావు అంటున్నారు.

జాతీయ వాదానికి, జాతీ విద్రోహులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో డెఫినెట్ గా ఆయా పార్టీలను కాదని కార్పొరేటర్లు తనకు ఓటేస్తారని గౌతమ్ రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఏ ఎవైనా గెలుపోటములు లెక్కచేయకుండా పోటీ చేసే పార్టీ బీజేపీ అని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆయన అన్నారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కమలనాథులు.. గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ నాటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇచ్చేలా తమకు ఉన్న 25 ఓట్ల కంటే అదనంగా ఓట్లు సాధిస్తామని అంటున్నారు. మరోవైపు ఇతర పార్టీల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ పార్టీలోకి వస్తామన్న కార్పొరేటర్లకు పొలిటికల్ కేరీర్ గ్యారంటీ కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీంతో చివరి క్షణం వరకు బీజేపీ ప్లాన్ ఎంతమేరకు వర్క్ అవుట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలిపటం విజయబావుట ఎగురవేస్తుందా.. లేక నిజంగానే ఏదైనా మిరాకిల్ జరిగి కమలం వికసిస్తుందా వేచి చూడాలి..!

చురకలు





## ఇంత అభిమానం ఏంటి సామి.. సీఎం రేవంత్ రెడ్డి వస్తేనే పెళ్లి చేసుకుంటానంటున్న యువకుడు..

సీఎం రేవంత్ రెడ్డి తన పెళ్లికి వస్తేనే పెళ్లి ముహూర్తం పెట్టుకుంటానని ఓ యువ కాంగ్రెస్ కార్యకర్త భీష్మించి కూర్చున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి వస్తేనే పెళ్లి చేసుకుంటా.. లేదంటే పెళ్లి పీటలెక్కను.. అంటూ ఓ యువకుడు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించడం ఖమ్మం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మేకల తండ గ్రామానికి చెందిన భూక్య గణేష్‌కు సీఎం రేవంత్ రెడ్డి అంటే అభిమానం. ఆ అభిమానం ఏ స్థాయికి వెళ్లిందంటే.. తన పెళ్లికి సీఎం రేవంత్ రెడ్డి హాజరైతేనే పెళ్లి చేసుకుంటానంటున్నాడు. సీఎం రేవంత్ రెడ్డికి ఎప్పుడు టైం కుదిరితే అప్పుడే ముహూర్తం పెట్టుకుంటానని చెబుతున్నాడు. బంధువులు ఎంత చెప్పినా వినకుండా భీష్మించి కూర్చున్నాడు. ముఖ్యమంత్రి టైం ఇవ్వకపోతే పెళ్లి చేసుకోనని మొండికేశాడు. అంతేకాదు సీఎం రేవంత్ రెడ్డితో పాటు జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కూడా తన పెళ్లికి హాజరయ్యేలా చూడాలని కోరుతూ.. వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్‌కు వినతి పత్రం అందించాడు. భూక్య గణేష్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు.. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటే అమితమైన అభిమానం. ఈ నేపథ్యంలోనే తన పెళ్లికి రేవంత్ రెడ్డి హాజరుకావాలని కోరుతున్నాడు.. వాస్తవానికి గణేష్ మార్చి 6వ తేదీన మహబూబాబాద్ జిల్లాకు సంబంధించిన వాళ్లతో పెళ్లి కుదుర్చుకున్నాడు. పెళ్లి ముహూర్తం పెట్టుకోవలసి ఉంది. కానీ గణేష్ తన పెళ్లికి సీఎం రేవంత్ రెడ్డి హాజరైతేనే పెళ్లి ముహూర్తం పెట్టుకుంటానని చెబుతున్నాడు.. ఆయనకు ఎప్పుడు టైం కుదిరితే అప్పుడే తన ముహూర్తం పెట్టుకుంటానని ఇదే విషయాన్ని వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్ కు చెప్పాడు. రాజకీయ నాయకులకు అభిమానులు, అనుచరులు ఉండడం కామన్. కానీ ఆ అభిమానం హద్దులో ఉంటే అందరికీ శ్రేయస్కరమంటున్నారు స్థానికులు. అయితే.. కాంగ్రెస్ యువ కార్యకర్త ఆహ్వానంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.




నిజామాబాద్ : త్వరలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ హయాంలోనే ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేస్తామని చెప్పారు. నిజామాబాద్ లో జరిగిన రైతు మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు ఉత్తమ్. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. నిజాంసాగర్,ఎస్ఆర్ఎస్పీ నుంచి అదనపు ఆయకట్టు తీసుకొస్తామని చెప్పారు. రైతు పక్షపాతంగా కాంగ్రెస్ ఎన్నో నిర్ణయాలు తీసుకుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంతో లక్ష కోట్ల ఖర్చు చేసి ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చిందని ప్రశ్నించారు ఉత్తమ్. కాళేశ్వరంలో బ్యారేజీలు కూలినా..రికార్డ్ స్థాయిలో వరి సాగైందన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడ ఇంత స్థాయిలో పంట పండలేదన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండిందన్నారు. ఏ ధాన్యం కొనుగోలు సెంటర్లో గన్నీ బ్యాగ్స్ కొరత లేదన్నారు. రైతు పండించిన ప్రతీ గింజకు మద్దతు ధర చెల్లిస్తున్నామని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు.

## పరిపాలన అంటే అర్థమదే..: ప్రధాని మోదీ



దిల్లీ: తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చడానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

**ఇది కీలకం..** "టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోంది" అని అన్నారు. "2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి" అని కోరారు.

## సెర్ప్‌లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధం



హైదరాబాద్: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. మంత్రి సీతక్క ఆదేశాలతో సెర్ప్‌లో వందశాతం బదిలీలకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రస్తుతం సెర్ప్‌లో 3,974 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ సంస్థలో సాధారణ బదిలీలు జరిగి పదేళ్లయిన నేపథ్యంలో ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బదిలీలకు ఆమోదం తెలిపింది. పనుల్లో వేగం పెంచేందుకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## భారతీయ దుస్తుల్లో జేడీ వాన్స్ పిల్లలు.. వీడియో వైరల్



దిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబంతో సహా భారత పర్యటనకు విచ్చేశారు. సోమవారం ఉదయం దిల్లీలో దిగిన ఆయనకు భారత ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలు మీడియా దృష్టిని ఆకర్షించారు. కుమారులు ఇవాన్, వివేక్, కుమార్తె మీరాబెల్ భారతీయ సంప్రదాయ దుస్తుల్లో కన్పించారు. కుమారులిద్దరూ కుర్తా–పైజామా, కుమార్తె అనార్కలీ డ్రెస్ వేసుకున్నారు. విమానం దిగిన తర్వాత వాన్స్ దంపతులను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు సాదరంగా ఆహ్వానించారు. వీరి రాక సందర్భంగా ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో సంప్రదాయ నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వీటిని వాన్స్ పిల్లలు ఆసక్తిగా తిలకించారు. ప్రస్తుతం ఈ చిన్నారుల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వాన్స్ సతీమణి ఉష చిలుకూరి తెలుగమ్మాయి అన్న సంగతి తెలిసిందే. ఆమె పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన వారు. భారత సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిచ్చే ఉషా.. జేడీ వాన్స్‌ను హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. పిల్లల పేర్లను కూడా అలాగే పెట్టారు.




## ఆ కేసులో కేటీఆర్‌కు బిగ్ రిలీఫ్..

హైదరాబాద్, ఏప్రిల్ 21: సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం. మరి ఇంతకీ ఆయనపై ఏం కేసు పెట్టారు.. హైకోర్టు ఏ కేసును కొట్టేసింది.. పూర్తి వివరాలను ఈ కథనంలో తెలుసుకుందాం. మేడిగడ్డ బ్యారేజీపై డ్రోన్ ఎగురవేశారనే కారణంతో కేటీఆర్ సహా మరికొంతమందిపై మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, ఈ కేసును సవాల్ చేస్తూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. గత కొంతకాలంగా ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరుగుతోంది. సోమవారం కూడా కోర్టులో విచారణ జరిగింది. మేడిగడ్డ బ్యారేజీ నిషిద్ధ ప్రాంతమేమీ కాదని కేటీఆర్ తరపు న్యాయవాది టీవీ రమణారావు వాదించారు. రాజకీయ కక్షతనే కేసు నమోదు చేశారని న్యాయవాది టీవీ రమణ కోర్టుకు తెలిపారు. దీనికి రియాక్ట్ అయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్.. డ్రోన్ ఎగురవేయడం డ్యామ్ భద్రతకే ప్రమాదమన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కేటీఆర్‌పై మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేసింది. ఈ మేరకు తీర్పు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయిందంటూ, బీఆర్ఎస్ అవినీతికి ఇదే నిదర్శనం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కేటీఆర్.. తమ పార్టీ నేతలతో కలిసి జూన్‌లో భూపాలపల్లి జిల్లా మహదేవ్?పూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. ఆ టైమ్ లో బీఆర్ఎస్ కార్యకర్తలు కొందరు డ్రోన్ ఎగురవేసి మేడిగడ్డ బ్యారేజీ వీడియోలు తీశారు. ఆ వీడియోలను యూట్యూబ్, ఫేస్ బుక్, ఎక్స్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో అప్ లోడ్ చేశారు. దాంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి. ఈ వీడియోలను పోస్ట్ చూస్తే.. మేడిగడ్డ బ్యారేజీకి ఏం కాలేదని, పెద్ద ఎత్తున వరద వచ్చినా తట్టుకున్నదని, ప్రభుత్వం కావాలనే మేడిగడ్డపై రాజకీయం చేస్తుందని ప్రచారం చేశారు. అయితే, డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరణకు బీఆర్ఎస్ ముందస్తు అనుమతి తీసుకోలేదంటూ ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేటీఆర్, బాల్క సుమన్, గండ్ర వెంకటరమణా రెడ్డి సహా పలువురిపై మహదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**కేటీఆర్ క్వాష్ పిటీషన్..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, కేవలం రాజీయ కక్షతనే తనపై కేసు నమోదు చేశారని, తక్షణమే ఆ కేసును కొట్టివేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో పలు దఫాలుగా వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. సోమవారం నాడు కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.




ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో లాల్‌పానియా ప్రాంతంలోని లుగు పర్వత పాదాల వద్ద నేడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలకనేత హతమయ్యాడు. అతడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే రూ.కోటి రివార్డ్‌ను ప్రకటించింది. అతడి పేరు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్, ఫుచన, నాగ మాంఝీ, కరన్, లెతర పేర్లతో పిలుస్తారు. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ అనే మావోయిస్టులు ఉన్నారు. వీరిపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయి.

ఈ ఎన్‌కౌంటర్ తెల్లవారుజామున 5.30 సమయంలో చోటుచేసుకొన్నట్లు స్థానిక పత్రికలు పేర్కొంటున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

**ప్రశాంత్ హిల్స్ అతడి అడ్డా..** కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా తన కార్యకలాపాలను నిర్వహించేవాడు. ధనబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుధ అతడి స్వగ్రామం. ఝార?ండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో దాదాపు 100 దాడుల్లో ఇతడి హస్తం ఉంది. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50 కేసులు ఉన్నాయి. ఇతడిపై రూ.కోటి రివార్డ్ ఉంది. ఝార?ంఢ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడే. మాంఝీ కాకుండా మరో నలుగురి పైనే రూ.కోటి రివార్డులు ఉన్నాయి. ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేశారు. కొన్నాళ్ల క్రితం అతడి చూడటంతో రూఢీ చేసుకొన్నారు. సోమవారం తెల్లవారుజామున సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి మావోలు అడవుల్లోకి పారిపోయారు. మొత్తం 8 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. తాజా ఆపరేషన్‌లో ఎస్ఎల్ఆర్, ఎన్సాస్ వంటి భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. 209 కోబ్రా బెటాలియన్, ఝార?ండ్ పోలీసులు దీనిలో పాల్గొన్నారు. ఈ ఏడాది జార?ండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేశారు. పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు.


**ఏడాది క్రితమే భార్య అరెస్ట్..** ప్రయాగ్ మాంఝీ భార్య జయా మాంఝీని గతేడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. చికిత్స తీసుకోవడానికి వచ్చిన సమయంలో నాడు ఆమెను అరెస్టు చేశారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందింది.

## ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడం లేదో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ చేయడం లేదో చెప్పాలన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్‌కు తమ పార్టీ కార్పొరేటర్లపై నమ్మకం లేదని.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు వెళ్లొద్దని వారికి చెబుతున్నారన్నారు. మజ్లిస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కైందని ఆరోపించారు. ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయటపెట్టాలనే భాజపా పోటీ చేస్తోందన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాస, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు.



## కేపీహెచ్‌బీలో దారుణం: భర్తను కరెంట్‌షాక్‌తో చంపి.. పూడ్చిపెట్టి..!



కేపీహెచ్‌బీ కాలనీ: హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తను కరెంట్ షాక్‌తో చంపేసి పూడ్చిపెట్టిందో మహిళ. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు సొంతూరికి వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న సాయిలు, కవిత దంపతులు. వీరిద్దరూ గత 15 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. ఇద్దరికీ వివాహేతర సంబంధాలు ఉన్నాయి. ఇటీవల కవిత తన సొంతూరు వెళ్లి.. భర్త సాయిలు పనికి వెళ్లి తిరిగి రాలేదని అక్కడి వారితో చెప్పింది. అనుమానం వచ్చిన ఆయన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.. భార్యే ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. భర్త వేధింపులు భరించలేక సాయిలును భార్యే విద్యుత్‌షాక్ పెట్టి చంపేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అనంతరం మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు సమాచారం. దీనికి ఆమె తన చెల్లెలి భర్త సహకారం తీసుకున్నట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# నో అబ్రాడ్.. భారతీయ విద్యార్థులకు విదేశాల్లో డోర్ల్ క్లోజ్

'దూరపు కొండలు నులుపు' అంటారు. అగ్రరాజ్యాలు అనగానే ఎగేసుకుంటూ లక్షలు ఖర్చు పెట్టి భారతీయ విద్యార్థులు చదువుకోవడానికి విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఆ దేశాల్లో బాగా చదువుకొని అక్కడ ఉపాధి, ఉద్యోగ అవకాశాలను స్థానికులకు దూరం చేస్తున్నారన్న వాదన అక్కడి ప్రభుత్వాల్లో ఉంది. అందుకే ట్రంప్ సహా ఆ దేశాధినేతలు ఇప్పుడు విదేశీ విద్యార్థుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ తరిమేస్తున్నారు. ఇది అంతిమంగా భారతీయ విద్యార్థుల్లో మార్పునకు కారణం అవుతోంది. పరిగెత్తి పాలు తాగేకన్నా.. నిలబడి నీళ్లు తాగడం మేలు అని భావిస్తూ అందరూ విదేశాల కంటే ఇండియా ముద్దు అన్నట్టుగా దేశంలోనే చదవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా, 2024లో విదేశీ విద్యకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా కెనడా, అమెరికా, యూకే వంటి ప్రధాన గమ్యస్థానాలలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. విశ్లేషకులు ఈ తగ్గుదలకు వీసా తిరస్కరణలు ఒక ముఖ్య కారణం కావచ్చని భావిస్తున్నారు. ఈ మూడు దేశాల నుండి భారతీయ విద్యార్థులకు లభించే స్టూడెంట్ వీసాలలో దాదాపు 25 శాతం క్షీణత నమోదైంది.

**–ఏ దేశానికి ఎంత తగ్గుదల?....** అమెరికా: అమెరికా కూడా భారతీయ విద్యార్థుల సంఖ్యలో భారీ తగ్గుదలను చవిచూసింది. 2024లో ఎఫ్1 వీసాల జారీ 34 శాతం పడిపోయింది. అంతకు ముందు సంవత్సరం 1,31,000 వీసాలు జారీ చేయగా, ఈ సంవత్సరం ఆ సంఖ్య 86,000కు పరిమితమైంది. కెనడా: భారతీయ విద్యార్థులకు అత్యంత ఇష్టమైన గమ్యస్థానాలలో కెనడా ఒకటి. అయితే, 2024లో కెనడాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 32 శాతం తగ్గిపోయింది. ఇది 2.78 లక్షల నుండి 1.89 లక్షలకు చేరిందని కెనడా యొక్క ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా సంస్థ స్వయంగా వెల్లడించింది. యూకే: యూకే కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. ఆ దేశానికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య 26 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో 1,20,000 విద్యార్థి వీసాలు జారీ చేయగా, తాజా యూకే హోమ్ ఆఫీస్ లెక్కల ప్రకారం 2024లో ఈ సంఖ్య 88,732కు పడిపోయింది.

**–తగ్గుదలకు కారణాలు ఏమిటి?...** ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉండవచ్చు. ముఖ్యంగా కెనడా , యూకే దేశాలు విద్యార్థి వీసాలపై పరిమితులు విధించడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కెనడా అయితే ఏకంగా భారతీయ విద్యార్థులకు కేటాయించే స్టడీ పర్మిట్లను 32 శాతం తగ్గించింది. అదే సమయంలో చైనా విద్యార్థులకు కేవలం 3 శాతం మాత్రమే తగ్గించడం గమనార్హం. కెనడా ఈ చర్యకు గల కారణాలను కూడా వెల్లడించింది. తమ దేశంలో తాత్కాలికంగా నివసించే విదేశీయుల సంఖ్యను 2026 నాటికి 5 శాతానికి తగ్గించాలని ఆ దేశం నిర్ణయించింది. విదేశీ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటం వలన గృహ, ఆరోగ్య , ఇతర ప్రజాసేవలకు భారం పెరుగుతోందని కెనడా వాదిస్తోంది. అంతేకాకుండా, కెనడా వర్సెస్ భారత్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కూడా ఈ పరిస్థితికి మరింత ఆజ్యం పోశాయి. ఆ దేశంలో భారతీయ విద్యార్థులపై కొన్ని ఆంక్షలు విధించడం కూడా దీనికి కారణం. ఇక యూకే విషయానికి వస్తే, ఆ దేశం విదేశీ విద్యార్థులు వారిపై ఆధారపడిన వారిని తీసుకురాకుండా నిబంధనలు విధించింది. ఈ కారణంగా కూడా వీసా కోసం దరఖాస్తు చేసే వారి సంఖ్య తగ్గింది. వాస్తవానికి, కోవిడ్ మహమ్మారి తర్వాత 2023 నుండే యూకే భారతీయులకు విద్యార్థి వీసాలు ఇవ్వడం తగ్గించింది. ఆ సంవత్సరం 13 శాతం తగ్గుదల కనిపించగా, 2024లో అది 26 శాతానికి చేరుకుంది.

**– గతంలో భారీగా పెరుగుదల...** గత పదేళ్లలో ఈ మూడు దేశాలలో భారతీయ విద్యార్థుల సంఖ్య అత్యంత వేగంగా పెరిగింది. ఒకానొక సమయంలో భారతీయ విద్యార్థులు చైనా విద్యార్థులను కూడా అధిగమించారు. 2015 నుండి 2023 మధ్య కాలంలో కెనడాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య 31,920 నుండి 2,78,160కి చేరుకుంది. ఇదే సమయంలో యూకేకు వెళ్లే వారి సంఖ్య 10,418 నుండి 1,19,738కి పెరిగింది. అమెరికాకు 2015లో 74,831 మంది ఎఫ్1 వీసాపై వెళ్లగా, 2023లో ఆ సంఖ్య 1,30,730గా నమోదైంది. మొత్తానికి, ఐదేళ్ల తర్వాత తొలిసారిగా విదేశీ విద్యకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కెనడా , యూకేల యొక్క కఠినమైన వీసా విధానాలు, భారత్–కెనడా మధ్య సంబంధాలలో నెలకొన్న ఉద్రిక్తతలు దీనికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు భవిష్యత్తులో విదేశీ విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

# ఆధ్యాత్మిక యాత్రికులపై సైబర్ నేరగాళ్ల కన్ను.. కేంద్రం అలర్ట్!



దిల్లీ: దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక పర్యటకంపై సైబర్ నేరగాళ్ల కన్నుపడింది. ఈ పర్యటనకు వెళ్లేవారే లక్ష్యంగా ఆన్‌లైన్ కేటుగాళ్లు ఉచ్చులు పన్నుతున్నారు. ఫేక్ వెబ్‌సైట్లు, ఫేస్‌బుక్ పోస్టులు, గూగుల్ వంటి సెర్చింజన్లలో నకిలీ పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లతో బోల్తా కొట్టిస్తున్నారు. ఈ విషయాలు కేంద్రం దృష్టికి రావడంతో అప్రమత్తమైంది. ఛార్‌దామ్ యాత్రికులు, ఇతర పర్యటకులే లక్ష్యంగా ఈ మోసాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈమేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ పౌరులను అప్రమత్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. పర్యటకానికి సంబంధించి సేవలందిస్తామన్న పేరుతో నకిలీ వెబ్‌సైట్లను సృష్టించడం, సోషల్‌మీడియా ప్రొఫైళ్లు, వాట్సప్ అకౌంట్ల నుంచి సందేశాలు పంపుతున్నట్లు కేంద్రం దృష్టికి వచ్చింది. ముఖ్యంగా కేదార్‌నాథ్ యాత్రికులకు హెలికాప్టర్ బుకింగ్‌లు, ఛార్‌దామ్ యాత్రికులకు అతిథిగృహాలు, హోటల్ బుకింగ్స్, ఆన్‌లైన్ క్యాబ్, ట్యాక్సీ బుకింగ్, హాలిడే ప్యాకేజీల పేరిట ఈ మోసాలు జరుగుతున్నాయని సైబర్ క్రైమ్ విభాగం పేర్కొంది. ఈ మోసపూరిత వెబ్‌సైట్లను నమ్మి చెల్లింపులు చేసినవారికి సేవలకు సంబంధించిన సందేశాలు రాకపోగా.. వారిచ్చిన కాంటాక్ట్ నంబర్లను సంప్రదించినప్పుడు స్పందన ఉండడం లేదన్నారు. కాబట్టి ఆధ్యాత్మిక పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ విభాగం సూచించింది. 'స్పాన్సర్డ్' పేరుతో ఉండే లింకులు, ఫేస్‌బుక్, వాట్సప్‌లో వచ్చే లింకులను క్లిక్ చేసే ముందు అవి అసలైనావా? నకిలీవా? ధ్రువీకరించుకోవాలని సూచించింది. వీలైనంతవరకు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లను లేదా నమ్మదగిన ప్రైవేటు ఏజెన్సీలను ఆశ్రయించాలని సూచించింది. ఇలాంటి ఘటనలు ఏవైనా పౌరుల దృష్టికి వస్తే %ఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅ% పోర్టల్‌లో లేదా 1930కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించింది. ఇలాంటి మోసాలు జరగకుండా కేంద్రం కూడా తమవంతుగా గూగుల్, వాట్సప్, ఫేస్‌బుక్‌తో సమన్వయం చేసుకొని చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.




ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఆయన భార్య, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి స్పందించారు. ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్ (%×అటశీంఎం%)ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను తన భర్త కంటే ఓవర్‌టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.

# కొత్త లా పాయింట్ : రాష్ట్రపతిని శాసించవచ్చా?



భారత రాష్ట్రపతిని రాజ్యాంగ పరిరక్షకుడు అని పిలుస్తారు. రాష్ట్రపతిని నడిచే రాజ్యాంగం అని కూడా అంటారు. రాజ్యాంగం ప్రకారం పాలన అంతా రాష్ట్రపతి చేతుల మీదనే సాగుతుంది. రాష్ట్రపతి సంతకం లేకుండా ఏ బిల్లు కూడా చట్టం కాదు. రాష్ట్రపతి పేరు మీదనే దేశంలో పాలన అంతా సాగుతుంది అన్నది అందరికీ తెలిసిందే. రాష్ట్రపతి ప్రధానమంత్రిని మంత్రిమండలిని నియమించి వారి చేత ప్రమాణం చేయిస్తారు. అదే విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను కూడా నియమించి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అదే సమయంలో రాష్ట్రపతి చేత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయిస్తారు. ఇదిలా ఉంటే మన రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ కార్యనిర్వహణ వ్యవస్థ, శాసన వ్యవస్థలకు సమాన అధికారాలను ఇచ్చింది. అయితే రాజ్యాంగం సక్రమంగా అమలు అవుతోందా లేదా అన్నది సమీక్షించే విశేష అధికారం మాత్రం న్యాయ వ్యవస్థకు ఇచ్చింది. ఆ విధంగా చూస్తే కనుక కొంచెం ఎక్కువ అధికారాలు న్యాయ వ్యవస్థకు దాఖలు అయినట్లుగా కనిపిస్తుంది. కానీ అన్ని వ్యవస్థలు ఒక దానిని ఒకటి గౌరవిస్తూ కలసి మెలసి పనిచేయాలన్న అంతర్లీనమైన సందేశం మన రాజ్యాంగంలో ఉండడమే అందమైన విధానంగా ఉంది. అయితే ఇపుడు చూస్తే కొన్ని కీలక వ్యవస్థల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడేలా కనిపిస్తోంది. మా అధికారాల్లోకి ప్రవేశిస్తున్నారు అని ఆయా వ్యవస్థలు అభిప్రాయపడుతున్నాయి. మరీ ముఖ్యంగా శాసన కార్యనిర్వహణ వ్యవస్థలు ఎక్కువగా న్యాయ సమీక్షకు తన నిర్ణయాలు గురి అయిన సందర్భాలలో ఈ చర్చ వస్తోంది. అయితే న్యాయ వ్యవస్థ చూసేది ఏ అంశం అయినా రాజ్యాంగ బద్ధంగా ఉందా లేదా అన్నది. అలా లేని నాడు దానిని తప్పకుండా సమీక్షిస్తుంది. తన నిర్ణయాన్ని అలా తీర్పు రూపంలో ప్రకటిస్తుంది. ఇక రాష్ట్రపతిని రాజ్యాంగ రక్షకుడిగా చెబుతారు కదా ఆయనను న్యాయ వ్యవస్థ శాసించవచ్చా అన్న కొత్త చర్చ ఇపుడు జరుగుతోంది. ఈ కొత్త లా పాయింట్ ని బయటపెట్టింది ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్. ఆయన రాష్ట్రపతి ద్వారా నియమించబడే న్యాయ మూర్తులు అదే రాష్ట్రపతిని శాసించవచ్చా అని ప్రశ్నించారు. అదే విధంగా మరో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబె అయితే సుప్రీంకోర్టు ఈ విధంగా వ్యవహరిస్తూ పోతుంటే ఇక పార్లమెంట్‌ను మూసివేయడం మంచిదంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టే చట్టాలు చేస్తే పార్లమెంట్‌ను మూసివేయాలి అని ఎక్స్ వేదికగా దూబె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇపుడు దీని మీదనే చర్చ మొదలైంది. ఇక ఇటీవల దాకా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేసిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఈ అంశం మీద మాట్లాడుతూ పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన చట్టాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే అధికారం సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులకు ఉన్నపుడు అధికారిక విధుల నిర్వహణకు సంబంధించి రాజ్యాంగపరమైన పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, గవర్నర్లకు ఆదేశాలు ఇచ్చే అధికారం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగీ అయితే ఇదే అంశం మీద మాట్లాడుతూ రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పడం లక్ష్మణ రేఖను దాటినట్లు కాదని తన కచ్చితమైన అభిప్రాయాన్ని చెప్పారు. అంతే కాదు ఆయన మరో మాట అన్నారు. న్యాయస్థానాల అభిప్రాయాలతో పార్లమెంట్ ఏకీభవించకపోతే నిబంధనలను సవరించే సర్వోన్నత అధికారం పార్లమెంట్‌కు ఉందని పునరుద్ఘాటించారు. న్యాయ వ్యవస్థ కార్యనిర్వాహక వ్యవస్థ పరస్పరం ఢీ కొంటున్నాయనే వాదనను ఆయన ఈ సందర్భంగా కొట్టిపారేశారు. ఇక ఇదే అంశం మీద మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్ అయితే మన రాజ్యాంగం రాష్ట్రపతికి కల్పించిన అధికారాలు పరిమితమేనని గుర్తు చేశారు. అందువల్ల బిల్లులను ఆమోదించడానికి నిర్దిష్ట కాలపరిమితి విధిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తప్పు పట్టాల్సింది ఏదీ లేదని అన్నారు. సుప్రీంకోర్టు 142 అధికరణను ఆవాహన చేసుకుని తీర్పు చెప్పడం సరైనదేనని అన్నారు.

మొత్తం మీద అయితే తాజాగా సుప్రీంకోర్టు రాష్ట్రపతి గవర్నర్ల వద్ద పెండింగులో ప్రభుత్వ బిల్లులు ఉండే దానికి సంబంధించి కాలపరిమితి విధిస్తూ ఇచ్చిన ఆదేశాల మీద విస్తృత స్థాయి చర్చ సాగుతోంది. ముందే చెప్పినట్లుగా ఏ వ్యవస్థకు ఆ వ్యవస్థ గొప్పదే. అంతిమంగా అన్ని వ్యవస్థలూ రాజ్యాంగాన్ని పరిరక్షించాలి. ఈ విషయంలో ఘర్షణల కంటే కూడా సామరస్య వైఖరి ముఖ్యమని రాజ్యాంగ నిపుణులు సూచిస్తున్నారు.

# ట్రంప్.. నువ్వేమైనా రాజువా..? 3 నెలల్లో రెండోసారి వీధుల్లోకి ప్రజలు

సరిగ్గా మూడు నెలల కిందట మొదలైంది ట్రంప్ 2.%వా%.. ఈ కాలంలో ప్రపంచమంతా వణికిపోతోంది.. అమెరికా మాత్రం భగ్గుమంటోంది. స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చే అమెరికన్లు మళ్లీ వీధుల్లోకి వచ్చారు.. గత నెలలో ఇలానే ఒకసారి ఆర్థిక రాజధాని న్యూయార్క్ నుంచి ఆ చివరన ఉండే అలాస్కా వరకు అమెరికన్లు ట్రంప్ నకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. మళ్లీ అదే తీరున నిరసనలు చేపట్టారు. చీటికీమాటికీ టారిఫ్ లు.. అదే పనిగా తీవ్ర వ్యాఖ్యలు.. ప్రత్యర్థులపై ఆగ్రహం.. వివిధ దేశాలతో తగాదాలు.. ఇదీ ట్రంప్ మూడు నెలల పాలన.. ఏదో దేశాన్ని ఉద్ధరిస్తాడని అనుకుని మళ్లీ పట్టం కడితే ట్రంప్ గొడవలు తేవడం తప్ప చేసిందేమీ లేదనే అభిప్రాయంతో ఉన్నారు అమెరికన్లు.




**మరో హ్యాండ్సాఫ్..** ఇటీవల ట్రంప్ నకు వ్యతిరేకంగా అమెరికన్లు చేపట్టిన నిరసనల్లో 'హ్యాండ్సాఫ్' అంటూ నినదించారు. ఒకవిధంగా చెప్పాలంటే అమెరికాలో రిపబ్లికన్ల పాలనలో జరిగిన అతి పెద్ద నిరసన ఇదే అంటారు. ఇప్పుడు మరో హ్యాండ్సాఫ్ కు దిగారు ప్రజలు. అప్పటిలాగానే వీధుల్లోకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రంప్ నకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు.

**ఇప్పుడు రాజులు ఎవరూ లేరు..** ట్రంప్ నకు వ్యతిరేకంగా కొంతకాలం కిందట హ్యాండ్సాఫ్ అంటూ నినదించిన అమెరికన్లు ఇప్పుడు 'అమెరికా రాజులు ఎవరూ లేరు' అంటూ న్యూయార్క్ సెంట్రల్ లైబ్రరీ ఎదుట గుమిగూడారు. అంతేకాదు.. 'ఈ దౌర్జన్యాన్ని ఎదిరించండి' అంటూ నినాదాలు చేశారు. కాగా, వీరి ఆగ్రహానికి కారణం..

తాత్కాలిక వలసదారుల చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయడం, బహిష్కరించడమే.

**వలసదారులారా స్వాగతం...** టంప్–2లో ప్రధాన నిర్ణయం వలసదారుల ఏరివేత. తాజా ఆందోళనల్లో ప్రజలు మాత్రం.. "భయం లేదు.. వలసదారులారా స్వాగతం" అంటూ నినాదాలు చేస్తుండడం గమనార్హం. ట్రంప్ పాలన రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని.. దీనిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, విద్యార్థులకు ఇచ్చే ఎఫ్–1 వీసా గడువు ముగిసినా అమెరికాలోనే ఉండిపోయాడు పాలస్తీనాకు చెందిన లెకా కోర్డియా. దీంతో అతడిని అరెస్టు చేశారు. మరో పాలస్తీనా విద్యార్థిని కూడా అరెస్టయ్యారు. వీరిని విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇండియాకు వచ్చేస్తానంటున్న ఎలన్ మస్క్

టెస్లా , స్పేస్ ఎక్స్ సీఈవో ఎలోన్ మస్క్ భారతదేశాన్ని సందర్శించడానికి తన ఆసక్తిని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో టెక్నాలజీ , ఆవిష్కరణలలో సహకారం గురించి చర్చించారు. ఈ ఫోన్ సంభాషణ భారతదేశంలో మస్క్ యొక్క వ్యాపార సామర్థ్యంతోపాటు పెట్టుబడుల గురించి ఊహాగానాలకు దారితీసింది. మస్క్ తన %శ% ఖాతాలో భారతదేశాన్ని సందర్శించడానికి ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది దేశం పట్ల ఆయన ఆసక్తిని సూచిస్తుంది. మోదీతో మస్క్ యొక్క చర్చలు సాంకేతికత ఆవిష్కరణలపై దృష్టి సారించాయి. ఇది కొత్త వ్యాపార భాగస్వామ్యాలను సూచిస్తుంది. మోదీ కూడా %శ% లో ప్రతిస్పందించారు. సాంకేతికత, ఆవిష్కరణలలో అమెరికాతో భారతదేశం యొక్క భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతను నొక్కి చెప్పారు. డోనాల్డ్ ట్రంప్ పరిపాలనలో మస్క్ యొక్క ప్రభావవంతమైన పాత్ర ఈ చర్చలకు



రాజకీయ ప్రాముఖ్యతను జోడిస్తుంది. భారతదేశంలో టెస్లా కార్ల తయారీ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా భారీ పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. స్పేస్ ఎక్స్ యొక్క స్టార్లింక్ వంటి సాంకేతికతలతో భారతదేశం సాంకేతిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచవచ్చు. భారతదేశం , అమెరికా మధ్య సాంకేతిక సహకారం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపరుస్తుంది. మస్క్ యొక్క ఆసక్తి మోదీ యొక్క ప్రతిస్పందన భారతదేశం యొక్క సాంకేతిక రంగంలో సంభావ్య సహకారానికి ఒక సానుకూల సంకేతంగా చెప్పొచ్చు. భారతదేశం ఒక పెద్ద మార్కెట్.. టెస్లా , స్పేస్ ఎక్స్ వంటి సంస్థలకు గణనీయమైన వృద్ధి అవకాశాలను అందిస్తుంది. అయితే, భారతదేశం యొక్క నియంత్రణ వాతావరణం.. మౌలిక సదుపాయాల సవాళ్లు మస్క్ యొక్క పెట్టుబడులకు ఆటంకం కలిగించవచ్చు. ఈ చర్చలు భారతదేశం యొక్క సాంకేతిక రంగం , ద్వైపాక్షిక సంబంధాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. భారతదేశం సాంకేతిక రంగంలో మస్క్ ఆసక్తి .. మోదీ సానుకూల స్పందన దేశ భవిష్యత్తుకు శుభసూచకం. ఈ భాగస్వామ్యం భారతదేశం యొక్క సాంకేతిక పురోగతికి.. ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

## సంపాదకీయం

# క్రిమియా రష్యాదే..


## ఉక్రెయిన్ ను చీల్చేస్తున్న అమెరికా..

సరిగ్గా 11 ఏళ్ల కిందట ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.. కారణం.. ఒకప్పటి సోవియట్ యూనియన్ లో భాగమైన ఉక్రెయిన్ కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని స్వాధీనం చేసుకునేందుకు రష్యా ప్రయత్నించడమే. ఇక 2014 మార్చి 17న క్రిమియా అధికారులు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. తర్వాత రష్యాలో చేరాలని చూశారు. మరుసటి రోజు నుంచి రష్యా క్రిమియాను రిపబ్లిక్ ఆఫ్ క్రిమియాగా సెవస్తపోల్ సమాఖ్య నగరంగా ప్రకటించి విలీనం చేసింది. అలా తనలో కలిపేసుకుంది. దీనిని పశ్చిమ దేశాలు మాత్రం గుర్తించలేదు. ఈ ద్వీపకల్పాన్ని సైనికీకరించి.. బయటి జోక్యాన్ని సహించేది లేదని హెచ్చరించింది. రష్యా మళ్లీ 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్ పై యుద్ధం మొదలుపెట్టింది. పారిశ్రామికంగా కీలకమైన, సుసంపన్నమైన లుహాన్స్క్, డొనెట్స్క్, ఖేర్సన్ ప్రాంతాలను ఆక్రమించింది. అక్కడ రెండేళ్ల కిందటే ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపట్టింది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక పూర్తిగా రష్యా పక్షం వహిస్తూ యుద్ధానికి కారణం ఉక్రెయిన్ అని నిందిస్తున్న సంగతి తెలిసిందే. దీంతోపాటు ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ఒప్పందానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రిమియా రష్యాదే అని గుర్తించడానికి కూడా అమెరికా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే.. పశ్చిమ దేశాలూ అమెరికాను అనుసరించాల్సి ఉంటుంది. కాగా, అమెరికా ప్రతిపాదిస్తున్న శాంతి ప్రతిపాదనలతో తక్షణం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చేలా ఉక్రెయిన్, యూరోపియన్ అధికారులు చర్చిస్తున్నారు. కాగా, రష్యా ఆక్రమించుకున్న భూమిపై ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాల్సిందే అని ఇప్పటికే ట్రంప్ తేల్చి చెప్పారు. అలాగైతే సంధి జరుగుతుందని కూడా అన్నారు. ఇలా కాదంటే చర్చల ప్రయత్నాలు ఆపేసి అమెరికా తన దారి తాను చూసుకుంటుందని ట్రంప్ స్పష్టం చేశారు కూడా. ఏదేమైనదీ, వచ్చే వారం అమెరికా.. యూరప్ దేశాలు, ఉక్రెయిన్ వచ్చేవారం లండన్ లో జరిపే చర్చల్లో తేలనుంది. ఒకవేళ క్రిమియా గనుక రష్యాదే అని అమెరికా తేల్చేస్తే.. ఉక్రెయిన్ నిలువునా చీల్చేందుకు అంగీకరించినట్లే.

# ఆకాశవాణి తొలి స్వరకర్త బాలాంత్రపు రజనీ కాంతరావు - ఏప్రిల్ 22...బాలాంత్రపు రజనీ కాంతరావు వర్ధంతి

బాలాంత్రపు రజనీ కాంతరావు సుప్రసిద్ధ వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, గీత రచయితగా, విజయవాడలోని ఆకాశవాణి సంచాలకులుగా రేడియో శ్రోతలకు చిరపరిచితులు. అయన తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరు. ఆయన రచించిన వాగ్గేయకార చరిత్ర 20వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. 1947 లో దేశం స్వాతంత్ర్యం పొందిన అర్ధరాత్రి భారత ప్రధాని సుప్రసిద్ధ ప్రసంగం పూర్తవగానే రజనీ రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్రదేశం, మాదీ స్వతంత్ర జాతి' టంగుటూరి సూర్యకుమారి గానం ఆసేతుహిమాచలం ప్రతిధ్వనించింది. తొలి స్వాంత్ర్య దినోత్సవం రోజున స్వయంగా రచించి స్వరపర్చిన "జయభేరి, వాయించు నగారా గీతం" మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. ఆ తర్వాత అర్ధశతాబ్దం పైగా ఆయన తెలుగునాట లలిత సంగీతమనే ఒక నూతన గాన సంప్రదాయాన్ని సృష్టించి, పెంపొందించి, తానొక వాగ్గేయ కారుడిగా అవతరించడమే కాక, మరెందరో వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా ఉన్నారు. 1920 జనవరి 29న పశ్చిమ గోదావరి జిల్లా నిడదోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరు కావడం విశేషం. 1940-41 ప్రాంతంలో ఇరవయ్యేళ్ల నాడు ఆల్ ఇండియా రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరగా, నాటి నుండి రిటైరయ్యే వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పనిచేసి 1978లో రేడియో స్టేషన్ డైరెక్టరుగా రిటైరయ్యారు. ఆకాశవాణిలో తొలి స్వరకర్తగా శ్రోతలను అలరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన వారిలో రజనీకాంతరావు కీలకమైన వారు. అలాగే తొలితరం సంగీత దర్శకుల్లోనూ బాలాంత్రపు కూడా ఒకరు. రజనీ" అని పిలుచుకునే బాలాంత్రపు రజనీ కాంతరావు ఒక వ్యక్తి కాదు, ఆయన ఏదో ఒక కళకే పరిమితం కాదు. ఆయన ఒక రచయిత, వాగ్గేయ కారుడు, రేడియో కళాకారుడు, సినీ పాటల - మాటల రచయిత, సంగీత దర్శకుడు. సంగీతంలో , సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో రజనీది ఒక ప్రత్యేక శైలి. సాధారణత్వం - సంక్లిష్టత, ప్రాచీనత - ఆధునికత, అచ్చ తెలుగు మాటలు - సంస్కృత భూయిష్ట సమాసాలు, అనేక పరస్పర విరుద్ధ విషయాలు అయన కవిత్వంలో పదబంధాల్లో చోటు చేసుకున్నాయి. ప్రయోగాలు - సంగీత రూపకాలు, యక్షగానాలు, నాటికలు, సంగీత శిక్షణ, ఉషశ్రీ గారి ధర్మ సందేహాలు, ఈ మాసపు పాట, బావగారి కబుర్లు, ఇంకా ఎన్నో కార్యక్రమాల రూపకర్త ఆయన. వీటికి సంబంధించిన రచనలు చేయడం, బాణీలు సమకూర్చడం ఒక ఎత్తు, వాటిని గాయనీ గాయకులతో, వాద్య బృందంతో నిర్వహించడం మరొక ఎత్తు, రేడియో కోసం రచయిత గుడిపాటి వెంకటాచలంను అయన చేసిన ఇంటర్వ్యూ ఈ నాటికి కూడా అపురూపమైనదిగా పరిగణిస్తారు.

ఆలిండియా రేడియో లలిత సంగీత విభాగాన్ని తన ప్రతిభతో సుసంపన్నం చేశారు. రజనీ రచించి, స్వరపరిచిన అనేక కృతులు తెలుగు వారి సాంస్కృతిక, సంగీత రంగాల్లో నిలిచి పోయాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన సంగీతంలో లిరిసిజం రజనీ ప్రభావమేనన్నారు. లలిత సంగీతానికి, తెలుగు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని నెలకొల్పి, దానికి రూపకల్పన చేసిన గొప్ప సంగీత కారులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావులతో పాటు రజనీకాంతరావు తెలుగు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. ఠాగూర్ అకాడమీ రత్న - రవీంద్రనాథ్ ఠాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం, కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వ విద్యాలయం 1981 లో బహుకరించిన గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం - 1961. ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి , ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి - అమెరికాలోని అప్పజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి పురస్కారం, నాథ సుధార్ణవ - మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ,



పుంభావ సరస్వతి, నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారాలు ఆయనకు లభించాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, రజనీకాంతరావు 2018, ఏప్రిల్ 22 ఆదివారం రోజున మరణించాడు

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# రవివర్మ చిత్రాలకు ప్రేరణ అంజనీబాయి మాల్పేకర్ - ఏప్రిల్ 22...అంజనీబాయి జయంతి

"రవివర్మకే అందని ఒకే ఒక అందానివో", "రవి చూడని పాడని నవ్య నాదానివో" అంటూ "రావణుడే రాముడైతే" చిత్రం (1980) కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు - జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే. చిత్రకళకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ. హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ. ఆయన తన చిత్రాలను, దక్షిణ భారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహా భారతంలోని నల దమయంతుల, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి లేదు. రవివర్మ చిత్రాలకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులున్నారు. మరి ఆయన చిత్రాల్లో కనిపించే ముగ్ధమనోహర సౌందర్యవతి నిజంగానే ఈ భూమి మీద ఉందా లేదా ఊహా సుందరియా అన్న అనుమానం చాలామందికి వస్తుంది. అయితే అంజనీ బాయి మాల్పేకర్ రవివర్మ చిత్రాలకు నమూన అని అంటారు. సంగీత కళాకారిణిగానే ఎక్కువ మందికి తెలిసిన ఆమె... రవివర్మ కుంచెతో ప్రాణం పోసుకున్న లేడీ ఇన్ ది మూన్లైట్", "లేడీ ప్లేయింగ్ స్వర్బాట్", "మోహిని" ,"ది హార్ట్‌బ్రోకెన్" తదితర చిత్రాలకు ప్రేరణ అని అతి తక్కువ మందికి తెలుసు. పండిత్



అంజనీబాయి మాల్పేకర్ (22 ఏప్రిల్ 1883 - 7 ఆగస్టు 1974) ప్రముఖ భారతీయ సంప్రదాయ సంగీత గాత్ర కళాకారిణి. హిందూస్థానీ సంగీతంలో భెండి బజార్ గరానా శైలిలో ఆమె ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆమె ప్రముఖ సంగీత విధ్యాంసుడు ఉస్తాద్ నజీర్ ఖాన్ శిష్యురాలు. గోవాలోని మాల్పేలో 22 ఏప్రిల్ 1883లో కొంకణి భాష మాట్లాడే గోవా సంగీత కారుల కుటుంబంలో అంజనీ జన్మించారు. ఆమె తాత గుజాబాయి, తల్లి నబుబాయిలు సంగీత ప్రపంచంలో చాలా ప్రసిద్ధి చెందిన వారు. తన 8వ ఏట ఉస్తాద్ నజీర్ ఖాన్ వద్ద భెండి బజార్ గరానా శైలిలో సంగీత శిక్షణ తీసుకున్నారు. గురువుతో పాటు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకున్న మొదటి మహిళగా ఆమె పేరు నమోదు చేసుకున్నారు. ఎనిమిదేండ్ల పాటు కఠోన సంగీత సాధన చేసిన ఆమె 1899లో తన 16వ ఏట ముంబైలో మొదటిసారి కచేరి చేశారు. ఆ సమయంలో మహిళలు ప్రదర్శనలు ఇచ్చేవారు కాదు. కానీ అంజనీ మాత్రం తన కచేరీల ద్వారా ఎంతో గౌరవం పొందారు. 1920 వరకు ఆమె సంగీత కెరీర్ చాలా బాగా సాగింది. అయితే ఆమె గురువు చనిపోవడంతో ప్రజా ప్రదర్శనలకు దూరమైనారు. అందమైన ఆమె రూపం కూడా ప్రదర్శనలకు దూరం కావడానికి ఒక కారణం. కచేరిలో కొందరు ప్రేక్షకుల నుంచి వచ్చే వేధింపులు ఆమెను బాధించేవి. దాంతో ఆమె కచేరిలు ఆపేసి 1923 నుంచి పూర్తిగా సంగీత శిక్షణకే సమయం కేటాయించేవారు. ఆమె వద్ద సంగీతం నేర్చుకున్న కుమార్ గాంధర్వ, కిషోర్ అమోంకర్ ప్రసిద్ధ సంగీత కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన గాత్రంతో పాటు అపూర్వమైన అందం ఆమె సొంతం. ప్రముఖ చిత్రకారుడు ఎం.వి. ధురంధర్ ఆమె చిత్రాన్ని గీసినప్పుడు రవివర్మ చూసి అబ్బురపడ్డారట. తమ చిత్రాల ర్పూప కల్పనకు ఆమెను ప్రేరణగా తీసుకున్నారు. "లేడీ ఇన్ ది మూన్లైట్", "లేడీ ప్లేయింగ్ స్వర్బాట్", "మోహిని", "ది హార్ట్‌బ్రోకెన్" తదితర చిత్రాలకు అంజనీ ప్రేరణగా నిలిచారు. 1958లో, కేంద్ర సంగీత నాటక అకాడమీ వారు ఇచ్చే సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకొన్న మొట్ట మొదటి మహిళగా నిలిచింది అంజనీబాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**



# 'రష్యా గుమ్మంలో నాటో మొరిగింది'.. పోప్ చరిత్రలో నిలిచే వ్యాఖ్యలు

దక్షిణ అమెరికా ఖండం నుంచి పోప్ అయిన తొలి వ్యక్తి.. 12 ఏళ్లకు పైగా పోప్ గా బాధ్యతలు.. మరణ శిక్షలకు వ్యతిరేకి.. అన్ని మతాల మధ్య సమన్వయం.. వలసదారులపై సానుభూతి.. వాతావరణ మార్పులపై చైతన్యం.. ఇవీ పోప్ ఫ్రాన్సిస్ (88) నాణేనికి ఒకవైపు.. శాంతి దూతగా .. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపలేకపోయారు.. ఇజ్రాయెల్ ను కట్టడి చేయలేకపోయారు.. ప్రపంచ శాంతికి ఆయన పాత్ర పరిమితం.. ఇవీ నాణేనికి మరోవైపు.. క్యాథలిక్ ల పెద్ద అయిన పోప్ ఫ్రాన్సిస్ కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. అయితే, ఈస్టర్ సందర్భంగా బయటకు వచ్చిన ఆయన ఆరోగ్యవంతులయ్యారని భావించారు. అంతలోనే సోమవారం కన్నుమూశారు.

పోప్ బెనిడెక్ట్-16 తర్వాత ఫ్రాన్సిస్ 2013లో పోప్ అయ్యారు. ఈ 12 ఏళ్లలో ఫ్రాన్సిస్ యుద్ధాల వంటి అనేక ప్రపంచ సంక్షోభాలను చూశారు. ఆయన పోప్ అయిన వెంటనే 2014లో ఉక్రెయిన్ కు చెందిన క్రిమియాపై రష్యా యుద్ధానికి దిగింది. ఇక అనేక అంతర్యుద్ధాలు, సంక్షోభాలు. వీటిలో ప్రధానమైదని ఉక్రెయిన్ పై రష్యా యుద్ధం. అయితే, దేశాధినేతల తరహాలో కాకుండా రష్యాను పశ్చిమ దేశాల సైనిక కూటమి నాటో రెచ్చగొట్టిందని, అందుకే ఉక్రెయిన్ యుద్ధం వచ్చిందని పోప్ ఫ్రాన్సిస్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. దీనిని 'రష్యా గుమ్మంలో నాటో మొరిగింది' అంటూ కాస్త కటువుగానే వ్యక్తం చేశారు. తద్వారా తప్పు ఎవరిదో ఆయన చెప్పకనే చెప్పారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ఉక్రెయిన్ పట్ల ఆ దేశ ధోరణి చూశాక పోప్ మాటలు మరింత నిజం అనిపించాయి. ఏదేమైనా పోప్ తన చర్యలతోనే కాదు.. వ్యాఖ్యలతోనూ చరిత్రలో నిలిచిపోయారు.



# జగన్ రాజ గురువుకు భారీ షాక్

వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఆయన హవా ఒక్క రేంజిలో ఉండేది. ఆయన ఏకంగా నాటి సీఎం వైఎస్ జగన్ కి ఆధ్యాత్మిక గురువుగా వాసికెక్కారు. ఆయనే విశాఖ శ్రీ శారదా పీఠం స్వామీజీ స్వరూపానందేంద్ర మహా స్వామి. ఆయన అంటే జగన్ కి ఎంతో గురి. అంతే కాదు ఏకంగా వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలంతా ఆయనకు భక్తులుగా ఉండేవారు. ఇక స్వామి ఏమి చెబితే అదే వేదవాక్కుగా వైసీపీ రాజ్యంలో నడచింది. విశాఖను రాజధానిగా చేసుకోమని తూర్పు నుంచి పాలిస్తే మంచి ఫలితాలు వస్తాయని జగన్ కి చెప్పింది కూడా స్వామీజీయే అని అప్పట్లో ప్రచారం కూడా పెద్ద ఎత్తున సాగింది. ఆ మాట మేరకే మూడు రాజధానులు అన్న నినాదాన్ని జగన్ అందుకున్నారని కూడా అంటారు. ఇవన్నీ పక్కన పెడితే స్వామీజీ వైసీపీ హయాంలో పీఠాలను అభివృద్ధి చేసే క్రమంలో భీమిలీలో ప్రభుత్వం విలువైన భూములను కట్టబెట్టింది. అలాగే తిరుమలలో కూడా పీఠం తరఫున భవన నిర్మాణానికి కూడా అనుమతులు మంజూరు అయిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక భీమిలీ భూములకు అనుమతులు రద్దు చేసింది. తిరుమలలో పీఠం తరఫున నిర్మించిన భవనం అక్రమ నిర్మాణం అని తిరుమల తిరుపతి దేవస్థానం అంటోంది. దీంతో పాటుగా ప్రపంచ ఆరాధ్యనీయ మైన ఆధ్యాత్మిక కేంద్రం తిరుమలలో అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తాజాగా తిరుమలలోని విశాఖ శారదా పీఠం మఠానికి టీటీడీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులలోని సారాంశం ప్రకారం చూస్తే కనుక పదిహేను రోజులలో తిరుమలలోని శారదాపీఠం మఠం ఖాళీ చేసి భవనాన్ని టీటీడీకి అప్పగించాలని అధికారులు స్పష్టం చేశారు. ఇక చూస్తే కనుక గోగర్భం డ్యామ్ వద్ద శారదాపీఠం మఠం నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నట్టు టీటీడీ అధికారులు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా శారదాపీఠం మఠం నిర్మించినట్టు నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఆ సదరు నివేదిక ఆధారంగా చేసుకుని శారదాపీఠం భవనం లీజు రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇదిలా ఉంటే ఇంతకు ముందే ఈ పీఠం భవనం విషయంలో టీటీడీ ఒకసారి పీఠానికి షోకాజ్ నోటీసులను జారీ చేసింది. అయితే ఈ నోటీసుల మీద శారదాపీఠం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే కోర్టు టీటీడీ బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇపుడు మరోసారి నోటీసులు పీఠానికి వెళ్ళాయి. మరి పీఠం నిర్వాహకులు ఏమి చేస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

చురకలు



## చిటికెలో.. చినుకు సమాచారం

ఆలేరు స్వయంచాలక (ఆటోమేటిక్) వాతావరణ కేంద్రాలు(ఏడబ్ల్యూఎస్-ఆటోమెటిక్ వెదర్ స్టేషన్) ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని అందిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక విభాగం(టీజీడీపీఎస్) తెలంగాణ వాతావరణం(టీఎస్-వెదర్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ చరవాణి ఉన్నవారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ ఏడబ్ల్యూఎస్‌లను విద్యుత్తు ఉపకేంద్రాల ఆవరణల్లో నెలకొల్పారు. వర్షపాతం, గాలివేగం, ఉష్ణోగ్రత వివరాలను గంటగంటకు తెలుసుకోవచ్చు. ప్రతిగంటకు హైదరాబాద్‌లోని వాతావరణ శాఖకు ఇక్కడి నుంచి సమాచారం అందుతుంది. అక్కడి నుంచి సమాచారం జిల్లాకు చేరవేస్తారు.

గతంలో మండల కేంద్రలో వర్షం కురిస్తేనే వర్షపాతం గణాంకాలు తెలిసేవి. మండల కేంద్రానికి పక్కన ఉన్న గ్రామంలో భారీవర్షం కురిసినా.. ఎంత పడిందన్న లెక్క తెలియదు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏడబ్ల్యూఎస్‌లు ఏర్పాటు చేశారు. స్వయంచాలక వాతావరణ కేంద్రాలను సిమ్‌కార్డు వ్యవస్థ ద్వారా భారత వాతావరణ పరిశోధన కేంద్రానికి అనుసంధానం చేశారు.

ఏ స్టేషన్లో సమస్య వచ్చినా వెంటనే అధికారులకు సమాచారం చేరేలా సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేశారు. సత్వరం మరమ్మతు చేసే



వీలు ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులోకి వచ్చిన టీజీ- వెదర్ యాప్ ద్వారా స్వయంచాలక వాతావరణ కేంద్రానికి అనుసంధానమై ప్రతిగంటకు సమాచారం అందిస్తోంది. యాప్‌తో చుట్టూరా ఉన్న మూడు కేంద్రాల పరిధిలోని వాతావరణ వివరాలు తెరపై కన్పిస్తుంటాయి. ఇతర ప్రాంతాల వాతావరణ వివరాలను సెర్చ్ ఆప్షన్‌లోకి వెళ్లి తెలుసుకోవచ్చు.

నల్గొండ ఉమ్మడి జిల్లాలో 71 మండలాల పరిధిలో 122 చోట్ల ఏడబ్ల్యూఎస్‌లు ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 58, సూర్యాపేట జిల్లాలో 36, యాదాద్రి భువనగిరి జిల్లాలో 28 చోట్ల కేంద్రాలు ఉన్నాయి.

## అన్నదాతకు ఇంపుగా.. రుణ పరిమితి పెంపు

నల్గొండ : రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు పంట రుణ పరిమితిని పెంచింది. పంటల వారీగా సాగుకు అయ్యే ఖర్చులు, తదితర వాటిని అంచనా వేసి అన్ని రకాల పంటలకు 2025-26 వానాకాలం, యాసంగిలో పెంచిన రుణ పరిమితిని అమలు చేయనుంది. దాదాపు 122 రకాలైన పంటలతో పాటు పాడి, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, తేనెటీగలు, చేపల పెంపకం యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. గత వానాకాలం, యాసంగిలో పంట రుణాలు, అనుబంధ రుణాల



పంపిణీలో వంద శాతం లక్ష్యం సాధించలేదు.

బ్యాంకర్ల సమితి వర్షాధార సాగుకు, నీటి ఆధారంగా సాగు చేసే వారికి వేర్వేరుగా రుణ పరిమితిని నిర్ధారించింది. వర్షాధార సాగుతో పోలిస్తే నీటి ఆధారంగా సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.2 వేలు అదనంగా కేటాయించారు. గత ఏడాది పత్తి పంటకు రూ.46 వేలు రుణ పరిమితి నిర్ధారించగా.. ఈ సీజన్‌లో రూ.48 వేలకు పెంచారు. విత్తనోత్పత్తి చేసే రైతులకు రుణ పరిమితి ఎక్కువగా ఉంది. కూరగాయల తోటలైన టమాట రైతులకు ఎకరానికి రూ.57 వేలు వరకు రుణసాయం పొందే వీలుంది. మిరపకు రూ.86 వేల వరకు రుణం పొందొచ్చు. మల్చింగ్ విధానంతో సాగు చేస్తే అదనంగా రూ.20 వేలు పొందొచ్చు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు మొక్కలు నాటిన అయిదో సంవత్సరం తరువాత పంటపై రుణం పొందే వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అనుమతించిన మేరకు పంట రుణ పరిమితిని పెంచి రైతులకు అధిక మొత్తం అందించేలా చర్యలు తీసుకుంటామని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ తెలిపారు.

## ఇప్పుడు తవ్వితేనే.. అప్పుడు ఇంకేది..!

సూర్యాపేట : ఇంకుడు గుంతల నిర్మాణానికి వేసవినే మంచి తరుణం. ఈ కాలంలో తవ్వకుంటే.. వర్షాకాలం నాటికి నీటిని భూమిలోకి ఇంకించవచ్చు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పట్టణాలు, గ్రామాల్లో ఇంట్లో ఇంకుడుగుంత తవ్వుకుంటే మంచిది. నిర్వహణ లోపంతో గతంలో తవ్విన ఇంకుడు గుంతలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్నిచోట్ల పూడిపోయి, చెత్తాచెదారంతో నిండిఉంటున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు తప్పక ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. రోజురోజుకూ పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. రహదారులన్నీ సీసీగా మారుతున్నాయి. దీంతో వాన నీరు ఇంకే పరిస్థితి లేదు. **చ.మీటరుకు రూ.10..**

పురపాలికల్లో నూతన ఇళ్ల నిర్మాణ సమయంలో పట్టణ ప్రణాళిక విభాగం వారు అనుమతులిచ్చేటప్పుడు ఇంకుడు గుంత నిర్మాణానికి చదరపు మీటరుకు రూ.10 తీసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం గుంతను నిర్మించిన అనంతరమే ఫీజును వెనక్కి ఇస్తారు. ఒకవేళ నిర్మించకపోతే అధికారులు నోటీసులిచ్చి మరీ నిర్మింపజేస్తారు. కానీ ఇది క్షేత్రస్థాయిలో ఏ పురపాలికల్లో అమలుకు నోచుకోవటం లేదు. కొత్త ఇళ్లను నిర్మిస్తున్న చోట ఒక్కటి కూడా నిర్మించడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో చెల్లించిన డిపాజిట్‌ను నిర్మాణదారులు వదులుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణాల్లో అక్కడక్కడ పదుల సంఖ్యలోనే నిర్మించినా ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండాపోయాయి. ఇప్పటికైనా అధికారులు ఇంకుడు గుంతలపై చర్యలు చేపట్టి భూగర్భ జలాల వృద్ధికి తోడ్పాటునందిచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంకుడు గుంత తప్పనిసరి.. శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టాలంటే ఇంకుడు గుంత తప్పని సరిగా నిర్మించాలి. 40 చదరపు అడుగుల ఇంటి పైకప్పునకు 1.30 మీటర్ల పొడవు, మీటరు వెడల్పు, మీటరు లోతు ఉండే గుంతను తవ్వుకోవాలి. పైకప్పు విస్తీర్ణాన్ని బట్టి గుంత పరిమాణం మార్చుకోవాలి. గుంతలో 3 వరుసల కంకర, దానిపై ఇసుకతో నింపాలి. నీరు గుంతలోకి చేరేలా ఏర్పాటు చేసుకోవాలి.

## వారసత్వ సంపదను కాపాడుకుందాం



కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా చారిత్రక ఆలయాలు, ప్రాచీన కట్టడాలకు నిలయంగా నిలుస్తోంది. దేవాలయాలు, కోటలు, కట్టడాలు ఆనాటి చరిత్ర, వారసత్వ సంపదకు అద్దం పడుతున్నాయి. శాతవాహనులు ఆనవాళ్లు తొలిసారి వెల్గటూరు మండలం కోటిలింగాలలో బయటపడగా.. దీంతో దీనినే శాతవాహనుల మొదటి రాజధానిగా పేర్కొంటారు. వేములవాడలో చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు ప్రాచీన శిల్పాకళా నైపుణ్యానికి నిదర్శం అని చెప్పవచ్చు. ఇలా చాలావరకు ఆలయాలు, కట్టడాలు ఉన్నా.. ఆదరణకు నోచుకొక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని అభివృద్ధి చేస్తే పర్యాటకులతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు వారసత్వ సంపదను కాపాడినట్లు ఉంటుంది. శుక్రవారం అంతర్జాతీయ ప్రాచీన కట్టడాల(ప్రపంచ వారసత్వ సంపద) దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కొన్ని చారిత్రక కట్టడాలపై కథనం.

వేములవాడ మండలం నాంపల్లిలో గుట్టపై వెలిసిన సుప్రసిద్ధ నరసింహ క్షేత్రానికి భక్తులు ఎక్కువగానే వస్తుంటారు. గుట్టపైన నవనాథ సిద్దుల గుహ పది లేదా పదకొండవ శతాబ్దాలకు చెందినదిగా భావిస్తారు. ఈ ఆలయంలో పర్యాటకులను ఆకర్షించేందుకు వసతులు కల్పిస్తే ఈ వారసత్వ సంపదకు మరికొన్ని తరాల వరకు ఆదరణ ఉంటుంది.

**ఆదరణకు నోచుకోవటం లేదు**

కొల్లూరి సాయికుమార్, చరిత్ర పరిశోధకుడు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాచీన వారసత్వ సంపదకు కొదవలేదు. కానీ ఆదరణకు నోచుకోవటం లేదు. పురావస్తు శాఖ, ప్రభుత్వం పునరుద్ధరణ చర్యలు చేపడితే భావితరాలకు మన చరిత్ర తెలియజేయవచ్చు. దీంతో పర్యాటకంగా, ధార్మిక క్షేత్రాలుగా అభివృద్ధి చెందుతాయి.

**న్యూయార్క్ మ్యూజియంలో..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జూలపల్లి మండలం ధూళికట్ట గ్రామం గొప్ప బౌద్ధ మత కేంద్రంగా విరాజిల్లింది. ధూళికట్టలో క్రీ.పూ.2వ శతాబ్దం కాలం బౌద్ధ స్తూపం శిల్పకళా వారసత్వానికి నిదర్శనంగా నిలిస్తోంది. స్తూపం చుట్టూ నాగ ముచిలింద శిల్పం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 2023లో న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియంలో ఆహ్వాన బ్రోచర్‌పై ఈ నాగ ముచిలిందను ముద్రించటం విశేషం.

**కంద పద్యాలు వెలుగులోకి..**

గంగాధర మండలం కురిక్యాలలోని బొమ్మలమ్మ గుట్ట త్రిభాష శాసనం తెలుగు వారసత్వాన్ని చాటిచెప్పుతుంది. శాసనాన్ని వేములవాడ చాళుక్యుల కాలంలో క్రీ.శ.945లో పంప కవి సోదరుడు జీనవల్లభుడు వేయించాడు. దీని ద్వారానే తొలి తెలుగు కంద పద్యాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ గుట్టను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి పరచాలని స్థానికులు, తెలుగు భాష పరిరక్షకులు కోరుతున్నారు.

**ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి నగునూరు**

కరీంనగర్‌కు 8 కిమీ దూరంలోని నగునూరు గ్రామంలో శిథిలమైన దేవాలయాలు, ధ్వంసమైన విగ్రహాలు, శిలా శాసనాలు వారసత్వ సంపదకు అద్దం పడుతున్నాయి. గతంలో ఈ గ్రామంలో నాలుగు వందల ఆలయాలు ఉండటంతోనే నగునూరు అనే పేరు వచ్చింది అని ప్రతీతి. ఇక్కడి శివాలయంలోని శిల్పకళా సౌందర్యంగా ఉంటుంది. ఆదరణ లేక శిథిలావస్థకు చేరింది. ఇప్పటికీ ఈ శివాలయంలో పూజలు చేయడం విశేషం.

## కూలీలకు ఉపాధి.. పల్లెల పురోగతి



ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సత్ఫలితాలనిస్తోంది. కూలీలకు చేతినిండా పనితో ఉపాధి లభిస్తుండగా అభివృద్ధిలో పల్లెలు పురోగతి సాధిస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పనులు జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నాయి. అత్యధిక మంది కూలీలకు ఉపాధి కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 26,75,383 పనిదినాలను కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 15 రోజుల్లో 85,893 పనిదినాలను కల్పించారు.

**పనిదినాల కల్పనే లక్ష్యం**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారుతోంది. జిల్లాలో 98,055 కుటుంబాలకు జాబ్‌కార్డులున్నాయి. 2025-2026 నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 14834 కుటుంబాల్లోని 18,248 మంది పనికి హాజరయ్యారు. యాసంగి వరికోతలు పూర్తికాగానే ఉపాధిహామీ పథకం పనులను వేగవంతం చేయనున్నారు. ఒక్కో కూలీకి రోజుకు సగటున రూ. 307 గిట్టుబాటవుతోంది. క్రమంగా ఎండలు తీవ్రమవుతుండడం వల్ల ఉపాధి కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుంటున్నారు. మధ్యాహ్నంలోపే పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ పథకంతో నిరుపేదలు జీవనోపాధి పొందుతుండగా ప్రస్తుత వేసవిలో రైతు కుటుంబాల్లోని సభులు సైతం ఉపాధి పనులకు వెళుతున్నారు.

**నీటి నిల్వ - సంరక్షణ**

ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ నూతన ఆర్థిక సంవత్సరంలో నీటి నిల్వ, సంరక్షణ పనులకు పెద్దపీట వేయనున్నారు. ఇందులో పంటకాల్వలు, ఫీడర్‌ఛానళ్లలో పూడిక తీత, బీడు భూముల అభివృద్ధి, వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణాలు, ఖండిత కందకాల తవ్వకం, చేపల చెరువుల నిర్మాణ వంటి పనులతో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే మెటీరియల్ పనుల్లో పశువులు, గొర్రెల పాకల నిర్మాణం, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జి గుంతలు, కోళ్లఫారాల నిర్మాణం, ప్రభుత్వ సంస్థ కార్యాలయాల వద్ద వాననీటి రీఛార్జి గుంతల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

**లక్ష్యాన్ని చేరుకుంటాం** 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, జిల్లాలో ఈజీఎస్ లక్ష్యాన్ని ప్రణాళికతో పూర్తిచేస్తాం. సంబంధించిన పనులను గుర్తించి, మంజూరు తీసుకున్నాం. లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు వందశాతం పనులు కల్పిస్తాం. జిల్లాలోని కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుత వేసవిలో పనికి వెళ్లే కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. - శేషాద్రి, డీఆర్డీవో, రాజన్న సిరిసిల్ల

## దాహం తీరేదెలా!



సిరిసిల్ల : 'వీర్నపల్లి మండల కేంద్రంలో మిషన్‌భగీరథతో పాటు పంచాయతీలోని మూడు బోరుబావుల నీరు కలిస్తేనే ట్యాంకులు నిండుతాయి. ప్రస్తుతం రెండు బోరుబావులు అడుగంటాయి. ఎగువన ఉన్న సుభాష్‌నగర్, రజక కాలనీలకు సమీపంలోని ప్రైవేటు బోరుబావులను నెలకు రూ.4 వేల చొప్పున అద్దెకు తీసుకున్నారు. కాలనీవాసులు బోరుబావుల వద్దకు వచ్చి నీటిని తీసుకెళ్తున్నారు.

"గంభీరావుపేట మండలం రాజేశ్వరరావుకాలనీ పంచాయతీలో 200 గృహాలకు 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రక్షితమంచినీటి ట్యాంకు ఉంది. మిషన్‌భగీరథ నీరు రోజూ 10 వేల లీటర్లకు మించి సరఫరా కావడంలేదు. పంచాయతీ బోరుబావులు సైతం అడుగంటాయి. దీంతో సగం ఇళ్లకు నీరందని దుస్థితి నెలకొంది. భగీరథ నుంచి నీటి సరఫరా సామర్థ్యం పెంచాలని ఇరవైరోజుల క్రితం గ్రామస్థులు అధికారులను కోరినా ఫలితంలేకుండా పోయింది.'

రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న గ్రామాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే సమస్య ఉన్న 16 గ్రామాల్లో రూ.32.96 లక్షలతో కొత్తబోరుబావులు, పైపులైన్లు, అద్దెబావుల నుంచి పైపులైన్లు వేసేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. వీటిలో కొన్ని చోట్ల 600 మీటర్లలోతులో బోరు వేసినా నీటి ఊటలు రాలేదు. మరికొన్ని చోట్ల ప్రైవేటు బావులకు మోటార్లు, పైపులైను బిగించి గ్రామ రక్షిత మంచినీటి ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరిలోనే నీటి ఎద్దడి ఎదుర్కొనే ప్రాంతాలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేపడుతున్నట్లు ప్రకటించినా.. అవి కాగితాలకే పరిమితమైనట్లు తెలుస్తోంది.

**ఏటా తప్పని సమస్య**

జిల్లాలో రెండు పురపాలికలు.. 351 ఆవాసాలకు ఇంటింటికీ తాగునీటి సరఫరాకు రూ.1132 కోట్లతో భగీరథ పనులు చేపట్టారు. అయిదేళ్ల క్రితమే పనులన్నీ పూర్తికాగా నీటి సరఫరా చేశారు. వేములవాడ మండలం అగ్రహారం శుద్ధికేంద్రంలో 120 ఎంఎల్‌డీ (మిలియన్స్ ఆఫ్ లీటర్ పర్ డే) సామర్థ్యం కాగా 90 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా చేస్తున్నారు.

జిల్లాలో జనాభా పెరుగుతోంది. కాలనీలు విస్తరిస్తున్నాయి. సరఫరా సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు చేయాలి. అంతేకాకుండా భగీరథ ఇంట్రా విలేజ్ పనుల్లో చాలా వరకు పాతపైపులైన్లనే కొనసాగించారు. ప్రస్తుతం ఈ పైపులైన్లలో చాలా వరకు ధ్వంసమయ్యాయి.

2023లో భగీరథ గ్రిడ్ నిధుల నుంచి రూ.17 కోట్లను ఇంట్రాకు బదిలీచేసి 31.13 కిలోమీటర్ల మేరకు పైపులైన్లు, 15 గ్రామాల్లో రక్షిత నీటిట్యాంకులు నిర్మించారు. గ్రిడ్ నుంచి వచ్చే నీటి సామర్థ్యం సరిపోక ఇప్పటికీ చాలా గ్రామాల్లో పంచాయతీలోని పాత పథకాలను వినియోగిస్తున్నారు. గ్రిడ్ నీటికి.. పంచాయతీలోని బోరునీరు కలవడంతో శుద్ధజలం నాణ్యత దెబ్బతింటుంది. తాగునీటికి ఉపయోగించాల్సిన నీరు ఇతర ఇంటి అవసరాలకు వాడుతున్నారు. భగీరథ ఇంట్రా, మండల, గ్రామ పంచాయతీల మధ్య తాగునీటి పథకాల నిర్వహణలో సమన్వయలోపంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని ప్రణాళిక ప్రకారం చక్కబెడితేనే గ్రామాల్లో ఎద్దడి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

## లోపాల కుప్ప.. అనర్హుల తిష్ఠ

భువనగిరి: పీసీపీఎన్‌డీటీ (ప్రీ కన్‌సెప్షెన్స్ ప్రీనెటల్ దయాగ్నోస్టిక్ టెక్నిక్స్) ప్రత్యేక తనిఖీల్లో భాగంగా.. బృందం ఇటీవల జిల్లాలోని ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసింది. పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి, స్త్రీవైద్య నిపుణులు, రెవెన్యూ అధికారిణి, మహిళా పోలీస్, సఖీ కన్సల్టెంట్ వెల్ఫేర్ సభ్యులు బృందంలో సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో అనుమతి పొందినవి 57 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 41 మాత్రమే నడుస్తున్నాయి. వాటిలో 38 స్కానింగ్ కేంద్రాలు ఉన్న ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించింది. నిబంధనలు పాటించకుండా, అర్హత లేకున్నా ఆసుపత్రుల్లో స్కానింగ్ చేస్తున్నట్లు తనిఖీల్లో తేలింది.

భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా సమీపంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అర్హత లేకున్నా స్కానింగ్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు బృందం గుర్తించింది. అర్హత లేకున్నా పరీక్షలు చేస్తున్నట్లు తనిఖీలో తేలింది. వైద్యుడి చూపించిన అర్హతపై అభ్యంతం వ్యక్తం చేసి తెలంగాణ మెడికల్ కౌన్సెల్‌కు పంపించింది.

గర్భిణులకు నిర్వహిస్తున్న స్కానింగ్ పూర్తి వివరాలను ఫారం-ఎఫ్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. జిల్లాలో నిర్వహిస్తున్న చాలా కేంద్రాలలో వివరాలు నమోదు చేయడం లేదు. వైద్యశాఖకు పంపిన నివేదికలు, ఆసుపత్రుల్లో ఉన్న రికార్డులకు పొంతనలేకుండా ఉన్నాయి. రికార్డులు పాటించకుండా స్కానింగ్ చేస్తున్న కేంద్రాలు ఉన్నట్లు వైద్య బృందం గుర్తించింది.

గర్భిణులకు పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు, కేంద్రాల్లో తప్పనిసరిగా స్త్రీవైద్య నిపుణులు, రేడియాలజిస్టులు మాత్రమే స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. కొన్ని కేంద్రాల్లో అర్హత ఉన్న గైనిక్, రేడియాలజిస్టు పేర్లు మాత్రమే ఉంటున్నాయి. వారి స్థానంలో అర్హత లేని వ్యక్తులతో పనులు చేయిస్తున్నారు.

**నిబంధనలు గాలికి...**

అనుమతులు పొందిన ఆసుపత్రులు, నర్సింగ్‌హోం, డయాగ్నోస్టిక్ కేంద్రాలు నిబంధనల మేర భవనాల్లో నిర్వహించడం లేదు. య భువనగిరిలోని జిల్లా కేంద్రాసుపత్రి సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రుల, డయాగ్నోస్టిక్ కేంద్రాలు సెల్లార్‌లో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గైనిక్ ఆసుపత్రుల్లో గర్భిణుల పరీక్షల వివరాలను నమోదు రికార్డులు నిర్వహించాల్సి ఉన్నా.. నిబంధనలు పాటించడం లేదు. ఆసుపత్రుల్లో చేస్తున్న పరీక్షలు, కాన్పుల వివరాల నమోదు రికార్డులు, వైద్యశాఖకు పంపించిన రికార్డులకు పొంతన లేకుండా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం- డాక్టర్ యశోద, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి

పీసీపీఎన్‌డీటీ తనిఖీ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో 38 కేంద్రాల్లో తనిఖీలు చేశాం. అర్హత, నిబంధనలు పాటించకుండా తనిఖీల్లో వెలుగు చూసిన లోపాల ఆధారంగా చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేస్తాం. అర్హత లేకున్నా స్కానింగ్ చేస్తున్న వైద్యుల అర్హతలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నివేదిక అందజేసి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

## గతమెంతో ఘనం.. ఆదరిస్తే పదిలం

రాంనగర్ : ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన కట్టడాలు, అపురూప శిల్పసంపద ఉంది. గతమెంతో ఘనంగా ఉన్నా.. ఆదరణకు నోచుకోక.. కాలగమనంలో కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాలు, ప్రజలు పట్టించుకోక వేల సంవత్సరాల కిందట నిర్మించిన ఆలయాలు, కోటలు శిథిలమవుతున్నాయి. వారసత్వంగా లభించిన అమూల్య సంపదను రక్షించుకోవడం మన బాధ్యత. ఉమ్మడి జిల్లాలోని 37 కట్టడాలను వారసత్వ సంపదగా పురావస్తుశాఖ గుర్తించింది. మన చుట్టూ ఉన్న చారిత్రక సాంస్కృతిక వారసత్వ సంపద గురించి అవగాహన కలిగించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవంగా పాటిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వారసత్వ సంపదపై కథనం.

**ఎందుకు ఈ రోజు?**

మానవ వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు ఇందుకు పని చేస్తున్న సంస్థల కృషిని గుర్తించడానికి 1983 నుంచి ఏటా ఏప్రిల్ 18న ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది విపత్తులు, సంఘర్షణల నుంచి ముప్పులో ఉన్న వారసత్వం అనే అంశాన్ని తీసుకొని అవగాహన కలిగించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో వారసత్వ కట్టడాలు ఇలా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పురావస్తుశాఖ 37 కట్టడాలను గుర్తించింది. ఇందులో 20 చారిత్రక ప్రాంతాలు ఉండగా, 11 ప్రాచీనాలయాలు, ఆరు కోటలు ఉన్నాయి.

అద్భుత శిల్పసంపదతో నిర్మించిన ఆలయం జైనథ్‌లో ఉంది. ఆలయ పరిసరాల్లోని శిల్ప సంపద శిథిలమవుతోంది. ఇచ్చోడ మండలం సిరిచెల్మలో చెరువు మధ్యలో మల్లికార్జున స్వామి ఆలయం నిర్మించారు. బేల మండలం సదల్‌పూర్‌లో పురాతన భైరాందేవ్, మహదేవ్ ఆలయం ఉంది. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థలో ఉంది. ఉట్నూరులోని శివమందిరం, గోండుల కోట, మెట్లబావి, ఆనాటి వారసత్వ సంపదే. పురావస్తుశాఖ జాబితాలో కుంటాల, పొచ్చెర జలపాతాలకు చోటు దక్కింది. నేరడిగొండ వడూర్‌లో ప్రాచీన కోట, ఫిరంగి ఉంది.

భైంసాలోని క్రీ.శ.3వ శతాబ్దపు రాతి కట్టడాలు, క్రీ.శ.13వ శతాబ్దపు బాసర అమ్మవారి ఆలయం ఆసిఫాబాద్ సమీపంలోని పారేశ్వర్‌లోని రాతికట్టడాలు, వృక్షశిలాజాలు ఇప్పటికీ ఉన్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో శిలాజాలు ఉన్నాయి. ఖానాపూర్‌లోని రాజుల కోటను వారసత్వ సంపదగా పురావస్తుశాఖ గుర్తించింది, భైంసాలోని రావణుని పాదాల గుట్ట ఉంది. ఇక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక కనుమరుగవుతున్నాయి. ఉట్నూర్‌లోని ఈద్గా, శివమందిరం, గోండుల కోట ఆనాటి వారసత్వ సంపదే. క్రీస్తుశకం 14-16వ శతాబ్దంలోని ఆసిఫాబాద్, వాంకిడి, ఉట్నూరు, గుడిహత్నూర్‌లోని శివ మందిరాలు ప్రసిద్ధి చెందినవే.

వాంకిడి మండలంలోని క్రీ.శ.15వ శతాబ్దపు గంగాపూర్‌లోని వేంకటేశ్వర ఆలయం. ఆదిలాబాద్‌లో క్రీ.శ.16వ శతాబ్దపు కాలంలో నిర్మించినట్లుగా పేర్కొంటున్న మసీదు ఉంది. రక్షణ దిశగా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాచీన సంపదను రక్షించడంతో పాటు వాటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. నిర్మల్‌లోని శ్యాంగఢ్ కోటను సందర్శించేందుకు వీలుగా అక్కడ కొన్ని సౌకర్యాలను సమకూర్చారు. జోడేఘాట్‌లో కుమురంభీం విగ్రహంతో పాటు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు మ్యూజియం ఏర్పాటు చేశారు. కుంటాల జలపాతం వద్ద సౌకర్యాలు, హోటల్, పర్యాటకులు ఉండేందుకు వీలుగా గదులు, రక్షణ చర్యల కోసం రూ.3.81 కోట్లు మంజూరయ్యాయి. ఉట్నూరులోని కోట, మెట్ల బావి, తదితర వాటిని పునరుద్ధరించడంతో పాటు గత చరిత్రకు సంబంధించిన వాటిని నేటి తరానికి తెలియజేసేందుకు వీలుగా మ్యూజియం ఏర్పాటుకు రూ.3.92 కోట్ల వ్యయంతో నిర్మాణాలు జరుగుతున్నాయి. కుమురం భీం జిల్లాలోని సప్తగుండాల జలపాతం సమీపంలో రోప్‌వే, వ్యూపాయింట్, ఫెన్సింగ్ తదితరాల నిర్మాణానికి రూ.1.35 కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి.

# ఏళ్లుగా బీళ్లుగానే..

మల్లాపూర్: గోదావరిలో వృథాగా పోతున్న జలాలను బీడు భూములకు తరలించాలన్న ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన గంగనాల ప్రాజెక్టు కాలువ పనులు పూర్తికాకపోవడంతో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి. గత ప్రభుత్వంలో మామడ మండలం పొన్కల్ వద్ద బ్యారేజీ నిర్మాణం పేరిట రూ.531 కోట్లు మంజూరు చేసినప్పటికీ కాలువ పనులు ఆధునీకరించకపోవడం.. మొగిలిపేట పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు అవసరమైన పనులకు నిధులు కేటాయించకపోవడంతో వేల ఎకరాల పంట భూములకు సాగునీరు రాని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులోని గోదావరిలో ఆనకట్ట నిర్మించి గంగనాల ప్రాజెక్టు ద్వారా నీటిని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని 8 గ్రామాలకు సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ఎనిమిది సంవత్సరాల కిందట రూ.12.5 కోట్లు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. గుత్తేదారు సకాలంలో పూర్తిచేయకపోవడంతో పనులు ఆలస్యంగా పూర్తయ్యాయి. దీనికి తోడు మొగిలిపేట పెద్దచెరువుకు సాగునీటిని అందించే



కాలువలో సిమెంట్ లైనింగ్ చేపట్టకపోవడం, పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చకపోవడం వంటి పనులతో బీడు భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలంలోని ఫకీర్ కొండాపూర్, తిమ్మాపూర్ గ్రామాలతో పాటు మల్లాపూర్ మండలంలోని నడికుడ, మొగిలిపేట, సంగెం, శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లోని 4 వేల ఎకరాల భూములకు సాగునీరు రాని పరిస్థితులున్నాయి.

**పొన్కల్ బ్యారేజ్ నుంచి పైపులైను ద్వారా..**

తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.531 కోట్లతో గంగనాల ఎగువన ప్రస్తుతం నిర్మిస్తున్న పొన్కల్ బ్యారేజ్ నుంచి 18 కి.మీ దూరంలో ఉన్న మొగిలిపేట పెద్దచెరువుకు నేరుగా పైపులైను వేసి ఎత్తిపోతల ద్వారా నీటిని మళ్లించడంతో పాటు పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చితే ప్రయోజనం ఉంటుంది. దీంతో మరో ఆరు గ్రామాల్లోని 3200వేల ఎకరాలను సస్యశ్యామలం చేయవచ్చు. పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చి నీటి నిల్వ సామర్థ్యం పెంచితే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మొగిలిపేట చెరువును రిజర్వాయర్‌గా మార్చడంతో పాటు పొన్కల్ బ్యారేజీ నుంచి పైపులైను ద్వారా నీటిని మళ్లించడంపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

# ఎన్నాళ్లీ వెత..!

రాజపేట : జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమనే ఉపాధిమార్గం. వ్యవసాయానికి అనుబంధంగా వేలాది మంది రైతులు పశుపోషణ చేపట్టడమే కాకుండా పాల దిగుబడిలోనూ ఉమ్మడి జిల్లాతో పోల్చుకుంటే యాదాద్రి భువనగిరి జిల్లానే ప్రథమంగా ఉండటం గమనార్హం. ఈ తరుణంలో పశువులకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చిన పరిస్థితుల్లో పశువైద్య సిబ్బంది విధులు చేపట్టాల్సి ఉండగా,



జిల్లాలో ఎక్కువ శాతం ఖాళీలే ఉండటం విచారకరం. ఇందుకు ప్రత్యామ్నాయంగా గోపాలమిత్రల ప్రాథమిక సేవలను వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నారు. అయితే పశు వైద్యాధికారులు, రైతుల మధ్య అనుసంధాన కర్తలుగా ఉంటూ పాడి సంపద వృద్ధికి పాటుపడుతున్న గోపాలమిత్రలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏడు నెలలుగా ఇదే పరిస్థితి. జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేయడంతో పాటు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం అమలులో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు.

**విధులు ఇవీ..**

వీరు ప్రధానంగా పశు సంపద పెంచేందుకు కృత్రిమ గర్భధారణ (ఐఆర్) ప్రక్రియ చేపడుతుంటారు. ఎదకు వచ్చిన పశువులకు ఇంజక్షన్ ద్వారా వీర్యం ఎక్కిస్తారు. మేలు జాతికి చెందిన వీర్యం పశువులకు ఇవ్వడం, అధిక పాల దిగుబడి సాధనకు చర్యలు తీసుకోవడం వంటి విధులు చేపడతారు. డీఎల్డీఏ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

**వేతనాల పెంపు ఇలా..**

2000 సంవత్సరంలో ప్రభుత్వం గోపాలమిత్రల వ్యవస్థను అందుబాటులోకి తేగా, వీరి పనులను బట్టి దశలవారీగా వేతనాలు పెంచారు. తొలుత ప్రారంభంలో రూ.1200 ఉండగా, ఆ తర్వాత రూ.3,500లకు పెరిగింది. స్వరాష్ట్రం ఏర్పడ్డాక 2018 సెప్టెంబరులో రూ.8,500 పెరిగింది. ఇక రెండేళ్లుగా రూ.11,050లు చెల్లిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా విధులు చేపడుతున్న వీరికి సకాలంలో వేతనాలు అందక పోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందంటున్నారు. ప్రతినెలా టీఎస్ఎల్‌డీఏ సీఈవో కార్యాలయం నుంచి వీటిని విడుదల చేస్తుంటారు. మరో వైపు పశువుల్లో కృత్రిమ గర్భధారణ నిర్ధారణ పరీక్ష చేసినందుకు రూ.100 చొప్పున ప్రోత్సాహకం చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడు అది కూడా లేకపోవడం విచారించదగ్గ విషయం. ఈ విషయమై ఉన్నతాధికారులను విన్నవిస్తే బడ్జెట్‌లేమి కారణంగా ఆలస్యమని, త్వరలో చెల్లింపులుంటాయని అంటున్నట్లుగా తెలిసింది.

జిల్లా సమాచారం..

గోపాలమిత్రల సంఖ్య : 65
మొత్తం పశువుల సంఖ్య : 1,91,793
రోజూ పాలదిగుబడి : 52వేల లీటర్లు
తెల్లజాతి పశువులు : 69,173
నల్లజాతి పశువులు : 1,22,620

# నిధుల గండం.. నీళ్లు గగనం



కరీంనగర్: వానాకాలం వస్తుందంటే రైతులు ఆందోళన చెందే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. సమృద్ధిగా వానలతో పంటలు పండుతాయన్న ఆనందం కన్నా మరమ్మతుకు నోచని కాలువలతో ఆయకట్టుకు సాగునీరందలేని పరిస్థితి కలవరపరుస్తోంది. ఏడెనిమిదేళ్లుగా ప్రధాన కాలువలతో పాటు చిన్న నీటి కాలువలకు మరమ్మతులు కరవయ్యాయి. ఏడేళ్లుగా నిధుల కోసం ప్రతిపాదనలు పంపడమే తప్ప మంజూరైన దాఖలాలు లేవు. నాలుగు జిల్లాల పరిధిలో 16 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో 60 శాతానికి పైగా నీరందించడానికి ఈ కాలువలే ఆధారమవుతున్నాయి.

**నాడు కొన్ని చోట్లకే పరిమితం**

కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 137 కి.మీ.ల మేర వరదకాలువ విస్తరించి ఉంది. దీన్ని ఇరువైపులా నాలుగు దశల్లో పటిష్ఠం చేయాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా గాయంత్రి పంప్‌హౌస్ నుంచి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట వరకు పంప్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టిన సమయంలో పలు చోట్ల కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టారు. మల్యాల మండలం నుంచి ఎస్సారెస్పీ వైపునకు నీరు పారేందుకు వీలుగా కాలువను చదును చేశారు. ఇందుకోసం రూ.28 కోట్ల వరకు వెచ్చించారు. దిగువ మానేరు కింద వరంగల్ వైపు కీలకమైన కాకతీయ కాలువను బాగు చేస్తామన్న ప్రతిపాదన అటకెక్కింది. 2016-17లో అయిదారు చోట్ల రూ.80 కోట్లతో లైనింగ్ పనులు చేపట్టడంతో కాలువల్లో కాస్తో కూస్తో నీళ్లు నిలువగలుగుతున్నాయి. ఈ మార్గంలో ఇంకా ప్యాచ్ వర్క్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఈ రెండు నెలలే కీలకం**

జూన్‌లో వర్షాలు పడే సమయానికే మరమ్మతులు పూర్తయితే వానాకాలం పంటలకు ఇబ్బందులుండవు. 2022లో మరమ్మతులకు దాదాపు రూ.1200 కోట్లు అవసరమని లెక్కలేశారు. ఇటీవల క్షేత్ర స్థాయిలో అంచనాలు రూపొందించి అత్యవసరంగా దాదాపు రూ.212 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు తేల్చి చెప్పినా ఇప్పటికీ నిధుల ఊసే లేదు. మరమ్మతుల విషయమై ఎస్సారెస్పీ కరీంనగర్ జిల్లా ఈఈ నాగభూషణంతో మాట్లాడగా కాలువల్లో మొక్కలు, పొదలు తొలగించేందుకు, 10 వేల ఎకరాలకు ప్రయోజనం కలిగించే కాలువల మరమ్మతుకు ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

**తక్షణావసరాలు ఇవీ..**

ఏటా వర్షాకాలంలో సమీపంలోని గుట్టలోని మట్టి కరిగి వరద కాలువలో పూడిక పెరుగుతోంది. కొన్ని చోట్ల నాలుగు మీటర్ల ఎత్తు వరకు పెరిగిన మట్టిని తొలగించాలి.

కొత్తగా ఫీడర్ ఛానళ్ల నిర్మాణం లేకపోవడంతో పంటలకు నీరందడం కష్టంగా మారింది. వరద కాలువలపై 100కు పైగా కొత్త ఫీడర్ ఛానళ్లు నిర్మించాల్సిన అవసరముంది.

డిస్ట్రిబ్యూటరీ కాలువల లైనింగ్ చాలా చోట్ల దెబ్బతింది. ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరమని రెండేళ్ల కిందట అంచనా వేశారు.

వరద ఉద్ధృతికి కాలువలకు గండ్లు పడటంతో తాత్కాలికంగా రాళ్లు, మట్టి, సిమెంటు బస్తాలు వేశారు. ఆయా ప్రాంతాల్లో ఈ వేసవిలో మరమ్మతులు చేస్తే బాగుంటుంది.

చాలా చోట్ల తూములు పాడయ్యాయి. పలు చోట్ల రూపును కోల్పోయి అధ్వానంగా మారడంతో వచ్చే వానాకాలంలో నీరు నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. ఉపాధిహామీ పథకంలో కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా ముళ్ల పొదలను, చెత్తను తొలగించి మట్టి పనులు మాత్రం చేపట్టారు. సిమెంటు పనులు చేయాల్సి ఉంది.

# అవయవ మార్పిడులు అరకొర వసతులతోనేనా?



హైదరాబాద్ : పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసే ఉద్దేశంతో గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక అవయవ మార్పిడి కేంద్రం పనులు నత్తను తలపిస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వసతులు లేమితో అవయవ మార్పిడిలో ప్రైవేటు ఆసుపత్రులే ముందుంటున్నాయి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలు సేకరించాలంటే.. అత్యాధునిక మౌలిక వసతులు ఉండాలి. వైరస్, బ్యాక్టీరియా లోపలకు వెళ్లలేని ఆధునిక మాడ్యులర్ థియేటర్లు అవసరం. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియాలో ఈ పరిస్థితి లేదు. అడపాదడపా మార్పిడి చికిత్సలకు ప్రస్తుతం ఉన్న థియేటర్లనే వాడుతున్నారు. వసతులు లేక బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల నుంచి అవయవాల సేకరణ కష్టమవుతోంది. నిధులు మంజూరైనా..

గాంధీ ఆసుపత్రిలో ఆధునిక అవయవ మార్పిడి కేంద్రం అందుబాటులోకి తెచ్చేందుకు గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని అవయవాల మార్పిడి ఒకేచోట చేపట్టేలా.. ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రధాన భవనంలోని ఎనిమిదో అంతస్తులో రూ.35 కోట్లతో 6 ఆధునిక ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గుండె, మూత్రపిండాలు, లివర్, ఊపిరితిత్తులను మార్పిడి చేయడంతో పాటు ఆర్థోపెడిక్ సంబంధిత కీళ్లమార్పిడి, ఈఎన్‌టీకి చెందిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల కోసం మొత్తం ఆరు ఆపరేషన్ థియేటర్ల పనులు సాగుతున్నాయి. 2021లో నిధులు మంజూరు కాగా.. రెండేళ్ల కిందటే పూర్తి కావాల్సిన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

**నోడల్ కేంద్రంగా...**

ప్రభుత్వ ఆధ్వర్యంలో అవయవ మార్పిడికి సంబంధించి నోడల్ కేంద్రంగా గాంధీని ప్రకటించారు. సర్కారుపరంగా అవయవ మార్పిడి చికిత్సలన్నీ ఇక్కడే చేసేలా సదుపాయాలు కల్పించాలనేది ప్రణాళిక. థియేటర్లతోపాటు వైద్య నిపుణులు, శిక్షణ పొందిన నర్సులు అవసరం. నిమ్స్ తర్వాత అవయవ దానం మార్పిడిలో గాంధీని అదే స్థాయిలో తీసుకొచ్చేందుకు యోచిస్తున్నారు.

**పేదలకు భరోసా....**

కిడ్నీ, కాలేయ, గుండె మార్పిడులకు రూ.లక్షల ఖర్చు అవుతోంది. దీనిని పేదలు భరించలేని పరిస్థితి. కిడ్నీ, కాలేయం దానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తున్నా.. డబ్బులు లేక చేతులెత్తేస్తున్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వమే ఖర్చు భరించి పేదలకు అవయవ మార్పిడి చేయిస్తుంది. కాలేయం, గుండె మార్పిడికి రూ.10 లక్షల నిధులు అందిస్తోంది. అన్ని రకాల సదుపాయాలతో కూడిన ప్రత్యేక అవయవ మార్పిడి కేంద్రం అందుబాటులో ఉంటే.. పేదలకు ఎంతో మేలు జరగనుంది. గాంధీ అధికారులు మాట్లాడుతూ.. పనులు కొలిక్కి వస్తున్నాయని, త్వరలో కేంద్రం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

# జాప్యం నివారణకు సాఫ్ట్‌వేర్

మల్యాల: ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో నెల రోజులు దాటినా ధాన్యం తూకం వేయకుండా ఇబ్బందులు పెట్టేవారు. తరుగు పేరుతో ఇబ్బంది పెట్టడంలాంటి సంఘటనలతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసేవారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలించి నిర్ణీత తేమ శాతం ఉంటే వెంటనే టోకెన్ అందజేసి ధాన్యం కుప్పను ఫొటో తీసుకొని గన్నీ సంచులు ఇవ్వాలి. ప్రస్తుతం రైతు వివరాలను కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికీ ధాన్యం తూకం వేసి రవాణా చేసిన తర్వాతే వివరాలను నమోదు చేసేవారు.

రవాణా సమయంలోనూ ధాన్యం లారీ ఫొటో, వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏ కొనుగోలు కేంద్రం నుంచి ఏ రైసుమిల్లుకు లారీ వెళ్తుందో వివరాలతోపాటు, లారీ ఫొటో, సమయాన్ని ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల లారీ రైసుమిల్లు వద్ద ఎన్ని గంటలు నిలిచి ఉంది, ధాన్యం అన్‌లోడ్‌కు ఎంత సమయం పట్టింది, జాప్యానికిగల కారణాలను జిల్లా పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు తెలుసుకునే వీలుంటుంది. జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని మండల ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు. మల్యాల మండలంలోని పలు గ్రామాల్లో వరద కాలువ వెంట ఖాళీ స్థలాల్లో రైతులు ధాన్యం పోసుకొని దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసేలేదు. వడ్లు బాగా ఎండితే



నూకలుగా మారే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఓసారి అకాల వర్షంతో కొందరు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. మరికొన్ని గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా లభించడంలేదని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభిస్తే ఖాళీ అయిన ప్రదేశాల్లో కొత్తగా వచ్చే రైతులు ధాన్యం నిలువ చేసుకునే అవకాశం ఉంటుంది. మల్యాల మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 4, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

# నీటికి.. రూ.కోటి..!

భానుపురి : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతి పల్లెలోనూ ఇబ్బందులు రానివ్వకుండా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు వేసవిలో నీటిపై దృష్టిసారించారు. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు కూడా వట్టిపోయాయి. దీంతో జిల్లాకు ప్రత్యేకంగా నీటి అవసరాలకు రూ.కోటి నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిధులతో నీటిఎద్దడి నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడానికి మిషన్ భగీరథ అధికారులు సిద్ధమవుతున్నారు. గతేడాది వేసవిలో నీటి సమస్యలు ఎదురైన గ్రామాలతోపాటు అన్ని ప్రాంతాల్లోనూ నీటి పంపులు, పైపులు తనిఖీలు చేపట్టి సమస్య ఉంటే పరిష్కరించనున్నారు.

**తీసుకోనున్న చర్యలు..**

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం, లేదా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించనున్నారు. శుద్ధినీరు సరఫరా చేసే పైపుల లీకేజీలు గుర్తించి తక్షణమే పనులు చేయించడం.



గ్రామాలు, పట్టణాల్లో పనిచేయని చేతి పంపులు, బోరు మోటార్లకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావడం. లీకేజీ పైపులు తొలగించి కొత్తవి వేయడం, పగిలినచోట మరమ్మతులు చేయించడం. మురుగు కాల్వల్లో పైపులైన్లు లేకుండా చూడటం.

నీటి సమస్య రాకుండా ప్రణాళిక.. – అరుణాకర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ మిషన్ భగీరథ, సూర్యాపేటకలెక్టర్ ఆదేశాల మేరకు నీటి సమస్య రాకుండా ప్రణాళిక రచిస్తున్నాం. ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే సిబ్బందితో వచ్చి పరిష్కారం చూపుతాం. వేసవిలో ఏ ఒక్క గ్రామంలో కూడా నీటి ఇబ్బందులు రానివ్వం. సమస్య తీవ్రంగా ఉన్న చోట ప్రత్యామ్నాయంగా బోరుబావులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అద్దెకు తీసుకుంటాం.

# వారం.. రోజుకో కార్యక్రమం..!

మునగాల : వెనకబడిన, ప్రతికూల నేపథ్యాల నుంచి వచ్చిన బాలికలకు మెరుగైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ విద్యాలయాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులకు వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. ఈ నెల 24 నుంచి విద్యాలయాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి 23వ తేదీ వరకు విద్యార్థినులకు రోజుకో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమాల అమలుకు సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ దిశానిర్దేశం చేసింది. మొదటిరోజు (17వ తేదీన) వారం రోజుల ప్రణాళిక, విధుల కేటాయింపు

18న విద్యార్థులకు నచ్చిన, ఇష్టమైన కథలను తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల్లో రాయడం, చదవడం

19న స్పోకెన్ ఇంగ్లిష్, ప్రసంగాలు చేయడం

20న జీవనోపాధి మార్గాలు, కథా రచన కొనసాగింపు

21న కస్తూరీ విజయం: కస్తూర్బా పాఠశాల విద్యార్థుల విజయాలు

22న జీవన నైపుణ్యాలు

23న పేరెంట్, టీచర్ మీటింగ్

ఈ కార్యక్రమంలో సురక్షిత, బాధ్యతాయుతమైన ప్రవర్తన, బాల్య వివాహాలపై స్కిట్ రూపంలో అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తారు. చివరిరోజు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థినుల స్థితిగతులను వివరిస్తారు.


కలల సాకారానికి ప్రత్యేక కార్యక్రమాలు– పూలమ్, జీసీడీవో

విద్యార్థినులు అడ్డంకులను అధిగమించి తమ కలలను సాకారం చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశాలు భారీగా పెరగడానికి ఇవి దోహదపడతాయి. బాలికలకు భరోసా కల్పించేలా విశ్వాసాన్ని పెంపొందిస్తాం.

# ఎండాకాలంలో.. మూత్రపిండాలకు గండం

నల్గొండ : జిల్లాలో మూత్రపిండాల బాధితులు వయస్సుతో నిమిత్తం లేకుండా ఏటికేడు పెరుగుతూనే ఉన్నారు. ఈ వేసవి కాలంలో మూత్రపిండాల వ్యాధి బారిన పడేవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. ఫ్లోరిన్ నీరు, రక్తపోటు, మధుమేహం అదుపులో లేకపోవడం, పొగ మద్యం అధికంగా తాగడం, ఆహార నియమాలు పాటించక పోవడం, సరైన శారీరక వ్యాయామం లేక పోవడం వంటి కారణాల మూలంగా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, ఇన్‌ఫెక్షన్లు రావడం జరుగుతుంది. దీనిని నిర్లక్ష్యం చేయడంతో కిడ్నీ ఫెయిల్యూర్ రావడం, చివరికి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని వైద్యులు చెపుతున్నారు.

జిల్లాలో ప్రస్తుతం అయిదు ప్రాంతాల్లో మాత్రమే రక్తశుద్ధి కేంద్రాలు ఉన్నాయి.



వాటిలో ప్రస్తుతం 35 యంత్రాలు ఉండగా 290 మందికి పైగా రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులతో పాటు హైదరాబాద్‌లో రక్తశుద్ధి చేయించుకుంటున్న వారి సంఖ్య మరికొంత ఉంటుంది. అత్యధికంగా నల్గొండ పరిసర ప్రాంతంలో ఉన్నారు. ఇక్కడ మరో 10 రక్తశుద్ధి యంత్రాలు అవసరం ఉంటుందని బాధితులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. జిల్లాలో కేతేపల్లి, నకిరేకల్, మునుగోడు ప్రాంతాల్లో కూడా కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాధితులకు ఉపశమనం దక్కే అవకాశాలున్నాయి. ఏర్పాట్లు చేస్తున్నాం డా.మాతృనాయక్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, నల్గొండజిల్లాలో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న మాట వాస్తవమే. ప్రాథమిక దశలో ఆసుపత్రులకు వచ్చిన వారికి సూచనలతో పాటు మాత్రల ద్వారా వ్యాధి తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కుటుంబ సభ్యుల్లో బాధితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

చురకలు




# దిగువకు పాతాలగంగ

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గత నెలతో పోలిస్తే జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో సగటున 2.45 నుంచి 1.54 మీటర్ల మేర దిగువకు పడిపోయాయి. జిల్లా భూగర్భ జలశాఖ తాజా నివేదిక దీనిని స్పష్టం చేస్తోంది. మరోవైపు గత నాలుగు రోజులుగా సగటున 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు మరింత వేగంగా లోతుకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో యాసంగి వరి 1.77 లక్షల ఎకరాలు.. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయలు కలిపి నాలుగు వేల ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాదితో పోల్చితే వరిసాగు 20 వేల ఎకరాలు పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి పంటకు ఈ రెండు నెలలు కీలకం. పొట్టదశలో కంకులు పాలుపోసుకుంటాయి. ఇప్పుడు నీటి తడులు ఎక్కువ అందిస్తే... దానికి తగ్గట్టుగా దిగుబడి పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంత మేర నీటి లభ్యత కనిపించడం లేదు.

మధ్యమానేరులో 15.95 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడి నుంచి దిగువమానేరు, కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ జలాశయం నుంచి ఇల్లంతకుంట మండలంలోని చెరువులను నింపారు. ఎగువమానేరులోకి మల్లన్నసాగర్‌నుంచి గత నెలలోనే 0.5 టీఎంసీల నీటిని తరలించారు. ఆయా కాల్వల పరిధిలోని ఆయకట్టు మినహా మిగతా ప్రాంతమంతా బోరుబావులే ఆధారం. మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయి. దీని ప్రభావం సాగుచేసిన పంటలపై పడుతోంది.

పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో బోరు బావుల నుంచి అన్నదాతలు



నిరంతరం నీటిని తోడుతున్నారు. ఈ ఏడాది తక్కువ రోజుల్లో ఎక్కువ వర్షాలు కురవడంతో భూగర్భంలోకి తక్కువ నీరు ఇంకింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

నాకున్న 2.20 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న మరో 2.20 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం వరి సాగు చేశా. ఇందులో రెండు వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. గత నెలరోజుల్లో రెండు బోరుబావుల్లో నీటి మట్టం పడిపోయింది. పొట్టదశ సమయంలో మూడెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండెకరాల్లో పంట పూర్తిగా చేతికొచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. మాది మల్కపేట జలాశయం దిగువన కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామం. జలాశయంలో నీరు నింపితే చుట్టూ ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండే అవకాశం ఉంది. పొన్నం లింగం, రైతు వెంకట్రావుపేట, కోనరావుపేట మండలం

# బాల బడులు.. కనీస వసతులు కరవు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని బీసీ కాలనీలో మూడో అంగన్‌వాడీ కేంద్రం ఇది. ఇందులో 18 మంది చిన్నారులు ఉండగా 8 మంది గర్భిణులు, ఆరుగురు బాలింతలు లబ్ధిపొందుతున్నారు. సొంత భవనం ఉంది. శౌచాలయం ఉన్నా దానికి నీటి సరఫరా లేదు. కనీసం పిల్లలు గొంతు తడుపుకునేం దుకైనా తాగునీరు మృగ్యమైంది. బయట ఉన్న ట్యాంకు నుంచి బిందెలతో నీళ్లు తీసుకొస్తే చిన్నారులు చేతులు శుభ్రపరచుకోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు సౌకర్యం లేదు. ఎండలు, ఉక్కపోత పెరుగుతున్న దృష్ట్యా తన సొంత ఖర్చులతో విద్యుత్తు తీగలను అమర్చి, ఫ్యాన్‌కు మరమ్మతు చేయించేందుకు ఇప్పటికే ఎలక్ట్రీషియన్‌తో మాట్లాడినట్లు అంగన్‌వాడీ టీచర్ జి.లావణ్య తెలిపారు.

**చిన్నారులకు తప్పని ఇబ్బందులు**


మాతా శిశుసంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, 0 నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. కాగా పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్)పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కొన్ని కేంద్రాలు సొంత భవనంలో నడుస్తుండగా మరికొన్ని అద్దె ఇళ్లు, పాఠశాలల గదుల్లో కొనసాగు తున్నాయి. అనేక కేంద్రాల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. శౌచాలయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాలున్న కేంద్రాల్లో నీటి సరఫరా లేకపోవడం వల్ల వాటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. అనేక కేంద్రాల్లో విద్యుత్తు కనెక్షన్లు,



ఫ్యాన్లు లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీల నుంచి 15 శాతం బడ్జెట్‌ను కేటాయించి అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాల్సి ఉన్నా, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 6 మాసాల నుంచి 3 సంవత్సరాల వయసు చిన్నారులు 18,838 మంది, 4020 మంది గర్భిణులు, 2533 మంది బాలింతలు, 15,374 మంది మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలు లబ్ధిపొందుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి** అంగన్‌వాడీ కేంద్రానికి పగటిపూట వెళుతున్నాం. అక్కడ శౌచాలయం నిరుపయోగంగా ఉంది. ఫ్యాన్ నడవకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందిగా ఉంది. ఎండ తీవ్రత పెరగడంతో చిన్నారులు సైతం అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచి మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వైష్ణవి, గర్భిణి, రాచర్ల బొప్పాపూర్

# నైపుణ్యాల పెంపునకు అడుగులు



మెదక్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా టాటా సంస్థ సహకారంతో పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో అధునాతన సాంకేతిక కేంద్రాలను (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల ఐటీఐలకు మహర్దశ పట్టనుంది. జిల్లా పరిధిలో ప్రభుత్వ ఐటీఐ జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో కొనసాగుతోంది. మారిన పరిస్థితులు, పోటీ ప్రపంచం నేపథ్యంలో యువత నైపుణ్యాలను మెరుగుపరచాలన్నది సర్కారు లక్ష్యం. ఈ నేపథ్యంలోనే మెదక్ ఐటీఐకి ఏటీసీని మంజూరు చేసింది. కొత్త భవన నిర్మాణ పనులు హవేలిఘనపూర్‌లో మొదలయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కోర్సులను ప్రారంభించే అవకాశం ఉంది.

**ప్రభుత్వ పరిధిలో ఒకటే:** జిల్లాలో మొత్తం ఐటీఐ కళాశాలలు ఏడు ఉండగా, ప్రభుత్వ ఒకటి, ప్రైవేటువి ఆరు కొనసాగుతున్నాయి. వీటిల్లో 1,400 విద్యార్థులున్నారు. ప్రభుత్వ పరమైన ఐటీఐ కళాశాల ఒకటి మాత్రమే ఉంది. ఇది జిల్లా కేంద్రంలో ఉండగా, నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతు న్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఏటీసీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో ఈ నియోజకవర్గంలోని విద్యార్థుల ఆశలు చిగురించాయి. ఒక్కో ఏటీసీ కేంద్రానికి రూ.4.73 కోట్లు వెచ్చించనున్నారు. కంప్యూటరైజ్డ్ తరగతి గదులు, వర్క్‌షాపులు, ఎలక్ట్రిక్ వాహనాల టెస్టింగ్ సౌకర్యాన్ని సమకూర్చనున్నారు.

**ఉద్యోగ, ఉపాధి కల్పన:** కేంద్రంలో వివిధ నైపుణ్య కోర్సులు నేర్చుకున్న యువతకు టాటా సంస్థ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో మంచి జీతభత్యాలు చెల్లించే ఉద్యోగాలకు ఆధునిక కోర్సులు చేసిన యువతను ఎంపిక చేసే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. టాటా సంస్థ సహకారంతో రూ.కోట్ల విలువైన ఆధునిక యంత్రాలు, పరికరాలు, కంప్యూటర్స్, ఇతర సామగ్రి, అవసరమైన వసతులు సమకూర్చనున్నారు. **కోర్సులు :** మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్, అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్.

**నిరుద్యోగ యువతకు వరం**

శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మెదక్, ఐటీఐ

ఏటీసీలో ఇచ్చే ఆధునిక సాంకేతిక శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుంటే వరంలా ఉపయోగపడుతుంది. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కోర్సులపై అవగాహన పెంచుకుని శిక్షణ పొందేందుకు ముందుకు రావాలి. పదో తరగతి చదివినవారే ఈ కోర్సులు చేసేందుకు అర్హులు. కొత్త ఏటీసీల ఏర్పాటుపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది

# మేము చేయలేం.. ఉపాధి పనులు



తాంసి : ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు మార్చి 31 చివరి గడువు. అప్పట్లోగా పనులు చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి. నేటికీ సగానికి పైగా పనులు మొదలే కాలేదు. అసలు పనులు ప్రారంభమవుతాయో లేదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

**రూ.32.93 కోట్లు**

ఉపాధి హామీ పథకం కింద ఏడాదంతా లేబర్‌వేజ్ కంపోనెంట్ కింద 60 శాతం, మెటీరియల్ కంపోనెంట్ కోసం 40 శాతం నిధులు ఖర్చు చేస్తారు. ఆర్థిక సంవత్సరం చివరిలో ఈ పనులు చేపడుతుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.32.93 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 684 పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనుల్లో సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంలో భాగంగా ఎక్కువ శాతం సీసీ రోడ్లు నిర్మిస్తుంటారు.

**నేటికి 254 పనులే ప్రారంభం..** ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు త్వరగా బిల్లులు రావనే ఉద్దేశంతో పాటు సోషల్ ఆడిట్ కింద మంజూరైన నిధుల్లో గతంలో 5 శాతం ఉంటే ఈసారి 10 శాతం కోత విధించడం, ఇసుక, కంకర, సిమెంట్ ధరలు పెరగడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లాలో ఇంతవరకు 684 పనుల్లో 254 మాత్రమే ప్రారంభమయ్యాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పనులు చేయాలంటూ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులకు కబురు పంపుతున్నా.. చేయలేమంటూ వారు తప్పుకొంటున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో పనులు పూర్తి చేస్తారో లేదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువులోగా పూర్తి చేయిస్తాంశివరాం, ఈఈ పంచాయతీరాజ్ జిల్లాలో ఇంతవరకు 254 పనులు ప్రారంభమయ్యాయి. మిగతా పనులు కూడా త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించాం.

# రైతు వేదిక.. నిర్వహణ లేక..

నిర్మల్ : రైతు వేదికల నిర్వహణకు నిధుల్లేక నిస్తేజంగా మారుతున్నాయి. 30 నెలలుగా ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలు లేక ఈ వేదికలకు వచ్చే అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఏఈవోలు తమ సొంత డబ్బులతో రైతు వేదిక నిర్వహణ చూసుకుంటున్నారు. రెండేళ్లకుపైగా విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో కనెక్షన్లు ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**ఆరంభంలో ఆర్భాటం**

నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. పంటల సాగుపై అన్నదాతలకు సూచనలు, సలహాలు, శిక్షణ తరగతుల నిర్వహణ, తదితర లక్ష్యాల కోసం వీటిని నెలకొల్పారు. ప్రతి 5 వేల మంది కర్షకులకు, రెండు నుంచి నాలుగు గ్రామాలకు కలిసి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి వ్యవసాయశాఖ ద్వారా రూ.12 లక్షలు, ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించారు. జిల్లాలో 79 క్లస్టర్లలో వీటిని నిర్మించి ఒక్కోదాని నిర్వహణకు ఒక ఏఈవోను నియమించారు. పంటల సాగుపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా వాటి నిర్వహణకు నిధుల్లేక ఏఈవోలకు భారంగా మారాయి.

**సమస్యలతో సతమతం**

ఒకే చోట రైతులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. జిల్లాలోని చాలా చోట్ల కనీస సౌకర్యాల్లేక ఉపయోగించడం లేదు. కొన్ని ఊరికి దూరంగా ఉండటంతో ఉపయోగం లేకుండా పోయాయి. వేదికను శుభ్రంగా ఉంచడానికి వీలుగా స్వీపర్లను నియమించలేదు. ఆరంభంలో తాగునీటి సౌకర్యం, విద్యుత్తు ఛార్జీలు, మరుగుదొడ్ల నిర్వహణకు నెలకు రూ.3 వేల కేటాయించింది. అవి సరిపోవని అధికారులు అప్పట్లో ప్రభుత్వం



దృష్టికి తీసుకెళ్లడంతో రూ.9 వేలు ఇచ్చారు. 2022 ఆగస్టు వరకు నిధులు వచ్చాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. కొందరు అధికారులు సొంత డబ్బులతో రైతు వేదికలను శుభ్రం చేయిస్తున్నారు. రైతులతో సమావేశం నిర్వహించినప్పుడు తాగునీటిని తెప్పిస్తున్నారు. ఉదాహరణకు నిర్మల్ మండలం ఎల్లపెల్లి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికను కొత్త పోచంపాడ్ గ్రామ సమీపంలో నిర్మించారు. భైంసా మండలం మహాగావ్, దిలావర్‌పూర్‌లలో గ్రామ శివారులో రైతు వేదికలు నిర్మించడంతో ఉపయోగంలో లేకుండా పోతున్నాయి. మిగతా ప్రాంతాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ అక్కడి వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి:**

రైతు వేదికల నిర్వహణకు 30 నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఏఈవోలు సొంత డబ్బు వెచ్చిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమావేశాల సమయంలో హాలును సిద్ధం చేయడం, కుర్చీలు వేయడం వంటి పనులకు అటెండర్లు లేక ఏఈవోలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతి రైతువేదికకు అటెండర్‌ను నియమించాలి. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి.

బానావత్ రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏఈవోల సంఘం

# ఎల్‌ఆర్‌ఎస్!

ఆసిఫాబాద్ : అనధికార భూముల క్రమబద్ధీకరణకు అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు దారులకు ఫోన్‌లు చేస్తూ సహకారం అందించేలా కలెక్టరేట్, పురపాలికల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 31 లోపు క్రమబద్ధీకరించుకుంటే 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కలెక్టర్, అదనపు కలెక్టర్లు సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. గత నెల నుంచి ప్రభుత్వ రాయితీ ప్రకటించడంతో స్పందన కనిపిస్తోంది.

**పుర పరిధిలో..**

జిల్లాలోని రెండు పురపాలికల పరిధిలో మొత్తం 3,529 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 92 మంది పూర్తి స్థాయిలో పత్రాలు సమర్పించలేదు. 15 తిరస్కరించారు. 311 మంది భూములకు సంబంధించి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. మిగతా 3,027 మందికి ఫీజు చెల్లించాలని అధికారులు సమాచారమిచ్చారు. గత నెలలో 30 మంది మాత్రమే రూ.11 లక్షల వరకు చెల్లించి ధ్రువపత్రాలు పొందారు.



రాయితీ ప్రకటించడంతో.. ఆ సంఖ్య పెరుగుతోంది. తాజాగా 125 మంది రూ.27 లక్షల వరకు ఫీజు చెల్లించారు. వీరిలో 64 మందికి అధికారులు ప్రొసీడింగ్స్ అందించారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో అన్ని సవ్యంగా ఉన్న వారి వివరాలను రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కి పంపించారు. ఆ సర్వే నంబర్‌ల ఆధారంగా భూముల క్రమబద్ధీకరణకు అక్కడి నుంచి సమాచారమిస్తున్నారు. బల్దియాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల నుంచి సిబ్బంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వార్డు ఆఫీసర్లు, కార్యదర్శులు సైతం ఫోన్లు చేసి రాయితీపై వివరిస్తున్నారు. 2020 ఆగస్టు 26కు ముందు భూములు కొని ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారు ఫీజును చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. అప్పుడు దరఖాస్తు చేయని వారు మాత్రం రిజిస్ట్రేషన్ కార్యాలయం వెళ్లి చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు.. గతంలో భూ యజమాని దరఖాస్తు చేసుకొని తరువాత మరొకరికి విక్రయించారు అనుకుంటే.. అలాంటి వారు ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. అయితే ఆ భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తాజాగా క్రమబద్ధీకరించుకోవచ్చని, ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించింది భూమికే కానీ వ్యక్తికి కాదని అధికారులు చెబుతున్నారు.

**పంచాయతీల్లో..** పంచాయతీల పరిధిలో మొత్తం 3,665 దరఖాస్తులు రాగా.. 2,299 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని సమాచారమిచ్చారు. నెల కిందటి వరకు ఒక్కరూ చెల్లించలేదు. రాయితీ ప్రకటించాక ఇప్పటి వరకు 172 మంది రూ.25 లక్షల వరకు ఫీజు చెల్లించారు. దరఖాస్తు నిషేధిత జాబితాలో ఉన్నా, ఏదైనా కారణాలతో తిరస్కరించినా, పూర్తి స్థాయిలో ధ్రువపత్రాలు లేకపోయినా, అనుమతి ఇవ్వకుండా తిరస్కరిస్తే.. చెల్లించిన ఫీజులో 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు తీసుకొని మిగతా మొత్తాన్ని దరఖాస్తుదారుడి ఖాతాల్లో జమ చేస్తారు.

# మత్స్యకారులకు ప్రోత్సాహం.. ఉపాధికి సహకారం

ఖమ్మం : చేపల పెంపకంపై ఆధారపడి జీవించే మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇటీవల పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సంచార చేపల విక్రయ వాహనాన్ని అందజేశారు. దీని విలువ రూ.10 లక్షలు కాగా 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. మత్స్య సహకార సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటిని మంజూరు చేస్తున్నారు. సంఘాల సభ్యులు కేవలం రూ.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

**వాహనంలో ప్రత్యేక వంటలు...**

చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ఈ సంచార వాహనం ద్వారా ఉపాధి లభిస్తుంది. ఇదే వాహనంలో చేపలతో వివిధ రకాల వంటలు తయారు చేసే వెసులుబాటు ఉంటుంది. చేపల బిర్యానీ, ఫ్రై, కూర, చేపలతో పలు రకాల వంటలకు ఇది అనువుగా ఉంటుంది. ఇదే వాహనంలో బతికున్న చేపలను నిల్వ చేసుకుని తాజా వంటలను తయారు చేస్తారు. చేపలతో విలువ ఆధారిత ఉత్పత్తులను సైతం తయారు చేసుకునే అవకాశం ఉంటుంది. నగర, పట్టణ ప్రాంతాలు లేదా రద్దీగా ఉన్న ప్రాంతాలకు వాహనం తీసుకెళ్లి వంటలు చేసుకోవచ్చు. డిమాండ్ ఎక్కడ ఉంటే అక్కడకు వాహనం చేరుకునే అవకాశం ఉంటుంది.



**మరో రెండు వాహనాలకు ప్రతిపాదనలు...**

పాలేరు నియోజకవర్గంలో ఒక వాహనం పంపిణీ చేసిన తర్వాత ఇప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు రెండు అందజేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్వయం సహాయ సంఘాల వారు డీఆర్‌డీఓ అధికారులకు దరఖాస్తు చేస్తే అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చిన తర్వాత ఇవి మంజూరయ్యే అవకాశం ఉంది. ఇలా పలు ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తులను పరిచయం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం చికెన్ ధరలు పడిపోయిన తరుణంలో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. గతంలో కిలో రూ.100 నుంచి రూ.120 ధర ఉంటే ప్రస్తుతం రూ.140 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. దీనిపై ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సంచార వాహనాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చురకలు



# అప్పులిచ్చి 'తిప్పలు'

అనకాపల్లి: గత పాలకుల ఒత్తిడితో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఇచ్చిన అప్పులను తిరిగి వసూలు చేయడానికి బ్యాంకర్లు తిప్పలు పడాల్సి వస్తోంది. జాతీయ బ్యాంకులతో పోటీపడాల్సిన సహకార బ్యాంకులు వైకాపా నిర్వాకంతో నష్టాల్లో చిక్కుకుంటున్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మొండి బకాయిలు రూ. 5.79 కోట్ల మేర పేరుకుపోయాయి. వాటి రికవరీలకు వెళ్లే సిబ్బందికి చుక్కలు చూపిస్తుండటంతో బ్యాంకు వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 30 డీసీసీబీ శాఖల ద్వారా సుమారు రూ. 34.47 కోట్ల మేర వివిధ పథకాలకు రుణాలు అందజేశారు. వాటిని ఎప్పటికప్పుడు కంతుల రూపంలో చెల్లించాల్సి ఉన్నా నేతలతో సిఫార్సు చేసి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం రుణాలు వసూలు కావాల్సి ఉన్నా లబ్ధిదారులు మొహం చాటేయడంతో రికవరీకి వెళ్లే సిబ్బంది ఉత్తచేతులతో తిరిగి వస్తున్నారు. రుణం తీసుకుని ఏర్పాటు చేసిన యూనిట్లు సైతం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. చాలావరకు యూనిట్లను అమ్మేసుకుని సొమ్ముచేసుకున్నారు తప్ప బ్యాంకులకు రుణాలు మాత్రం చెల్లించలేదు.

**తోడు.. వసూళ్లు గోడు..** జగనన్న తోడు పథకం పేరుతో చిరు వ్యాపారులకు డీసీసీబీ నుంచే రూ. 10 వేల చొప్పున రుణాలు ఇప్పించారు. ఏడాదిలోగా వాటిని తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉన్నా మూడేళ్లయినా ఇంకా 693 మంది లబ్ధిదారుల జాడ కనిపించలేదు. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్లకు ఇచ్చిన రుణాల పరిస్థితి ఇలానే ఉంది. ఈ రెండు పథకాలకు సంబంధించి సుమారు రూ.కోటి




మగ్గిపోయినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

కనిపించని కస్టమ్ హైరింగ్ సెంటర్లు ... ట్రాక్టర్లతో సహా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు. వాటిలో చాలావరకు ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు. యంత్ర పరికరాలు కనిపించడం లేదు. రైతుల పేరుతో వైకాపా నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పథకంలో రూ. 4.7 కోట్లు మొండి బకాయిలు ఉండిపోవడం గమనార్హం.

**రికవరీలు చేస్తాం..** డీసీసీబీ రుణ వాయిదాలు రికవరీ తప్పక చేస్తాం. ఎవరి దగ్గరా రుణాలను విడిచిపెట్టే ప్రసక్తి లేదు. ఇటీవల నాతవరం మండలంలో ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నోటీసులు ఇచ్చాం. మిగతా వారి వివరాలు సేకరిస్తున్నాం.డీవీఎస్ వర్మ, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి

# క్లస్టర్ సచివాలయాలు

కర్నూలు : ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామ, పట్టణాల్లో నివాస గృహాలు, కుటుంబాల మ్యాపింగ్ చేపట్టారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. జనాభా సమాచారం సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, ఉత్తర్వులను అనుసరించి క్లస్టర్ల ఏర్పాటుపై కర్నూలు, నంద్యాల జిల్లాలో స్పష్టత వచ్చింది. ఆ వివరాలను జిల్లా పాలనాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు రాగానే అమలు చేయనున్నారు. తమ గ్రామంలోనే క్లస్టర్ సచివాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ కొన్నిచోట్ల ఆయా ప్రాంతాల ప్రజలు కీలక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

**జనాభా ఆధారంగా విభజన**

ఉమ్మడి జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలుండగా వీటి పరిధిలో 13,52,530 కుటుంబాలు, 43,56,052 మంది నివసిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు, జనాభాను పరిగణనలోకి తీసుకుని మూడు కేటగిరీలుగా విభజించారు. ఉమ్మడి జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలను 619 క్లస్టర్లుగా చేయాలని జిల్లా అధికారులు ఇటీవల ప్రతిపాదించారు.

2,500 మంది లోపు జనాభా ఉంటే 'ఎ' విభాగం కింద చేర్చి ఆరుగురు ఉద్యోగులను కొనసాగిస్తారు. 2,501–3,500 మంది ఉంటే 'బి' కేటగిరీ కింద ఏడుగురు, 3,501 మందికిపైగా ఎంతమంది జనాభా ఉన్నా 'సి' విభాగంలో చేరుస్తారు. ఇక్కడ 8–10 మంది సిబ్బంది పనిచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

**ఉద్యోగుల హేతుబద్ధీకరణ..**

ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలు ఓ కొలిక్కి వచ్చాయి. మ్యాపింగ్ పూర్తవడంతో మిగులు సిబ్బందిని గుర్తించి జిల్లా స్థాయిలో పూలింగ్‌లోకి తేనున్నారు. ఎక్కువగా మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ సహాయకులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరిని అవసరమైన సచివాలయాలకు సర్దుబాటు చేయడం లేదా కొందరికి సంబంధిత, ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయించే ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం.

**జనరల్ పర్పస్ ఫంక్షనరీస్ :** పరిపాలన, బహుళ సేవలపరంగా చూస్తే పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సంక్షేమ, డిజిటల్ సహాయకులు ప్రతిచోట ఉంటారు. పట్టణాల్లో వార్డు అడ్మిన్, వార్డు ఎడ్యుకేషన్, వార్డు సంక్షేమ, మహిళా ఉద్యోగులు మిగులు ఉంటే ఆయా శాఖల్లోకి సర్దుబాటు చేయాలన్న చర్చ జరుగుతోంది.

**స్పెసిఫిక్ ఫంక్షనరీస్ :** సాంకేతిక సేవలపరంగా చూస్తే వీఆర్వో, ఆరోగ్య కార్యకర్త, సర్వేయర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, గ్రామ మత్స్య, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక సహాయకులు, ఎనర్జీ, ఇంజినీరింగ్ విభాగాల్లో రెండు సచివాలయాలకు కలిపి ఒక్కో విభాగంలో ఒక్కరే ఉంటారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ, హెల్త్ అసిస్టెంట్, ప్లానింగ్, రెగ్యులరేషన్ సెక్రటరీ, అమినిటీస్ సెక్రటరీ, శానిటేషన్, వార్డు ఎనర్జీ సెక్రటరీలు ఉంటారు.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల్లో ఉన్నత చదువులు చదివి సాంకేతిక పరిజ్ఞానం, ఐవోటీఎస్, ఏఐ సాంకేతికతపై అవగాహన ఉన్నవారిని ఆస్పిరేషనల్ సెక్రటరీలుగా నియమించే అవకాశాలున్నాయి.

# అన్నదాతకు 'పొగ'బెట్టారు!



పామిడి: ఆ రైతులంతా ఏ పంటలు వేసినా దిగుబడులు సరిగా రాక ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి సమయంలో రెండు కంపెనీల ప్రతినిధులు వచ్చి చుక్కబర్లీ రకం పొగాకు సాగుపై అవగాహన కల్పించారు. పొగాకు క్వింటా రూ.15,500లకు కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎకరాకు 13 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మించారు. ఈక్రమంలో పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున పొగాకు సాగు చేశారు.

పామిడి మండలంలోని గజరాంపల్లి గ్రామంలో దాదాపు 130 ఎకరాల్లో, పెద్దవడుగూరు మండలంలో 2వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేపట్టారు. ప్రస్తుతం గజరాంపల్లి గ్రామంలో దాదాపు 30 ఎకరాల్లో పంట సాగులో ఉంది. కంపెనీ తరఫున ఇచ్చిన చుక్కబర్లీ రకం పొగాకు విత్తనాలు నారు పోసి నెల తరువాత ఆ నారును పొలాల్లో నాటారు. 5 నెలల పంటకాలం ఉన్న ఈ పంట దశల వారీగా గోధుమ రంగులోకి మారిన ఆకు పత్రాలను తాళ్లతో కట్టి ఆరబెట్టి, వాటిని గోనెసంచుల నడుమ భద్రపరిచి మార్కెట్ తరలిస్తున్నారు.

**ఆశచూపి.. మొహం చాటేసి..**

పంట చేతికొచ్చాక కంపెనీ ప్రతినిధులు మొహం చాటేశారు. పండిన పంటను ఏమీ చేయాలో తెలియని రైతులు పలుమార్లు కంపెనీ వారితో చరవాణిలో మాట్లాడుతూ నేరుగా ప్రకాశం జిల్లాలోని మేదరమెట్లకు 8 లారీల్లో పొగాకును తరలించారు. అక్కడ కొనేవారే లేక రైతులు అయోమయానికి గురయ్యారు కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి పొగాకు కొనుగోలు చేపట్టారు. కంపెనీ ధర ప్రకారం రూ.15,500 కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం నాణ్యమైన పంట రూ.10 వేలుకు కొనుగోలు చేశారు. నాణ్యత తక్కువగా ఉన్న పంటను కొనుగోలు చేయమని చెప్పడంతో దాదాపు 3 లారీల పొగాకు పంట కొనుగోలు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

మారుతీవరప్రసాద్ రెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం

ఇది వరకు పత్తి, మిరప పంటలను సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం రెండు ఎకరాల పొలంలో పొగాకు పంట వేశా. ఎకరాకు రూ.60 వేల చొప్పున పెట్టుబడి పెట్టా. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. దీనికి తోడు గిట్టుబాటు ధర లేకపోవడం, కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**గిట్టుబాటు కావడం లేదు**

వాసుదేవరెడ్డి, లక్ష్ముంపల్లి, పెద్దవడుగూరు మండలం

రెండు ఎకరాల్లో పొగాకు పంట వేశా. మొదట్లో నంద్యాల ప్రాంతానికి చెందిన వ్యక్తులు వచ్చి పొగాకు సాగు చేస్తే క్వింటా రూ.15 వేలతో కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. ప్రస్తుతం పంట చేతికొచ్చాక తక్కువ ధరకు కొనుగోలు చేస్తామంటున్నారు. దిగుబడి బాగానే ఉన్నా గిట్టుబడి ధర లేదు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి.

# తీరనున్న అల్ప విద్యుత్తు సమస్య



మడకశిర: అల్ప విద్యుత్తు కష్టాల నుంచి రైతులను కూటమి ప్రభుత్వం గట్టెక్కించనుంది. రైతులకు, వినియోగదారులకు విద్యుత్తు కష్టాలు తీరనున్నాయి. మూడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 38,200 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వాటికి సరిపడా విద్యుత్తు సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేసవిలో అల్ప విద్యుత్తు సమస్య కారణంగా సాగు చేసిన పంటలు ఎండిపోయి నానా అవస్థలు పడ్డారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఉపకేంద్రాలు మంజూరు చేయడంతో మండలాలకు అంతరాయం లేకుండా విద్యుత్తు సేవలు అందనున్నాయి.

**59 గ్రామాల్లో మెరుగుపడనున్న సరఫరా**

పెనుకొండ డివిజన్ పరిధిలో కొత్తగా విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు కావడం, ఇప్పటికే పూర్తయినవి ప్రారంభిస్తుండటంతో 59 గ్రామాల రైతులకు అల్ప విద్యుత్తు సమస్య తీరనుంది. ప్రధానంగా మడకశిర నియోజకవర్గంలో 39 గ్రామాల్లో ఈ సమస్య అత్యధికంగా ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించి రూ.36.50 కోట్లతో కొత్తగా 9 విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరు చేసింది. ప్రస్తుతం వాటికి భూమి పూజ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. పెనుకొండ నియోజకవర్గంలో పైడేటీ, దొడగట్టలో ఉపకేంద్రాలు మరో రెండు నెలల్లో పూర్తి కానున్నాయి. **పరిశ్రమలకు ఎంతో ఉపయోగం..**

హిందూపురం నియోజకవర్గంలో రూ.15 కోట్లతో 33/11కేవీ 4 విద్యుత్తు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. ఇందులో గోల్లాపురం, కిరికెర, మోత్కుపల్లి, సింగిరెడ్డిపల్లిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. గోళ్లాపురంలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే ఇండస్ట్రియల్ ఏరియాకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

**హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి**


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అల్ప విద్యుత్తు సమస్య ఉందని ఉపకేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే నిర్మాణంలో ఉన్న 4 పూర్తి చేయాలని, మరో 3 మంజూరు చేశారు. మడకశిర నియోజకవర్గంలో మొత్తం 27 ఉపకేంద్రాలు అవుతాయి.

# అధికారులు ఊసులు.. అక్రమార్కులకు కాసులు

విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థకు 'గిఫ్ట్ డీడ్'గా ఇచ్చిన స్థలమిది. జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో దాని విలువ రూ.కోట్లల్లోనే. అలాంటి స్థలంలో కొందరు అనధికారికంగా వాణిజ్య సముదాయాలు నిర్మించారు. విచిత్రమేమంటే ఆక్రమిత స్థలంలో కట్టిన నిర్మాణాలకు జీవీఎంసీనే పన్ను వేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే అక్రమాన్ని సక్రమం చేసేలా అధికారులు కబ్జాదారులకు రాచబాటలు వేశారన్నమాట. ఈ ఘనకార్యం మధురవాడ పరిధిలో చోటు చేసుకుంది.

**దస్త్రాలు లేకున్నా:** జీవీఎంసీకి చెందాల్సిన స్థలంలో దుకాణాలు నిర్మించగా... 2016–17లో సూరీడు అనే వ్యక్తి పేరున అధికారులు పన్ను విధించడం గమనార్హం. సరైన దస్త్రాలు లేకపోయినా జీవీఎంసీ అధికారులు కాసులకు కక్కుర్తిపడి పన్ను విధించినట్లు చర్చ సాగుతోంది. జీఎంసీ స్థలం ఆక్రమించడమే కాకుండా, ఇలా సక్రమం అని చూపించుకునేలా కొందరు అధికారులు చేతులుకలిపినట్లు విమర్శలున్నాయి. ఆక్రమిత 672 గజాల స్థలం ప్రభుత్వ ధర ప్రకారం రూ.4 కోట్లు కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లపైనే ఉంది.

**అధికారులకు ఫిర్యాదు:** ఈ దుకాణాల వ్యవహారంలో కుటుంబ సభ్యుల్లో విభేదాలు రావడంతో గిఫ్ట్‌డీడ్ చేసిన వారసులకు చెందిన కొందరు జీవీఎంసీలో ఫిర్యాదు చేశారు. ఆక్రమిత స్థలంలో నిర్మించిన దుకాణాలు జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ గత కొన్ని నెలలుగా ఫిర్యాదులందాయి. ఒకసారి గిఫ్ట్‌డీడ్ చేసిన తర్వాత ప్రైవేటు వ్యక్తులకు అదే స్థలంలోని దుకాణాలకు పన్నులు ఎలా వేస్తారంటూ? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మధురవాడ జెడ్సీ కనకమహాలక్ష్మిని వివరణ కోరగా...తాను కొత్తగా వచ్చానని, ఈ అంశంపై పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.



**రాజకీయ పలుకుబడితో:** మధురవాడ పరిధిలో కారుషెడ్డు జంక్షన్ నుంచి మిథిలాపురి వుడాకాలనీకి వెళ్లే మార్గం ఆరంభంలో 1080 గజాల ప్రైవేటు స్థలం ఉంది. ఇందులో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ప్లాన్ అనుమతులకు 2008లో ముకుందయ్య, అప్పలస్వామికి సంబంధించిన వారసులు వెళ్లారు. జాతీయ రహదారి పక్కన ఉండటం, వుడా, జీవీఎంసీ మాస్టర్ ప్లాన్ పరిశీలించి 420 గజాల్లో భవన నిర్మాణానికి అనుమతులిచ్చారు. ఈ నేపథ్యంలో నూకరాజు అనే వ్యక్తి నుంచి సర్వే నెంబరు 248–10లో 672 గజాలు గిఫ్ట్‌డీడ్ చేయించుకున్నారు. అదే కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా రాజకీయ పలుకుబడి ఉపయోగించి జీవీఎంసీ గిఫ్ట్ డీడ్ చేసిన స్థలంలో దర్జాగా వ్యాపార దుకాణాలు నిర్మించారు. హోటల్, ఫర్నిచర్, ఇతర షాపులకు అద్దెలకిచ్చి రూ.వేలల్లో వసూలు చేసుకుంటున్నారు.

# సూర్యగ్రహణం

నంద్యాల : వినియోగదారుల విద్యుత్తు బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటి కప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి భారీ రాయితీలిస్తోంది. బ్యాంకుల ద్వారా రుణ వసతి కల్పిస్తోంది. చేతి నుంచి పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ డిమాండ్‌కు తగ్గట్లు సోలార్ ప్యానళ్లను సరఫరా చేయడం లేదు. విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

**నియోజకవర్గానికి 10 వేల యూనిట్లు**

సూర్యఘర్ పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 10 వేల సౌరశక్తి యూనిట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. విద్యుత్తు కనెక్షన్లు కలిగిన ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల్లో 90 శాతం మంది సౌర ఫలకాల ఏర్పాటుకు అంగీకరించారు.

**లక్ష ఫలకాలు అవసరం**

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం లక్షకు పైగా సౌర ఫలకాలు అవసరం. వినియోగదారుడు దరఖాస్తు చేసుకున్న ఏడు రోజుల్లోపు రుణం మంజూరు చేస్తారు. మొత్తం మీద 25 రోజుల్లోపు వారి ఇంటిపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలి. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం గుజరాత్, హైదరాబాద్, బెంగళూరు నుంచి సౌర ఫలకాలను దిగుమతి చేసుకోవాలి. కాని ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు సరిగా సరఫరా చేయడం లేదు. అరకొరగా సరఫరా చేస్తుండటంతో లక్ష్యం నెరవేరడం లేదు.

**వెండర్ల వెతలు**

సౌర ఫలకాలు అమర్చేందుకు పలువురు నిరుద్యోగులు వెండర్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నంద్యాల 120, కర్నూలు జిల్లాలో 97 మంది రిజిస్టర్ అయ్యారు. అధికారులు వారికి మండలాలను కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో ప్యానెళ్లు బిగించాల్సిన బాధ్యతలు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్యలు ప్రారంభమయ్యాయి.

నంద్యాల పట్టణం రామనాథరెడ్డినగర్‌కు చెందిన ఒక వెండర్ వారం రోజుల్లోనే 32 మంది వినియోగదారులను రిజిస్టర్ చేయించారు. వీరందరికీ ఎస్‌బీఐ రుణం మంజూరు చేసింది. ఇప్పటి వరకు ముగ్గురికి మాత్రమే ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. మార్చి ప్రథమార్థంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగా ఉగాది నాటికి ఫలకాలు బిగిస్తామని చెప్పారు. చెప్పిన గడువు దాటి 20 రోజులవుతున్నా ప్యానెళ్లు మాత్రం రాలేదు. కర్నూలు జిల్లాలో 4,789 మంది పేర్లు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 485 మందికి మాత్రమే ప్యానెళ్లను బిగించారు.

# ఏటికాడ ఇసుక నక్కలు

కర్నూలు : నిర్మాణ రంగానికి మేలు చేయాలని భావించిన 'కూటమి' ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. జిల్లాలో 172 ప్రాంతాల్లో వాగులు, వంకలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గృహ అవసరాల కోసం ఇసుక తవ్వడానికి జిల్లా యంత్రాంగం అనుమతులు జారీ చేసింది. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు 'స్థానిక' అవసరాల పేరిట తవ్వి పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు. తుంగభద్ర, హంద్రీ నది పరివాహక ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

**అక్రమంగా తోడి.. కాసులు నింపి**

గృహ అవసరాల నిమిత్తం వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గనులు, భూగర్భ శాఖ రూపొందించిన ఏపీ శాండ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇవేవి పట్టించుకోకుండా నిర్మాణాల పేరుతో ఇసుక తవ్వి ఊరు దాటిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.1,500–2,500, రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు.

గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఊరు దాటి వెళ్లే వాహనాలను తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్పై పర్యవేక్షించాలి. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ఇసుకను తీసుకెళ్తే జరిమానా విధించొచ్చు.అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

అక్రమంగా ఇసుకను తరలించే క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు అతివేగంగా వెళ్తున్నారు. ఇటీవల మునగాలపాడు–నిడ్జూరు మధ్యలో ఓ ఇసుక ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందారు.

**పక్క రాష్ట్రానికి తరలింపు**

తుంగభద్ర నదీ తీరం వెంట ఉన్న 137 గ్రామాల్లో ఇసుక దందా జోరందుకొంది. నదీ పరివాహక ప్రాంతాల నుంచి నిత్యం వందల ట్రాక్టర్లలో ఇసుకను తీసుకెళ్తున్నారు. కర్నూలు నగరంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. జి.సింగవరం, నిడ్జూరు, మునగాలపాడు, పంచలింగాల, పడిదెంపాడు, పూడూరు ప్రాంతాల్లో రాత్రివేళ తవ్వి ఓ చోట నిల్వ చేస్తున్నారు. ఉదయం తరలిస్తున్నారు. పంచలింగాల సమీపంలో వంతెన కింద ఇసుక తోడేస్తున్నా పట్టించుకోవడం లేదు. నిత్యం రెండు వందల ట్రాక్టరలో తరలుతోంది.. దీని విలువ రూ.8 లక్షల వరకు ఉంటుంది.

# వరదొచ్చేలోపు వంతెనలు

బనగానపల్లి : మైనింగ్ ఖిల్లా.. కొండల పక్క పల్లెలు.. మార్గమధ్యంలో వాగులు.. సరైన దారులు లేవు.. వంతెనల్లేక వర్షాకాలంలో ఆగుతున్న రాకపోకలు.. ఇలాంటి సమస్యల పరిష్కారానికి 'కూటమి' ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రజా సమస్యలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో బనగానపల్లి నియోజకవర్గానికి రూ.67.50 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేశారు. వీటితో వంతెనలు, రోడ్లు నిర్మిస్తున్నారు.. ఆయా పనులు మే చివరి నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ హుసేని తెలిపారు.

**వలయ దారి**బనగానపల్లి నియోజకవర్గంలో సిమెంటు కంపెనీలు ఎక్కువ. సరకు రవాణాకు సంబంధించి భారీ వాహనాలు పట్టణం మీదుగా వెళ్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.. సమస్క పరిష్కారానికి వలయ(రింగ్)దారి నిర్మించాలని గతంలో తెదేపా హయాంలో నిర్ణయించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. 'కూటమి' ప్రభుత్వం రాకతో పనులు ప్రారంభించారు.. 15 కి.మీ. మేర నిర్మించే రింగ్ రోడ్డుకు రూ.50 కోట్లు వెచ్చించనున్నారు.**విస్తరణకు అడుగులు**

బనగానపల్లి నుంచి పసుపుల వరకు 7 కి.మీ. రహదారి ఇరుకుగా ఉంది.. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దారి ఇరుకుగా ఉండటలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రూ.12.50 కోట్లతో విస్తరణ పనులు చేపడుతున్నారు.

**ముప్పు తప్పించేలా** వర్షాకాలంలో కుందూనది ఉప్పొంగడంతో ఏటా వెయ్యి ఎకరాల్లో పంట నష్టం తలెత్తుతోంది.. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కోవెలకుంట్ల మండలం వల్లంపాడు వద్ద సుమారు రూ.1.50 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. బనగానపల్లి మండలం తిమ్మాపురం వద్ద రూ.1.50 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు.చిన్నపాటి వర్షానికే రోడ్డుపైకి నీరొస్తుండటంతో నంద్యాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వందెకరాల్లో పంట నీట మునుగుతోంది.. సమస్య పరిష్కారానికి బనగానపల్లి మండలం పండ్లాపురం సమీపంలో రూ.2 కోట్లతో వంతెన పనులు మొదలుపెట్టారు.

## వేలంలో జోక్యం.. ఖజానాకు సున్నం!

పుట్టపర్తి : హిందూపురంలో ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. స్థానిక సంస్థలకు ఆదాయం తెచ్చిపెట్టే వేలం పాటల్లోనూ తల దూరుస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని తమకు అనుకూలంగా ఉండే వారికి కట్టబెట్టడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రముఖ పర్యాటక క్షేత్రం లేపాక్షిలో వాహనాల పార్కింగ్, హిందూపురం పురపాలిక దినసరి మార్కెట్ సుంకం వసూలు వేలంలో జోక్యం చేసుకున్నారు.

**రూ.38 లక్షలు నష్టం**

లేపాక్షి ఆలయాన్ని ఏటా 8 లక్షల నుంచి 10 లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. 75 వేల నుంచి 80 వేల మంది వ్యక్తిగత వాహనాల్లో ఇక్కడికి వస్తున్నారు. పార్కింగ్ రుసుం కారుకు రూ.50, ద్విచక్రవాహనాలకు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. వసూలు కాంట్రాక్టు కోసం ఇటీవల వేలం నిర్వహించారు.. శంకర్‌రెడ్డి రూ.72.10 లక్షలకు పాడుకున్నారు. ఈక్రమంలో ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు తమవారికి కాంట్రాక్టు కట్టబెట్టేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. పంచాయతీ అధికారులు శంకర్‌రెడ్డి నుంచి డబ్బులు కట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసి వేలం రద్దయ్యేలా చేశారు. తర్వాత గోవిందప్ప అనే వ్యక్తికి రూ.34.56 లక్షలకే కట్టబెట్టారు. దీంతో లేపాక్షి పంచాయతీ రూ.38 లక్షల ఆదాయం కోల్పోయింది.



**మున్సిపల్ ఆదాయానికి గండి**

ఇటీవల హిందూపురం మున్సిపల్ దినసరి కూరగాయల మార్కెట్ సుంకం వసూలు వేలం పాటలో తమకు అనుకూలమైన వ్యక్తి దక్కేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. గతనెల 19న వేలం పాట నిర్వహించగా రూ.64.25 లక్షల వరకు పాడారు. పాట కొనసాగించి ఉంటే అదే రోజు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు వెళ్లే అవకాశం ఉండేది. తమకు కావాల్సిన వ్యక్తి కోసం ఆ రోజు ఉద్దేశపూర్వకంగా వేలంపాట వాయిదా వేశారు. తర్వాత జరిగిన వేలం పాటలో కేవలం రూ.5 వేలు పెంచి రూ.64.30 లక్షలకు తమకు కావాల్సిన వారికి దక్కేలా పావులు కదిపారు. స్థానిక నాయకుల స్వార్థం కారణంగా పురపాలికకు రూ.20 లక్షల వరకు నష్టం చేకూరింది.

## బంగ్లా చెరువు.. కబ్జా నెలవు

కార్వేటినగరం : కబ్జాకు కాదేదీ అనర్హం.. కాలువలు, కుంటలు, గుట్టలు, చెరువులను దర్జాగా ఆక్రమించేస్తున్నారు కొందరు కబ్జాదారులు.. గత ప్రభుత్వ పాలనలో మొదలై నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. వైకాపా పాలనలో కొనసాగిన ఆక్రమణలకు ప్రస్తుతం కొందరు ద్వితీయశ్రేణి నాయకుల అండదండలు తోడవడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారు. కార్వేటినగరం బంగ్లా చెరువు కలుజుకు సమీపంలోని కట్టను తవ్వేసి ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బంగ్లా చెరువును కార్వేటినగరం సంస్థానాధీశులు నిర్మించారు. ఈ చెరువు కింద వంద ఎకరాల్లో



వివిధ పంటలు సాగవుతున్నాయి. చెరువు కలుజు వద్ద ఓ వైకాపా నాయకుడు ఆక్రమణలకు పాల్పడటంతో కలుజు ప్రమాదకరంగా మారింది. వర్షాలకు తెగిపోయే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. బంగ్లా చెరువును సమగ్రంగా సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

చెరువు కలుజుకు సమీపంలో ఓ వ్యక్తికి డీకేటీ పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. సదరు స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిపినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం. చెరువు కలుజు కబ్జాచేసిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి.నాగరాజు, తహసీల్దార్, కార్వేటినగరం

## లెక్కలు లేవాయే..!

గూడూరు : ఇసుక లెక్కల్లో ఇసుమంతైనా పారదర్శకత కనిపించడం లేదు. కోట మండలం గూడలి స్వర్ణముఖి నదిలో డీసిల్టింగ్ కేంద్రం గతనెల 5న అధికారికంగా ఏర్పాటు చేయగా ఇప్పటివరకు ఎంత తవ్వకాలు జరిగాయి.. ఎంత ఎక్కడెక్కడికి తరలించారు అన్న లెక్కలు జలవనరులు, గనుల శాఖ, రెవెన్యూ అధికారుల వద్ద లేకపోవడం విడ్డూరం. మరోవైపు ఎలాంటి డంపింగ్ యార్డు లేకపోగా ఇసుక అమ్మకాలపై నేటికీ ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చలేదు. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ నిబంధనల మేరకు పూడికతీత పనులు జరగడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తవ్వకాలకు కూలీలతో చేపట్టాల్సి ఉండగా నేరుగా యంత్రాలతోనే తవ్వి అక్కడే దర్జాగా విక్రయిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా తవ్వకాలు.. తరలింపు జరుగుతోంది. ఇక్కడ జరుగుతున్న దందాకు మూడుశాఖల అధికారులతో పాటుగా పోలీసులు అండగా నిలవడంతో కనీస పరిశీలన కరవైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. **55 వేల టన్నుల తరలింపు లక్ష్యం** నదిలో డీసిల్టింగ్ ద్వారా 55 వేల టన్నుల ఇసుకను తరలించాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలి. అందుకు విరుద్ధంగా ఇప్పటివరకు వేల టన్నుల ఇసుక తమిళనాడు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. డీసిల్టింగ్ పనులపై జలవనరుల శాఖ ఈఈ శ్రీనివాసరావు, గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావు ఇద్దరిని వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఎంత తవ్వారు.. తరలించారు వాటి లెక్కలు అడిగ్గా తమ వద్ద లేవన్నారు.

# కందిపప్పు కరవాయె!



అనంతపురం : రేషన్ కార్డుదారులకు కందిపప్పు కరవైంది. ప్రభుత్వం కిలో రూ.67 చొప్పున కార్డుదారులకు పంపిణీ చేసేది. మూడు నెలలుగా సరఫరా ఆగిపోయింది. బహిరంగ మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఆంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు మాత్రమే కందిపప్పు సరఫరా అవుతోంది. 2014-19 మధ్య కాలంలో ఏడాదికొకసారి టెండర్లు పిలిచి కందిపప్పును ప్రతినెలా అందించేవారు. గత వైకాపా ప్రభుత్వంలో 2-3 నెలకొకసారి టెండర్లు పిలిచారు. అరకొరగా దుకాణాలకు సరఫరా చేసేవారు. గుత్తేదారులకు సొమ్ము సకాలంలో చెల్లించకపోవడంతో ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి నెల వరకు పంపిణీ అయింది. టెండరు ముగియడంతో సరఫరాకు అడ్డుకట్ట పడింది. ఇదంతా వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో సమస్య తలెత్తిందని పౌర సరఫరాల సంస్థలో చర్చ సాగుతోంది. మూడు నెలల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నా స్పందన కొరవడింది. ప్రస్తుతం ఎట్టకేలకు టెండర్లు పూర్తయినట్లు తెలుస్తోంది. వైకాపా పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా సరకులు పంచారు. డీలర్లు, వాహనదారులు కుమ్మక్కై కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని... అప్పట్లో బియ్యం ఒక్కటే పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే ఆరు రకాల సరకులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎండీయూ వాహనాలకు బ్యాంకు కంతులు చెల్లించాల్సి ఉండడంతో ఇప్పటికీ ఆపరేటర్లు, చాలాచోట్ల పాత డీలర్లే కొనసాగుతున్నారు. వీరితో పాటు గ్రామ సచివాలయాలు మ్యాపింగ్ తొలగిస్తే తప్ప నిత్యావసర సరకుల పంపిణీ సాఫీగా సాగదని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**బహిరంగ మార్కెట్‌లో కొనలేక..**

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర పెరిగింది. మొదటి రకం కిలో రూ.140, రెండో రకం 125, మూడో రకం రూ.114 ధర పలుకుతోంది. అదే చౌక దుకాణాల్లో సుమారు సగానికి సగమే ఉండేది. దాదాపు లబ్ధిదారులు అందరూ తీసుకొనేవారు. ప్రస్తుతం సరఫరా లేకపోవడంతో బయటి మార్కెట్‌లో కొనలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెండర్ల ప్రక్రియ సాగుతోంది
రమేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

రాష్ట్రస్థాయిలో కందిపప్పునకు టెండర్లు పిలుస్తున్నా స్పందన లేకపోవడంతో మూడు నెలలుగా సరఫరా ఆగిన విషయం నిజమే. ప్రస్తుతం టెండరు ప్రక్రియ పూర్తి అయింది. గుత్తేదారులతో ఒప్పందం, ఇతరత్రా పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

**అనంతపురం జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| చౌక దుకాణాలు | : 3,012 |
| లబ్ధిదారులు | : 12,08,293 |
| కందిపప్పు అవసరం | : 1,210 టన్నులు |

# ఎర్రకొండల్లో మట్టిదొంగలు



పెద్దపప్పూరు : పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి గ్రామంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న మట్టి తవ్వకాలతో ఎర్రమట్టి కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రకృతి వనరుల్ని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. పర్యావరణానికి సైతం తూట్లు పొడుస్తున్నారు.

**కరుగుతున్న గుట్టలు**

పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల పరిధిలో 1281 సర్వేనంబర్‌లో 328 ఎకరాల్లో ఎర్రమట్టి కొండ విస్తరించింది. గత వైకాపా ప్రభుత్వంలో సాగిన మట్టి దందాతో పెద్దఎత్తున కొండ రూపుకోల్పోయింది. కొండకు రెండు వైపులా కిలోమీటర్ మేర ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలించారు. ఇటీవల కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకున్నా పొక్లెయిన్లను వినియోగించి ట్రాక్టర్లతో, టిప్పర్లతో గుట్టు చప్పుడు లేకుండా రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. తాడిపత్రి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని స్థిరాస్తి వెంచర్లకు మట్టిని తరలించి అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ మట్టి రూ. 1500, టిప్పర్ రూ.4 వేలు నుంచి 5 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు మట్టిని తవ్వే క్రమంలో పచ్చని చెట్లను సైతం పెకిలించి వేస్తున్నారు. సోమనపల్లి గ్రామస్థులు మట్టి దందాను అడ్డుకునే ప్రయత్నం చేసినా అక్రమార్కులు ఆగడం లేదు. మరింత రెచ్చిపోయి మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు చేపట్టి ప్రకృతి వనరుల్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశాం**

బాలాజీరాజు, తహసీల్దారు, పెద్దపప్పూరు

సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల పరిధిలో విస్తరించిన కొండపై మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇటీవల అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని భూగర్భగనులశాఖ అధికారులకు అప్పగించాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం.

# కొండలే ఆహారం.. అధికారమే సహకారం!



విశాఖపట్నం : ఆనందపురం, వేపగుంట నగర శివారులో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయి. కొండలు, చెరువులే కాకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలనూ వదలడం లేదు. అధికార యంత్రాంగం కళ్లుమూసుకోవడంతో అక్రమార్కులు నచ్చినట్లు తవ్వుకుపోతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు ఫోన్ చేస్తే ఉదయం వస్తామంటూ సమాధానాలు ఇస్తున్నారు. గనులు, రెవెన్యూశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు.

**అధికారుల.. అలసత్వం ఇలా..:**

కొద్ది రోజుల కిందట శొంఠ్యాం కొండ వాలు ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలపై మొదట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. వారు స్పందించకపోవడంతో గనులు, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదు. గిడిజాలలోని అక్రమ తవ్వకాలపై గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ తర్వాత వస్తామని కాలం వెళ్లదీశారు. చీకటి పడ్డాక లారీలు, యంత్రాలను ఆయా ప్రాంతాలకు తరలించి రాత్రి పది గంటల తర్వాత తవ్వకాలు సాగిస్తున్నారు. తెల్లవారుజాము మూడు గంటల వరకు మట్టి తరలిస్తున్నారు.

ఇందులో అధికార, ప్రతిపక్షాలకు చెందిన స్థానిక నాయకులు కుమ్మక్కై దీనిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు.

గనులశాఖకు విశాఖ జిల్లాలో పూర్తిస్థాయి అధికారి లేకపోవడం ఒక సమస్యగా ఉంది. తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులకు సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదు. తవ్వేసిన ఆనవాళ్లు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదు.

**తవ్వకాలు ఇలా:**

పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలోని ఒక సెంటు లేఅవుట్‌లోని కొండ వాలులో దాదాపు 500 మీటర్లలో దారుణంగా తవ్వేశారు. దీంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడు ఏ రాయి జారి పడుతుంతో అన్నంత భయంకరంగా మారిపోయింది. ముఖ్యంగా రాత్రిళ్లు భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. ఇరవై అడుగుల ఎత్తున తవ్వేయడంతో కొండ కరిగిపోయింది.

ఆనందపురం మండలంలోని రామవరం, గండిగుండం, గిడిజాలలో గ్రావెల్, ముచ్చెర్లలో చెరువు మట్టి తరలించుకుపోతున్నారు.

గండిగుండంలో రోడ్డు నిర్మాణం కోసం కొండను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే కాలనీ పనుల కోసమని చెప్పుకొస్తున్నారు.

రామవరంలో గ్రావెల్‌తో కొందరు లారీ యజమానులు అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

గిడిజాలలో ప్రైవేటు లేఅవుట్లకు, ముచ్చెర్లలోని ప్రైవేటు వ్యక్తులకు రాత్రిళ్లు చెరువు మట్టి తరలిస్తున్నారు.

పద్మనాభం మండలంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. భీమిలిలోనూ అదే పరిస్థితి.

## 24న సింహగిరిపై తొలి గంధం అరగదీత

సింహాచలం : చైత్ర బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న సింహగిరిపై అప్పన్న స్వామి దేవాలయంలో తొలి గంధం అరగదీతకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈవో కొమ్ముల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30గంటలకు చందనం చెక్కల అరగదీతకు అర్చకులు సుముహూర్తం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉదయం 7.30గంటల తర్వాత దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

చందనయాత్ర సందర్భంగా 30న వైశాఖ శుద్ధ తదియ నాడు స్వామివారి నిజరూప దర్శనం అనంతరం తొలి విడతగా మూడు మణుగుల (సుమారు 120కిలోలు) చందనం సమర్పణ జరుగుతుంది. ఇందు కోసం ఆలయ సిబ్బంది బేడామండపంలోని సాన(రాళ్లు)లపై చందనం చెక్కలను అరగదీస్తారు. సేకరించిన శ్రీగంధంలో అర్చకులు సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి చందనోత్సవం రోజున రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి తొలివిడగా సమర్పిస్తారు. వైశాఖ, జ్యేష్ట, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మరో మూడు విడతల చందన సమర్పణ చేస్తారు. శ్రావణ పౌర్ణమి నాడు కరాళ చందన అలంకరణతో ఈ ప్రక్రియ పరి సమాప్తమవుతుంది.



**పట్టు వస్త్రాల సమర్పణకు నిధులు విడుదల:** ఈ నెల 30న జరిగే అప్పన్న స్వామి నిజరూప దర్శనం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామికి పట్టు వస్త్రాలు కొనుగోలుకు రూ.20వేలు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు జీవో సంఖ్య 328 విడుదల చేశారు. ఆ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరఫున సింహాద్రినాథుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

## పుర జనం.. అమృత్ జలం

నంద్యాల : పురపాలికలకు అమృత్ జలం దరిచేరనుంది. ఉమ్మడి జిల్లాలోని కర్నూలు నగర పాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని పురపాలికలకు అమృత్ 2.0 కింద తాగునీటి ఇబ్బందులు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పురపాలికల్లో రూ.195.26 కోట్లతో పనులు చేపట్టేందుకు పుర అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఇచ్చిన అదనపు కుళాయి కనెక్షన్లకు నీటి సరఫరాలో సమస్యలు తీర్చేందుకు అనుబంధంగా ఈ పనులు దోహదపడనున్నాయి. వచ్చే 30 ఏళ్లు, అంటే 2055 నాటికి పెరిగే జనాభాకు అనుగుణంగా ముందస్తుగా నీటి వనరుల పెంపుతోపాటు సరఫరాలో లోటుపాట్లు లేకుండా ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా పెరుగుతున్న శివారు ప్రాంతాల కారణంగా నీటి సరఫరాలో అనేక ఇక్కట్లతోపాటు పంపింగ్, నిల్వ సామర్థ్యం తగ్గి సరఫరాపై ప్రభావం పడుతోంది.

**నంద్యాలకు రూ.43.41 కోట్లు**

నంద్యాలలోని వీకర్ సెక్షన్ కాలనీలో నీటి సమస్యలు దూరం చేసేందుకు రూ.10.47 కోట్లతో పనులు ప్రతిపాదించారు. 700 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు, 19.39 కి.మీ. నీటి గొట్టాల నిర్మాణం, 3 వేల వరకు అదనంగా నీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, 4.51 కి.మీ. నీటి సరఫరా గొట్టాలు నిర్మించాలనుకుంటున్నారు. మరో రూ.32.94 కోట్లతో 12.50 వాటర్ ట్రీట్ ప్లాంట్, 13.32 కి.మీ. పైప్‌లైన్ నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యమున్న క్లియర్ వాటర్ సంప్ నిర్మించనున్నారు. గాంధీనగర్, బొగ్గులైన్, బొమ్మలసత్రం, నూనెపల్లె ప్రాంతం, సాయిబాబానగర్, సాదిక్ నగర్, హరిజనవాడ తదితర కాలనీల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. 42 వార్డులుంటే.. 21 వార్డుల్లో రోజూ, మిగిలిన వార్డులకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు.

**కర్నూలులో ట్యాంకుల నిర్మాణం**

కర్నూలు నగరంలో నీటి సమస్యలు అధిగమించేందుకు రూ.130 కోట్లతో పనులు ప్రతిపాదించారు. కర్నూలు నగరంతోపాటు, కల్లూరు ప్రాంతాల్లో నీరు నిల్వ చేసుకునేందుకు 22 ఉపరితల ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. జగన్నాథగట్టు ప్రాంతంలో 50 ఎం.ఎల్.డి. సామర్థ్యంతో నీటి ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించాలని భావిస్తున్నారు.



కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాలకు సంబంధించి విలీన గ్రామాలైన మునగాలపాడు, మామిదాలపాడు, స్టాంటన్‌పురం తదితర గ్రామాలతోపాటు వార్డులకు తాగునీటి సేవలు కల్పించనున్నారు. విలీన గ్రామాలు, వార్డులను కలిపితే పూటకు 130 ఎం.ఎల్.డి. నీటిని సరఫరా చేయాల్సినచోట, 95 ఎం.ఎల్.డి.కి మించడం లేదు. కల్లూరు ప్రాంతంలోని 16 వార్డుల్లో నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి.

**ఆదోనికి శుద్ధజలం**

ఆదోని పట్టణ శివారులోని తాగునీటి సమస్యలు పరిష్కరించాలని భావిస్తోంది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్ ప్రాంతంలో వేయి కె.ఎల్. సామర్థ్యంతో ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు, బసాపురం వేసవి నీటికుంట ప్రాంతంలో 6 ఎం.ఎల్.డి. సామర్థ్యంలో నీటి శుద్ధి ప్లాంట్, 450, 300, 250 ఎం.ఎం. డయా డీఐ నీటి పంపింగ్, సరఫరా గొట్టాల నిర్మాణం చేపట్టనున్నారు. పనులు పూర్తయితే శివారులోని కేవీఆర్ కాలనీతోపాటు భీమిరెడ్డినగర్, వైఎస్సార్ నగర్, కల్లుబావి, బీసీ కాలనీ, శంకర్‌నగర్‌తోపాటు విస్తరించే కాలనీలకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఈ ప్రాంతంలో ట్యాంకులు నిర్మించి, పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి, చుట్టూ ఉన్న ప్రాంతాలకు సులువుగా నీరు సరఫరా చేసేందుకు వీలుపడేలా పనులు చేయనున్నారు.

# అనంత జలకళ!

అనంతపురం : గతేడాదితో పోల్చితే ఈ దఫా వానలు విస్తారంగా కురిశాయి. ఉమ్మడి అనంత జిల్లాకు కృష్ణా, తుంగభద్ర జలాలు సైతం పుష్కలంగా చేరాయి. భూగర్భం, జలాశయాలు, చెరువులు... ఇలా అన్ని రకాల వనరులను పరిగణలోకి తీసుకుంటే ప్రస్తుతం 68.94 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ చర్యలకు ఉపక్రమించాలి. గతేడాది జూన్ నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి దాకా కొనసాగిన హంద్రీనీవా, హెచ్చెల్సీ నీటి ప్రవాహాలు, వర్షాల ఫలితంగా దాదాపు 80 టీఎంసీలకుపైగా భూగర్భంలోకి ఇంకినట్లు అధికార గణంకాలు చెబుతున్నాయి. ఇప్పటి దాకా వినియోగించిన జలాలను మినహాయిస్తే.. ఇంకా 53 టీఎంసీలకుపైగా అనంత, శ్రీసత్యసాయి జిల్లాల భూగర్భంలో అందుబాటులో ఉన్నాయి.

**ఆ నాలుగుచోట్ల ఆందోళన**

గడిచిన నాలుగు మాసాల్లో దాదాపు నాలుగు మీటర్లు దాకా నీటి



మట్టం తగ్గింది. అనంత జిల్లా శెట్టూరు మండలంలో 28.92 మీటర్లు, యాడికిలో 23.11 మీటర్లు.. శ్రీసత్యసాయి జిల్లాలో గుడిబండ 26.42, అగళిలో 19.79 మీటర్లలోతులో నీరు లభిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువల పరివాహక ప్రాంతాల్లో 2 నుంచి 5 మీటర్లలోతులోనే నీటి మట్టం నమోదైంది.

**58.131 టీఎంసీలు రాక**

హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాకు ఏకంగా 58.131 టీఎంసీలు చేరడం విశేషం. తాగు,సాగునీటికి వినియోగించిన తర్వాత ఇంకా ప్రాజెక్టు, చెరువుల్లో నీరు ఉంది. ఎప్పుడూ లేనివిధంగా ఒక్క హంద్రీనీవా జలాలతోనే రెండు జిల్లాల పరిధిలో 89 చెరువులను నింపారు. వేసవిలో అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాల్సి ఉంది.

# అనుమతులు సరే... పర్యవేక్షణ ఎక్కడ?

అమలాపురం: అనుమతులు లేకుండా వైనతేయ గోదావరి తీరంలో ఇసుక, బొండుమట్టి, లంక మట్టి తరలింపు ఇటీవల వరకు యథేచ్ఛగా జరిగింది. ప్రస్తుతం మానేపల్లిలంక భూముల్లోంచి బొండు మట్టి తవ్వేందుకు గనుల శాఖ ఓ వ్యక్తికి అనుమతులు ఇచ్చింది. అంతకుముందే ఇక్కడ నదీపాయకు అడ్డుగా కి.మీ మేర బాట వేశారు. మట్టిని టిప్పర్లలో తరలిస్తున్నారు. దీనిపై పలు శాఖలకు సమాచారం లేదు.

**తనిఖీలకు వెళ్లగా..**

మానేపల్లిలంకలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటూ బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు రావడంతో ఆర్ఐ వి.డాంగే, వీఆర్వో వి.సత్యనారాయణ, సిబ్బంది ర్యాంపు పరిశీలనకు వెళ్లారు. బొండుమట్టి లోడుతో ఉన్న టిప్పర్ బయటకు వస్తుండగా వీరు నిలుపుదల చేసి వీఆర్ఏను కాపలా ఉంచారు. ఇంతలో ఓ వ్యక్తి వచ్చి టిప్పర్‌కు అడ్డు తప్పుకోవాలంటూ వీఆర్ఏపై ఆగ్రహించి పట్టుకుపోయాడు. ప్రధానంగా జాతీయ రహదారి పనుల కోసం ఇక్కడ బొండు మట్టిని తవ్వేందుకు అనుమతులు ఉన్నా అది నదీ తీరంలోంచి



వెళ్తుందా? ఇసుక తరలిస్తున్నారా, లంకమట్టి తవ్వుతున్నారా అనే అంశాలపై అధికారులు నిత్యం క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. నిర్ణీత కొలతలు, పరిమాణంలో తీస్తున్నారా లేదా అనేదీ కీలకమే. మైనింగ్ శాఖ ఏడీ వంశీధరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ అరహెక్టారు విస్తీర్ణంలోనే తవ్వకాలు చేపట్టేందుకు ఈనెల 17 నుంచి అనుమతి ఉందన్నారు. 25 రోజులు మాత్రమే తవ్వాలని.. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తవ్వకాల అనుమతుల ప్రతి తమకు రాలేదని తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. రాజోలు సెక్షన్ హెడ్‌వర్క్స్ ఏఈఈ మూర్తి మాట్లాడుతూ మట్టి తవ్వకాలకు ఎన్ఓసీ ఇచ్చామన్నారు. టిప్పర్లు వెళ్లేందుకు వీలుగా గోదావరిలో అడ్డుకట్టలు వేసేందుకు నిర్వాహకుడు డిపాజిట్ చెల్లించలేదన్నారు.

# కాలువలకు మహర్దశ

కాకినాడ : గత అయిదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది. కాలువల్లో తూడు, పిచ్చి మొక్కలతో నిండిపోయి శివారు భూములకు నీరందని పరిస్థితి ఎదురైంది. మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి వర్షాలు, వరదల సమయంలో నీరు కిందకు దిగట్లేదు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టింది. వేసవిలో డెల్టా ఆధునికీకరణ పనులు చేస్తామని ఇటీవల అసెంబ్లీలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.46 కోట్లతో కాలువల ప్రక్షాళనకు కార్యాచరణ రూపొందించారు.

**ఏఏ పనులంటే..**డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా పలు పనులు ప్రతిపాదించారు. కాలువలు మూసివేశాక వేసవిలో వీటిని చేస్తారు. నియోజకవర్గానికి రూ.2 కోట్ల చొప్పున రూ.12 కోట్ల విలువైన పనులు చేపట్టనున్నారు. జిల్లాలో కాకినాడ అర్బన్ మినహా మిగతా 6 నియోజకవర్గాల్లో ఆధునికీకరణ జరగనుంది. వీటిలో భాగంగా పూడికతీత, మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు, స్లూయిస్‌లకు సంబంధించి షట్టర్లకు (తలుపులు) మరమ్మతులు, కాలువ గట్లను పటిష్టం చేయడం వంటివి చేస్తారు. **ఇవీ ప్రయోజనాలు..**ఏటా ఏలేరు వరదలకు నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఆ సమయంలో నీరు దిగేందుకు అనువుగా లేకపోవటంతో పల్లపు ప్రాంతాలు మునిగిపోతున్నాయి. పలు ప్రధాన కాలువలపై స్లూయిస్‌లు దెబ్బతింటున్నాయి. షట్టర్లకు కన్నాలు పడుతున్నాయి. మరమ్మతు పనులతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది. సుదీర్ఘ కాలం తర్వాత అభివృద్ధి పనులు చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆక్రమిస్తారు ..అమ్మేస్తారు



విశాఖపట్నం : అదో చెరువు. దాన్ని ఆధారంగా చేసుకొని కొందరు వ్యాపారం సాగిస్తున్నారు. అంటే... చేపల వ్యాపారమనుకు నేరు. ప్రభుత్వ చెరువును అమ్మేస్తున్న కబ్జా పర్వమది. చిన్న చిన్న భాగాలుగా చదును చేసి ఇప్పటికే పెద్ద సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. చెరువు గర్భం వరకు ఇళ్లు నిర్మించేశారు. ఇంతలా ఆ చెరువును మింగేస్తున్నా అటువైపు కన్నెత్తయినా యంత్రాంగం చూడటం లేదు. ప్రభుత్వాలు మారినా పెందుర్తి మండలం చినముషిడివాడలోని రాజు చెరువులో ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు.

కన్నేసి... విక్రయించేసి: ఆక్రమణదారులకు 'రాజు చెరువు' బంగారు బాతులా మారింది. చెరువులోని స్థలాలను అమ్ముకొని కొందరు భారీగా సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగించిన ఆక్రమణలు నేటికీ సాగుతున్నాయి. ఇక్కడంతా ఓ ప్రణాళిక ప్రకారం కబ్జా వ్యవహారాన్ని సాగిస్తున్నారు. ముందొక అరవై గజాల ఇంటి నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుంటారు. ఆ తర్వాత స్థలాన్ని క్రమక్రమంగా భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పేస్తారు. అనంతరం సిమెంటు ఇటుకలతో నిర్మాణం ప్రారంభిస్తారు. ఆ తర్వాత యంత్రాంగాన్ని మచ్చిక చేసుకొని ఇంటి నెంబరు, విద్యుత్తు మీటరు, కులాయి పన్ను వంటి అన్ని రకాల అనుమతులు వచ్చేలా చక్రం తిప్పుతారు. ఆ స్థలాన్ని అధికారికం చేసుకున్నాక రూ.లక్షలకు అమ్ముతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇళ్లను అమ్మేయగా మరికొన్నింటిని అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇందులో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చెరువును కప్పేస్తూ...**

గతంలో ఆక్రమణల తొలగింపు సమయంలో స్థానికంగా ప్రతిఘటన పరిస్థితులు ఎదురయ్యేవి. నిజమైన పేదలకు అక్కడ కాకపోతే వేరేచోట స్థలాలు ఇచ్చేలా హామీ ఇచ్చి దాన్ని పరిరక్షించొచ్చు. చెరువు స్థలాలను సొమ్ము చేసుకునేందుకు నిర్మించిన వాటిపై దృష్టిసారిస్తే ఆక్రమణలను చాలా వరకు నియంత్రించొచ్చు.అంతా.. రాత్రికి రాత్రే: 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు సగానికిపైగా ఆక్రమణకు గురైంది. ఆక్రమణదారులు సుమారు 150 ఇళ్లు నిర్మించి ఏకంగా అమ్మేసుకున్నారు. ఇప్పుడు మరో పది ఇళ్లను నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం రాత్రిళ్లు మట్టి తీసుకొచ్చి చెరువులో వేసి చదును చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా లారీలతో తీసుకొచ్చిన వ్యర్థాలను సుమారు 20 అడుగుల మేర కుమ్మరించి భారీగా ఎత్తు చేశారు. ఈ ప్రదేశం చెరువు గర్భానికి సమీపంలో ఉండడం గమనార్హం.

ఇక్కడ ఒకటి, రెండు రోజుల్లో నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. అక్కడికి వెళ్లేందుకు ఏకంగా చిన్నపాటి మార్గాన్నే నిర్మించేశారు. చెరువు గట్టు వైపు కూడా భారీగా నిర్మించేస్తున్నారు.

# అటవీ అకాడమీ ఆమోదం




రాజమహేంద్రవరం : సమీపంలోని దివాన్‌చెరువు అభయారణ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ ఏర్పాటుకు కేంద్రం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాంతీయ అటవీ పరిశోధనా కేంద్రానికి చెందిన భవనాలు, పశ్చిమ అభయారణ్యంలో 12 ఎకరాలు ఈ అకాడమీ కోసం కేటాయించారు. సదరు విస్తీర్ణంలో భవనాలు, వసతి గృహాలు, తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.30 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతిని ప్రభుత్వం ఇచ్చింది. తక్షణావసరాల నిమిత్తం రూ.18 కోట్లు ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ నుంచి రుణంగా తీసుకుని పనులు ప్రారంభించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అకాడమీకి నిధులు మంజూరైన వెంటనే అటవీ అభివృద్ధి సంస్థ నుంచి తీసుకున్న రూ.18 కోట్లు తిరిగి చెల్లించాలని షరతు విధించారు.

**రెండు దశల్లో భవనాల నిర్మాణం**

అకాడమీకి కేటాయించిన 12 ఎకరాల్లో మొదటి దశగా ఆరు ఎకరాల్లో 120 మంది అటవీ సిబ్బంది ఉండేందుకు అనుకూలంగా 60 వసతి గదులు, పరిపాలనా భవనం, తరగతి గదులు నిర్మింపజేయడానికి అవకాశం కల్పించారు. రెండో దశలో మిగిలిన ఆరు ఎకరాల్లో అకాడమీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారుల కార్యాలయ భవనాల నిర్మాణాలు ఏర్పాటు చేయనున్నారు.

**అన్ని ప్రాంతాల వారికి సౌకర్యం**

క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణకు అవసరమైన అటవీ ప్రాంతం దివాన్‌చెరువులో ఉంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం.. రైల్వే స్టేషన్, విమానాశ్రయం చేరువలో ఉండటం.. గిరిజన ప్రాంతాల్లో అటవీ భూములుండటం ప్రత్యేకత.

**2017 నుంచి ఇక్కడే కొనసాగుతున్న శిక్షణ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా దూలపల్లిలో రాష్ట్ర అటవీ అకాడమీ ఉండేది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పదో షెడ్యూల్‌లో చేర్చారు. ఆ ప్రకారం ఈ అకాడమీ సేవలను ఇరు రాష్ట్రాలు 2024 వరకు ఉపయోగించుకోవచ్చు. సిబ్బంది శిక్షణకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం సొంత రాష్ట్రంలో అకాడమీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. 2017లో దివాన్‌చెరువు ఆర్ఎఫ్ఆర్‌సీలో తాత్కాలికంగా ప్రారంభించారు.

**21 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి**

దివాన్‌చెరువు ఆర్ఎఫ్ఆర్‌సీలో ఇప్పటివరకు 11 బ్యాచ్‌లు ఎఫ్‌బీఓలు, 10 బ్యాచ్‌ల ఎఫ్ఎస్ఓలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. అటవీ అకాడమీ భవన నిర్మాణాలకు నిధులు ఉన్నందున శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తాం.బి.విజయ్‌కుమార్, డైరెక్టరు, ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ

**అకాడమీ మంజూరుపై హర్షం**

అకాడమీ మంజూరు హర్షించదగిన విషయం. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, అనుమతించిన సీఎం చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం

# ఉపమాకలో మసాలా ఘుమఘుమ



నక్కపల్లి : ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణ వేడుకలు ముగిసినా, ఇక్కడ సందడి మాత్రం తగ్గడం లేదు. నిత్యం అనేక ప్రాంతాలనుంచి భారీఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతోపాటు ఇక్కడ జరుగుతున్న మసాలా తీర్థంలో తమకు నచ్చిన సామగ్రి కొనుగోలు చేసుకుని పయనమవుతున్నారు. స్వామి కల్యాణం పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది స్థానికంగా జరిగే తీర్థమే. ఎక్కడైనా పండగలకు తీర్థం ఒకట్రెండు రోజులు సాగితే, ఇక్కడ ఏకంగా మూడువారాల పాటు కొనసాగుతుంది. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాలనుంచి నిత్యం జనం ఉపమాక వస్తున్నారు. దీంతో నక్కపల్లి నుంచి ఉపమాక వచ్చే ప్రధాన మార్గం ఉదయం నుంచి సాయంత్రం వరకు కిటకిటలాడుతోంది. తీర్థంలో సుమారు 15 వరకు మసాలా సామాన్లు, సుగంధ ద్రవ్యాలు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పదుల సంఖ్యలో తినుబండారాలు, బొమ్మలు, వంటసామాన్లు తదితర వాటికి సంబంధించిన వ్యాపారాలు సాగుతున్నాయి. ఇక మసాలా దుకాణాల ద్వారా రోజూ రూ. లక్షల్లో వ్యాపారం సాగుతుంది. పసుపు, వెల్లులి, జీలకర్ర, ధనియాలు, వాము, మెంతులు, ఆవాలు, గసగసాలు, ఎండుమిర్చి, పసుపుతో పాటు యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క, జాజికాయ, జాపత్రి ఇలా అనేక రకాల దినుసులు ఇక్కడ అమ్ముడవుతున్నాయి. స్వామివారి సన్నిధిలో సరకులు కొనుగోలు చేసుకుని ఇళ్లకు తీసుకెళ్లి వాడుకుంటే అంతా మంచే జరుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఏడాదికి సరిపడా సరకులు ఇక్కడి నుంచే కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. ఈ తీర్థం మరో పది రోజులపాటు సాగనుంది.

# మోరంపూడి పైవంతెనపై వెలుగులేవీ?

రాజమహేంద్రవరం : మోరంపూడి పైవంతెన(ఫ్లైఓవర్)పై వాహనాల రాకపోకలకు అనుమతించి ఆరు నెలలు దాటినా కొన్ని పనులు నేటికీ పూర్తికాలేదు. గడువు పెంచుకుంటూ పోతున్నారే తప్ప వాటిని పూర్తి చేయడం లేదు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు పనుల్లోనూ తీవ్ర జాప్యం చేస్తుండడంతో వాహనచోదకులు రాత్రివేళలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు పూర్తిచేయడంలో గుత్తేదారు సంస్థ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



**ఆది నుంచీ అంతే..**

ఎన్‌హెచ్ఏఐ పర్యవేక్షణలో 1.42 కిలో మీటర్ల మేర రూ.60 కోట్లతో చేపట్టిన మోరంపూడి పై వంతెన పనుల్లో ఆది నుంచి జాప్యం జరుగుతూనే ఉంది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఎట్టకేలకు గతేడాది సెప్టెంబరు 8న పనులు పూర్తికాకుండానే లాంఛనంగా ప్రారంభించి పైనుంచి వాహనాల రాకపోకలకు అనుమతించారు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు, రెండో లేయర్, మార్కింగ్, కింద ఇరువైపులా సర్వీసు రోడ్ల ఏర్పాటు పనులు మాత్రం ఇప్పటికీ పూర్తికాలేదు. గతేడాది డిసెంబరు నెలాఖరు నాటికే వీటిని పూర్తి చేస్తామని చెప్పుకొచ్చినప్పటికీ అది జరగలేదు. వంతెనపై ఇరువైపులా విద్యుత్తు కేబుల్ వేసినా ఇంకా స్తంభాలు ఏర్పాటు చేయలేదు. మార్చి నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పినా నత్తనడకనే సాగుతున్నాయి. కింద సర్వీసు రోడ్లు కూడా అభివృద్ధి కాలేదు. గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మోరంపూడి పైవంతెన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# కాసుల వేటకు కళ్లెం పడేనా?

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తే బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మృతదేహం వచ్చిన దగ్గర నుంచి పోస్టుమార్టం చేసి అంబులెన్సులో పంపేవరకు అవస్థే. ప్రైవేటు ఫ్రీజర్లు.. అంబులెన్సుల దందా.. పోస్టుమార్టం కిట్లకు వసూళ్లు.. ఇలా ఒకటేమిటి అన్నింట్లోనూ దోచేస్తున్న పరిస్థితి ఉండేది. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో నలుగురిపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. మార్చురీ వద్ద పరిస్థితి గతేడాది సెప్టెంబరు 3న 'కన్నీటిలో కాసులవేట' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పలుమార్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సైతం ఈ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లోని పోస్టుమార్టం కిట్‌కు సుమారు రూ.500 ఖర్చవుతుంది. అలాంటిది ఒక్కో మృతదేహానికి బాధితుల వద్ద రూ.3 వేల నుంచి 5 వేలు వసూలు చేస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అడ్డం పెట్టుకుని రేటు మాట్లాడుకుంటున్నారని.. వారు చెప్పిందాంట్లో కొంచెం తక్కువ నగదు ఇచ్చినా పోస్టుమార్టం చేయడానికి గంటల తరబడి ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**వ్యవహారం వెనక ఎవరు?**

కలెక్టర్ చర్యలతో శవాగారం వద్ద దోపిడీ ఆగుతుందా అంటే ప్రశ్నార్థకమే. మార్చురీ వద్ద వసూళ్లు, డబ్బు డిమాండ్ చేయడం తదితర వ్యవహారమంతా ఆసుపత్రి ఉన్నతాధికారులకు తెలియకుండానే జరిగిందా? అనే విమర్శలొస్తున్నాయి. నేరుగా బాధితుల వద్ద ఓ పొరుగు సేవల ఉద్యోగి వసూళ్లకు పాల్పడుతుంటే ఆ విభాగ వైద్యులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలొస్తున్నాయి. ఏదైమైనా లోతైనా విచారణ చేస్తే



మరింత మంది బయటికొచ్చే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

**అంబులెన్సుల దోపిడీ ఆపాలి..**

మృతదేహాలను తరలించేందుకు జీజీహెచ్‌లో రెండు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఒక్కోసారి ఇవి మృతదేహాలను తీసుకెళ్లినప్పుడు మార్చురీ సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది సమాచారంతో కొందరు ప్రైవేటు అంబులెన్సులతో రంగంలోకి దిగిపోతున్నాయి. వారు చెప్పిందే రేటు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బయటి నుంచి తాము వేరే అంబులెన్సు తెచ్చుకుంటామన్నా ఒప్పుకోకుండా ఘర్షణలకు దిగుతుండడం గమనార్హం. దీన్ని పూర్తిగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

**శవపరీక్షలకు డబ్బులు డిమాండ్ చేసిన నలుగురిపై వేటు**

శవపరీక్షలు (పోస్టుమార్టం) కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్న రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుమార్టం అసిస్టెంట్‌గా పని చేస్తున్న పొరుగుసేవల సిబ్బంది పి.భవానీ ప్రసాద్ బాధితుల నుంచి రూ.5 వేలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపగా వాస్తవమేనని ఆయన అంగీకరించారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాబ్జీ, రామ్‌కుమార్, రామకృష్ణలకు కూడా కొంత మొత్తం ఇచ్చినట్లు తేలడంతో ఆ నలుగురిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సేవాభావంతో విధులు సక్రమంగా నిర్వహించాలని, అవినీతికి పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

# డిజిటల్ బాట.. అక్రమాలకు అడ్డుకట్ట

ముమ్మిడివరం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే పనులు చివరి దశకు చేరాయి. దస్త్రాలను డిజిటలైజేషన్ చేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులకు అందించే సేవల్లో పారదర్శకత, రుణాల మంజూరు, ఇతర వ్యవహారాల్లో అక్రమాలకు ఆన్‌లైన్ విధానంతో అడ్డుకట్ట వేయవచ్చు.

**అంతా పాత పద్ధతిలో..**

పీఏసీఎస్‌లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కాకినాడ) పరిధిలో పనిచేస్తున్నాయి. రైతులకు రుణాలు, సున్నా వడ్డీ, బంగారం కుదువపెట్టుకుని రుణాలు, డిపాజిట్ల సేకరణ ఇలా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి అన్ని సేవలూ అందిస్తున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నోడల్ ఏజెన్సీలుగా పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయి. వీటన్నిటినీ దస్త్రాల్లో పొందుపర్చడం, రశీదులు చేతిరాతతో ఇవ్వడం మినహా ఆన్‌లైన్ విధానం లేదు. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

**కేంద్రం ఆదేశించినా..**

జాతీయ స్థాయిలో ఒకే విధమైన సహకార వ్యవస్థ అందుబాటులోకి



తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే కార్యాచరణ రూపొందించింది. కేంద్రమే నిధులు సమకూర్చి కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలు అందజేసింది. గత వైకాపా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం 80 శాతానికిపైగా దస్త్రాల కంప్యూటరీకరణ పూర్తయింది.

**పారదర్శకతకు అవకాశం**

పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు వచ్చే ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకురావడానికి డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేశాం. సాంకేతిక సమస్యలు అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాం. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రావడంతో పారదర్శక సేవలకు అవకాశం ఉంటుంది. ఎస్. మురళీకృష్ణ, జిల్లా సహకార అధికారి

జిల్లా సమాచారం ఇలా..

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు: 166
సంఘాల్లో సభ్యులు: 1.30 లక్షలు
లాభాల్లోని సంఘాలు: 117
నష్టాల్లో కొనసాగుతున్నవి: 49

# వసతుల్లేక.. అవస్థలు పట్టక

నిడదవోలు : ఉపాధిహామీ వేతనజీవులకు ఎండల నుంచి ఉపశమనం కోసం గతంలో టెంట్లు సమకూర్చేవారు. పనిచేసే సమయంలో గాయమైతే ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఎండనుంచి ఉపశమనం కలిగించేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ సరఫరా చేసేవారు. ఇవన్నీ గత తెదేపా హయాంలో కల్పించిన సౌకర్యాలు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇవన్నీ దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో మాదిరిగా వసతులు సమకూరుతాయనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సైతం వారి ఇబ్బందులను గుర్తించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులు ఆదేశాలు జారీచేశారు.

గత తెదేపా హయాంలో ఉపాధి పనులు చేసేచోట నీడకోసం టెంట్లు వేసేవారు. తాగడానికి నీరు, గాయమైన ప్రథమ చికిత్స మందులు, వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేవి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవన్నీ కనుమరుగయ్యాయి. పనిచేసే సమయంలో గాయమైతే గట్లపై ఉండే ఆకురసం రాసుకుని, తర్వాత ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాల్సిన పరిస్థితి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీపంలోని ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయి, వాటిని తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సిబ్బంది తీసుకెళుతున్న దాఖలాలు లేవు. వడదెబ్బ తగిలిన కూలీకి ఉపశమనం కలిగించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కూలీలు ఇంటికి వచ్చేసరికి నీరసించిపోతున్నారు. పనిచేసే చోట మజ్జిగ మాట అటుంచి తాగునీటి సదుపాయమైనా లేదు. వెంట తీసుకెళ్లిన నీరే ఒబ్బిడిగా వాడుకోవాల్సిందే. వేసవి నేపథ్యంలో కూడా తీసుకెళ్లిన నీటిసీసాలు ఎండ తీవ్రతకు వేడెక్కిపోతున్నాయి. టెంట్లు లేక చెట్లనీడన సేద తీరాల్సిన దుస్థితి. ఉపాధిహామీ పథకం అమలులో తీసుకొచ్చిన మార్పులు వేతనజీవులపై శరాఘాతంగా మారాయి. రెండు పూటల పనికి దూరంగా వెళ్లి రావడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం..**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం వద్ద ఉన్న మెడికల్ కిట్లు తీసుకుని కూలీలకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. తాగునీటికి అయ్యే ఖర్చును వారి వేతనంలో కలిపి అందిస్తున్నాం. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా, నీరసించిపోకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించాం. ఎక్కువ మంది కూలీలు ఉన్న చోట ప్రత్యామ్నాయంగా నీడ కోసం కొబ్బరి, తాటాకు పందిళు వేయాలని చెబుతున్నాం. మజ్జిగ సరఫరాకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. రామ్‌ప్రసాద్, ఏపీడీ, డ్వామా

జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే...

మండలాలు 18
పంచాయతీలు 300
మొత్తం జాబ్‌కార్డులు 1.68 లక్షలు
మనుగడలో ఉన్నవి 1.28 లక్షలు
మొత్తం కూలీలు 2.59 లక్షలు
ప్రస్తుతం అన్నీ రకాల పనులకు వచ్చేవారు 1.78 లక్షలు
రోజూవారీ కూలీలు 10,428

# దోచింది..దాచేశారు !



విశాఖ : మహా విశాఖ నగర పాలక సంస్థతో ఒప్పందం చేసుకున్న గుత్తేదారుల అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వారికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తున్న జీవీఎంసీ అధికారులు వాటాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇదీ పరిస్థితి..!**

నగరంలో చెత్త సేకరణకు క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలతో పాటు, విద్యుత్తు ఆటోలను జీవీఎంసీ వినియోగించుకుంటుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మొత్తం 70 ఆటోలను చెత్త సేకరణకు, 10 ఆటోలను బీచ్‌రోడ్డులో సందర్శకుల ఉచిత ప్రయాణానికి సమకూర్చుకుంది. ఆయా వాహనాల నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే 95 మంది చోదకుల నియామకం జరిగింది. ఒప్పందం ప్రకారం ప్రతీ చోదకుడికి రూ.15 వేలు వేతనం కాగా, రూ.2 వేలు పీఎఫ్, బీమాకు మినహాయించి రూ.13 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

గుత్తేదారు సంస్థ ప్రతినిధులు ప్రతి నెలా చోదకులకు రూ.13 వేలు వేతనాన్ని చెల్లిస్తూ, తిరిగి ఒక్కో చోదకుడిని బెదిరించి రూ.3 వేలు చొప్పున వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. ఇలా ఏడాదిన్నరలో రూ.40 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది.

**ఆధారాలతో ఫిర్యాదు..!:**

ఈ మొత్తం వ్యవహారంపై సిటూ నాయకులు ఆధారాలతో సహా పూర్వ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. చోదకుల ఫోన్ పే యాప్ ద్వారా లావాదేవీలు జరిగినట్టు కమిషనర్ గుర్తించారు. జోన్-4 కార్యాలయంలో ప్రాజెక్ట్స్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఏడుకొండలు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ సమక్షంలో గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, చెత్త సేకరణ ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. డ్రైవర్ల నుంచి అక్రమంగా వసూలు చేసిన నిధులు రూ.40 లక్షలు తిరిగి చోదకులకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

**కానరాని చర్యలు...:** కమిషనర్ బదిలీ కావడంతో... వాటాలు అందుకుంటున్న కొందరు అధికారులు... ఆయన ఆదేశాలను పక్కన పెట్టేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న గుత్తేదారు సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని నేటికీ రద్దు చేయలేదు. అన్ని ఆధారాలు ఉన్నా.. ఆ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టకుండా కొనసాగిస్తుండడం గమనార్హం.

ఇదే అంశంపై సిటూ నాయకుడు పి.వెంకటరెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

# టిడ్కో లెక్కలు తేలుస్తారా..!



అనకాపల్లి : పట్టణ పేదలకు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఇళ్లు నిర్మించింది అప్పటి తెదేపా ప్రభుత్వం. లబ్ధిదారులను గుర్తించి అప్పగించే సమయంలో వైకాపా సర్కారు గద్దెనెక్కింది. అంతే అప్పటివరకు ఉన్న జాబితాల్లో లబ్ధిదారుల పేర్లు మారిపోయాయి. అర్హతలు చూడకుండా నేతల అనుయాయులకు కట్టబెట్టేశారు. అర్హులను తప్పించేశారు. అప్పట్లో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై దృష్టిసారించింది.

ఆయా ఇళ్లల్లో అనర్హులేమైనా పాగా వేశారా?, అమ్మేసి సొమ్ము చేసుకున్నారా? తదితర కోణాల్లో ఆరాలు తీస్తోంది. పలు కారణాలతో కేటాయించకుండా మిగిలిపోయిన ఇళ్లకు లబ్ధిదారులను కొత్తగా ఎంపిక చేయడానికి సిద్ధమవుతోంది. అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం పురపాలక సంఘాలు, జీవీఎంసీ పరిధిలో కలిపి 6,184 టిడ్కో ఇళ్లు నిర్మించారు. నర్సీపట్నంలో తెదేపా హయాంలో లబ్ధిదారుల జాబితాలు మార్చేసి వైకాపా నేతలు తమ అనుచరులకు కట్టబెట్టేశారు.

**చేతులు మారిన ఇళ్లే ఎక్కువ..**

విశాఖ వాళ్లకు అనకాపల్లి చుట్టుపక్కల ఇళ్లు కేటాయించారు. వారు ఇక్కడ నివాసం ఉండేందుకు ఇష్టపడక చాలా మంది ఇళ్లను అమ్మకాలు పెట్టేశారు. మధ్యవర్తులుగా అప్పటి వైకాపా నేతలే వ్యవహారాలు నడిపారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన 300 చదరపు అడుగుల ఇంటిని రూ.3 లక్షల నుంచి 4 లక్షలకు అమ్మేసుకున్నారు. టిడ్కో ఇళ్లల్లో సగానికి పైగా చేతులు మారిపోయాయి. అధికారులు ఎవరైనా కాల్ చేస్తే, 'మేమే నివాసం ఉంటున్నాం.. అమ్మకాలు చేయలేద'ని చెబుతూ వస్తున్నారు. తాజాగా ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతే వారి కుటుంబంలో అర్హులకు కేటాయించనున్నారు. సత్యనారాయణపురం లేఅవుట్‌లో ఇలాంటి వారు 30 మంది వరకు ఉన్నారు. బ్యాంకు రుణం చెల్లింపుల్లో సిబిల్ రేటింగ్ లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాల్లో రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోబోతున్నారు. వీటి గురించి జీవీఎంసీ ఏపీడి సంతోష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. వచ్చిన తర్వాత పరిశీలించి, నోటీసులు ఇచ్చి అనర్హులను తొలగిస్తామన్నారు. వెంటనే అర్హులకు ఆ ఫ్లాట్లు కేటాయిస్తామని వివరించారు.

అనకాపల్లి నియోజకవర్గ పరిధిలో నిర్మించిన 3,400 ఇళ్లలో సుమారు 1,270 ఇళ్లను విశాఖ జిల్లాకు చెందిన అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సిఫార్సుచేసిన వారికి కేటాయించేశారు. దీనిపై తెదేపా నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కొండుపాలెం, సిరసపల్లిలోని 672 ఇళ్లను ఎవ్వరికి కేటాయించకుండా వదిలేశారు. తాజాగా ఈ ఇళ్లను స్థానికులకు అప్పగించనున్నారు.

# కర్షకులకు కూటమి అండ

ధర్మవరం : వైకాపా ప్రభుత్వ హయాంలో రైతులకు ఉపయోగపడే యంత్రాలను రాయితీతో పంపిణీ చేసే పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. అరకొరగా వచ్చిన యంత్రాలను కూడా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందాయి. దీంతో మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి రైతులు వాటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు అడుగులు వేసింది. సాగుకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీతో అందించేందుకు చర్యలు చేపట్టింది. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగంతో కూలీల కొరతను అధికమించడమే కాకుండా పెట్టుబడి భారాన్ని కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

**పంపిణీకి సిద్ధం:** జిల్లా వ్యాప్తంగా రూ.2.87 కోట్లు విలువైన 1,661 యంత్ర సామగ్రిని ఈ ఆర్థిక సంవత్సరంలో ముగిసేలోపు రైతులకు అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అన్ని మండలాలకు జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పరికరాల వివరాలను రైతు సేవా కేంద్రాలకు తెలియజేశారు. ప్రభుత్వం యాభై శాతం రాయితీతో వాటిని పంపిణీ చేయనుంది. అర్హులైన రైతులు కావాల్సిన పరికరాలకు కోసం రైతు సేవా కేంద్రంలో ఈ నెల 24లోపు



దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

**అర్హులకు అందజేస్తాం..**

సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీసత్యసాయి

సన్న, చిన్నకారు రైతులై ఉండి.. ఈ-పంట నమోదు చేసుకున్న వారికే రాయితీతో పరికరాలు అందజేస్తాం. గత ఐదేళ్లలోపు ఏ విధమైన పరికరాలు ప్రభుత్వ రాయితీతో లబ్ధిపొందకుండా ఉన్న వారే వాటిని దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబానికి ఒక్కటే అందజేస్తాం.

# చేనేతకు చల్లని కబురు

కాకినాడ : చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం చల్లని కబురు చెప్పింది. వారి ఇళ్లకు నెలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్తు అందించాలని నిర్ణయించడంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో కాకినాడ జిల్లాలో మగ్గాలున్న 3,200 చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ సంస్థ అందించే సాయంతో పాటు చేనేతలకు అదనంగా రూ.50 వేలను ప్రభుత్వం అందిస్తోంది. నేతకు ఉపకరించే నూలు వంటివాటికి జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ అమలుకు చర్యలు



చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన నేపథ్యంలో చేనేత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతామని చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత చేనేత రంగం అభివృద్ధికి ఈ ఏడాదిలో రూ.138.08 కోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించారు. కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని తాజాగా నిర్ణయించారు. జిల్లాలో సగానికిపైగా మగ్గాలు పిఠాపురం నియోజకవర్గంలోనే ఉన్నాయి.

**ఉచిత విద్యుత్తుతో ప్రయోజనం**

నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. జీఎస్టీ నుంచి చేనేత ముడిసరకుకు మినహాయింపు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సూరిశెట్టి జయకృష్ణ, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు

**ఆయా కుటుంబాలకు మేలు**

నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు పథకంతో కాకినాడ జిల్లాలో సుమారు 3,200 చేనేత కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది. జిల్లాలో 2770 మగ్గాలు ఉన్నాయి. మరో 400 కుటుంబాలకుపైగా చేనేత రంగానికి అనుబంధంగా నూలుకు రంగులు వేసే, పడుగులు, కండెలు చుట్టే పనులు నిర్వహిస్తున్నారు.

కె.పెద్దిరాజు, ఏడీ, జిల్లా చేనేత, జౌళి శాఖ

# ఆక్రమణలు..అక్రమ నిర్మాణాలు

పెద్దాపురం : నగర పంచాయతీలు, పురపాలికలు, నగరపాలక సంస్థల పరిధిలోని వార్డు సచివాలయాలు, పట్టణ ప్రణాళిక విభాగాల్లో అధికారులు, ప్రణాళిక కార్యదర్శులు ఉన్నా క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలకు కళ్లెం పడడం లేదు. శరవేగంగా విస్తరిస్తున్న, అభివృద్ధి చెందుతున్న పట్టణాలు, నగరాల్లో ఎవరికీ వారే ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినపుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుందామనుకునే అధికారులకు రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. అక్రమ కట్టడాలతో పురపాలికలు, నగర పంచాయతీలు రూ.లక్షల్లో ఆదాయా



న్ని కోల్పోవాల్సి వస్తోంది. దీంతో చేసేది లేక నోటీసులు జారీచేసి కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, తుని, సామర్లకోట, పిఠాపురం నాలుగు పురపాలికలతో పాటు గొల్లప్రోలు నగర పంచాయతీలో అక్రమ నిర్మాణాలు ఇటీవలి కాలంలో పెరిగాయి. వీటిపై సచివాలయాలు, వార్డు కార్యాలయాలతో పాటు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో విచారణ చేసి సంబంధిత అక్రమదారులకు నోటీసులు ఇచ్చి కోర్టుల్లో కేసులు వేస్తున్నారు.

**న్యాయస్థానంలో కేసులు..** పట్టణాల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు జారీచేస్తున్నారు. అలాగే కోర్టుల్లో ఛార్జిషీట్లు ఫైల్ చేస్తున్నారు. న్యాయస్థానంలో వచ్చే తీర్పు మేరకు తగిన చర్యలు తీసుకుంటాం. ఇకపై అప్రూవల్ ప్లాన్లు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టినవారిపై పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. కేవీ పద్మావతి, శ్రీవిద్య, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు

# సప్తనదీ సంగమం.. కాలుష్య కాసారం

నందికొట్కూరు : సప్తనదీ సంగమ ప్రాంతంగా ఖ్యాతిగాంచిన సంగమేశ్వరం వద్ద కృష్ణా జలాలు ఆకుపచ్చగా మారడం ఆందోళన కలిగిస్తోంది. సంగమేశ్వరం వద్ద తుంగ, భద్ర, కృష్ణ, వేణి, భీమ, మలాపహరిణి, భవనాసి నదులు కలుస్తాయి. ప్రస్తుతం ఇక్కడ నీటిమట్టం తగ్గింది. నీరంతా ముదురు ఆకుపచ్చ రంగులోని మారింది. నీరు కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయి. తుంగభద్ర నది కౌతాళం మండలం మేళిగనూరు వద్ద మొదలై 115 కి.మీ ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. నది వెంట ఉన్న పలు పరిశ్రమలు, కర్నూలు నగర మురుగు నేరుగా నదిలోకి వదిలేస్తున్నారు. కర్నూలు నగరపాలక పరిధిలో రోజుకు సగటున 60 ఎంఎల్‌డీ మురుగు విడుదల అవుతోంది. శుద్ధి చేయకుండా నేరుగా తుంగభద్రలోకి వదులుతున్నారు. 'వరద' ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వేగంగా ముందుకెళ్తుంది.. ప్రస్తుతం వరద ఆగింది.. సప్తనదీ ప్రాంతంలో పేరుకుపోయింది. కర్నూలు మండలం పంచలింగాల, తాండ్రపాడు, మామిదాలపాడు, జొహరాపురం తదితర ప్రాంతాల్లో తుంగభద్ర నీటిలో ఈ బ్యాక్టీరియా ఉన్నట్లు తేలింది. కోలిఫాం 50 సీఎఫ్‌యూ దాటితో కచ్చితంగా ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. నేరుగా తాగితే డయేరియా తదితర వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నీళ్లతో నేరుగా స్నానం చేసినా చర్మవ్యాధుల బారినపడాల్సి ఉంటుంది.

## ఓజీ బ్యూటీ నెవ్వర్ బిఫోర్ షో

నాని హీరోగా నటించిన 'నాని గ్యాంగ్ లీడర్' సినిమాలో హీరోయిన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ ప్రియాంక అరుల్ మోహన్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. మొదటి సినిమాలో సీరియస్ పాత్ర అయినప్పటికీ నటించి మెప్పించింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే అందరికీ గుర్తుండి పోయే విధంగా నటించి మెప్పించింది. నాని గ్యాంగ్ లీడర్‌తో వచ్చిన గుర్తింపు, స్టార్‌డంతో తెలుగులో చాలా సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. కానీ ఈ అమ్మడు చాలా తక్కువ సినిమాలకు కమిట్ అయింది. కథ నచ్చితేనే, పాత్ర బాగుంటేనే సినిమాను చేసేందుకు ఓకే చెప్పడం ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది. శర్వానంద్‌తో ఈమె చేసిన శ్రీకారం సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచింది. కానీ ఆ తర్వాత చేసిన సరిపోదా శనివారం సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఓజీ సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఓజీ సినిమా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పవన్ తో నటించిన ఆ సినిమా కోసం ప్రియాంక అరుల్ మోహన్ ఆసక్తిగా ఎదురు చూస్తుంది. ఆ సినిమా విడుదల తర్వాత కచ్చితంగా టాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 6.1 మిలియన్‌ల ఫాలోవర్స్ కలిగి ఉన్న ప్రియాంక అరుల్ మోహన్ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ప్రియాంక అరుల్



మోహన్ ఫోటోలు చాలా సింపుల్‌గా స్కిన్ షో లేకుండా, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఉంటాయి. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లు ఉన్నాయి. పొట్టి నిక్కర్‌ను ధరించి ఉన్న ప్రియాంక అరుల్ మోహన్ ఫోటోలు చూసి చాలా మంది షాక్ అవుతున్నారు. ప్రియాంక నుంచి ఇలాంటి ఫోటోలు ఎప్పుడూ చూడలేదు. ఇంత అందంగా ఉండే ప్రియాంక ఎందుకు రెగ్యులర్‌గా రొటీన్ ఔట్ ఫిట్‌లో కనిపిస్తూ ఉంటుందని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఇకపై అయినా ఇలాంటి గ్లామర్ ఔట్ ఫిట్‌లో కనిపించాలని అభిమానులు, నెటిజన్స్ ఫోటోలకు కామెంట్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. 1994లో జన్మించిన ప్రియాంక అరుల్ మోహన్ కన్నడ చిత్రం ఓంధ్ కథే హెల్లాతో 2019లో నటన రంగంలో అడుగు పెట్టింది. తమిళంలో ఈమె నటించిన డాక్టర్, డాన్ మంచి విజయాలను సొంతం చేసుకున్నాయి. బెంగళూరులోని పిఇఎస్ యూనివర్శిటీలో బయోలాజికల్ ఇంజనీరింగ్ చదవివింది. చదువు పూర్తి కాకముందే ఇండస్ట్రీ నుంచి పిలుపు రావడంతో హీరోయిన్‌గా నటించేందుకు ఓకే చెప్పింది. రాబోయే రోజుల్లో సౌత్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా ఈ అమ్మడు పేరు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. తెలుగు స్టార్ హీరోల్లో మరింత మంది ఈమెతో వర్క్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. త్వరలోనే ఈమె ఒక పెద్ద తెలుగు సినిమాకు సైన్ చేసే అవకాశాలు ఉన్నాయట. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆ సినిమా ఏంటి అనేది క్లారిటీ వచ్చే అకవాశం లేదు. ప్రియాంక ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేస్తే బాలీవుడ్ నుంచి కూడా పిలుపు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## పూజా అది కూడా కవర్ చేస్తుందా?

2023 ముందు వరకు పూజా హెగ్డే తెలుగులో స్టార్ హీరోయిన్. కానీ ఆ తర్వాత అమ్మడు నుంచి ఒక్క సినిమా కూడా వచ్చింది లేదు. వరుస ఫ్లాపులతో పాటూ, ఆ టైమ్ లో పూజా కన్ను బాలీవుడ్ పై ఉండటం వల్ల ఇక్కడ ఫోకస్ చేయలేదు. దీంతో తెలుగులో ఆఫర్లు తగ్గిపోయాయి. రీజైన్స్ ఏవైనా కానీ దాదాపు మూడేళ్ళ పూజా టాలీవుడ్ కు దూరమైంది. మూడేళ్ల సౌత్ లో గ్యాప్ తీసుకున్న పూజా కెరీర్ ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. పూజా హీరోయిన్ గా సూర్య తో చేసిన రెట్రో సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా పలు భాషల్లో రిలీజవుతుంది. ఎప్పటిలాగా గ్లామర్ రోల్ లో కాకుండా ఈసారి పూజా డీ గ్లామర్ రోల్ లో కనిపించనుందని రెట్రో పోస్టర్లు, టీజర్, ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. రెట్రో సినిమా ఎలా ఉన్నా ఆ సినిమాలో పూజా పాత్రకు మంచి గుర్తింపు వస్తుందని కోలీవుడ్ వర్గాలంటున్నాయి. రెట్రోతో పాటూ పూజా తమిళంలో జననాయగన్ లో విజయ్ సరసన నటిస్తోంది. రజినీకాంత్, లోకేష్ కనగరాజ్



దర్శకత్వంలో వస్తోన్న కూలీలో పూజా స్పెషల్ సాంగ్ చేస్తున్న విషయం తెలిసిందే. వీటితో పాటూ తెలుగులో రీసెంట్ గా ఓ లవ్ స్టోరీకి సైన్ చేసిన విషయాన్ని కూడా పూజా అనౌన్స్ చేసింది.

హీరో, డైరెక్టర్ ఎవరనేది చెప్పలేదు కానీ తెలుగులో సినిమా చేస్తున్న విషయాన్ని మాత్రం పూజా బయటకు చెప్పింది. పూజా తెలుగు సినిమాకు సైన్ చేయడంపై ఆమె ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు పూజా కిచ్చా సుదీప్ తో ఓ సినిమా చేయబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. అనూప్ భండారీ దర్శకత్వంలో సుదీప్ చేయబోతున్న బిల్లా రంగా బాషా అనే సినిమాలో పూజా హెగ్డే నటించబోతుందని వార్తలు జోరుగా వస్తున్నాయి. హిస్టారికల్ ఫిక్షన్ గా రూపొందనున్న ఈ సినిమాలో పూజా నటిస్తే ఇదే తన కన్నడ డెబ్యూ సినిమా అవుతుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన పూజా ఇప్పుడు కన్నడ లో కూడా ఎంట్రీ ఇచ్చేస్తే సౌత్ మొత్తాన్ని కవర్ చేసినట్టు అవుతుంది. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వచ్చింది లేదు.




## ఆ నలుగురు భామలు పెళ్లి మాట ఎత్తడం లేదే!



బాలీవుడ్ సీనియర్ భామలంతా పెళ్లి చేసుకుని తల్లులై ఎలా రాణిస్తున్నారో కళ్ల ముందు కనిపిస్తూనే ఉంది. కరీనా కపూర్, దీపికా పదుకొణే, కత్రినా కైఫ్, అలియాభట్ ల ప్రయాణం ఎలా సాగుతుందో తెలిసిందే. ఓవైపు నటీమణులుగా బిజీగా ఉంటూనే ఇల్లాలిగా మారి ఇంటి బాధ్యతలు చక్కబెడు తున్నారు. పెళ్లైతే అదృష్టం కలిసొస్తుందని మరికొంత మంది భామలు ప్రేమ వివాహాలు చేసుకుని స్థిరపడుతున్నారు. ప్రొఫెషనల్ గానూ కొనసాగుతున్నారు. కానీ సౌత్ ఈ సీనియర్ భామలు మాత్రం పెళ్లి మాట ఎత్తడం లేదు. కెరీర్ పరంగా ఢోకా లేకుండా ప్రయాణం సాగుతున్నా? 40 దాటినా ఇంకా నో మ్యారీడ్ అనడం ఆశ్చర్య కరం. స్వీటీ అనుష్క.. త్రిష.. సమంత..శ్రుతిహాసన్ లు ఒకే మార్గంలో కనిపిస్తున్నారు. త్రిష కు గతంలో వరుణ్ మనియన్ అనే వ్యాపార వేత్తతో నిశ్చితార్థం అయి క్యాన్సిల్ అయింది. ఆ తర్వాత మళ్లీ పెళ్లి మాట ఎత్తలేదు. ఎవరి తోనూ రిలేషన్ షిప్ లోనూ కొనసాగలేదు. మరి పెళ్లి చేసుకోరా? అంటే కాదని చెప్పడం లేదు. నచ్చిన వాడు దొరకాలి కదా? అంటూ స్కిప్ కొడుతుంది. అలాగే అనుష్క ఎవరితోనూ లవ్ లోనూ పడలేదు. ఏ హీరోతోనూ రిలేషన్ షిప్ లోనూ లేదు. ఆ మధ్య ఇంట్లో తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నట్లు వార్తలొచ్చాయి. కానీ అవి అక్కడికే పరిమితం అయ్యాయి. వాటిపై మళ్లీ ఎలాంటి అప్ డేట్ రాలేదు. వాళ్ల కన్నా కాస్త జూనియర్ అయిన శ్రుతి హాసన్ కూడా పెళ్లిని ఏమాత్రం సీరియస్ గా తీసుకోలేదు. ఇప్ప టికే ఇద్దరిలో రిలేషన్ షిప్ నడిపించింది. మైఖెల్ కోర్సలే తర్వాత శంతను హజారికాతో కొన్నాళ్లు డేటింగ్ చేసింది. ఆ బంధాన్ని అక్కడి వరకే పరిమితం చేసింది. అటుపై నో రిలేషన్ షిప్స్ అండ్ మ్యారేజ్ అంటూ వెళ్తోంది. నాగ చైతన్యతో విడాకులు తర్వాత సమంత కూడా సింగిల్ గానే ఉంటుంది. పెళ్లి గురించి ఆలోచన చేస్తున్నట్లే కనిపించలేదు. ఇంకా మరికొంత మంది సౌత్ భామలు ఇదే తీరున ఉన్నారు. ముంబై బ్యూటీ అయిన తమన్నా కూడా ఇటీవలే విజయ్ వర్మతో విడిపోయింది. ఇప్పుడిప్పుడే ఆ జ్ఞాపకాల నుంచి బయట పడుతుంది.

## కుబేర 'పోయిరా మామా' - ధనుష్ మాస్ బీట్!



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ కుబేరా. క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా జూన్ 20న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రొమోషన్స్ షురూ చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ సింగిల్ "పోయిరా మామా"ను విడుదల చేశారు. ఈ పాట విడుదలైన దగ్గర నుంచే సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ మాస్ బీట్ పాటలో, ధనుష్ వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదివరకే ధనుష్ పాడిన పాటలు సినిమాలకు మంచి హైప్ క్రియేట్ చేశాయి. ఇక ఈసారి కూడా కుబేర సినిమాకు పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యేలా ఒక సాంగ్ పాడడం విశేషం. పాట ఓసారి విన్నా, వెంటనే రిపీట్ మోడ్ లోకి వెళ్లిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. భాస్కరభట్ల రాసిన సాహిత్యం ఊర మాస్ ఫీల్ ను అందిస్తుంది. "పోయిరా మామా.." అంటూ సాగే ఈ పాటలో హై ఎనర్జీ ట్యూన్, తీన్మార్ బీట్ వినిపించగా.. ధనుష్ స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంది. శేఖర్ కమ్ముల తరహాలో వస్తోన్న సినిమా నుంచి ఇలాంటి మాస్ సాంగ్ రావడం అనుకోకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా చేసింది. ఇక %ఎజీ% శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. పాట విడుదలైన తరువాత దేవీ శ్రీ ప్రసాద్ శేఖర్ కమ్ముల కాంబినేషన్ మీదే స్పెషల్ క్రేజ్ పెరిగింది. క్లాస్ టేస్ట్ ఉన్న దర్శకుడికి మాస్ టెంపో ఉన్న మ్యూజిక్ డైరెక్టర్ తో కలిస్తే ఎలా ఉంటుందో అనుకున్నవారికి "పోయిరా మామా" పాట కిక్కిస్తోంది. సినిమాపై ఇప్పటి వరకు ఉన్న హైప్ కు ఈ పాట మరో లెవెల్ హైప్ ను జత చేసింది. ఈ సినిమాలో ధనుష్ ఒక డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్టు సమాచారం. పాటలో కనిపించిన విజువల్స్, బాడీ లాంగ్వేజ్, ధనుష్ ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే సినిమాలో ఆయన మరోసారి తన టాలెంట్‌ను చూపించనున్నారని అర్థమవుతోంది. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో నాగార్జున డిఫరెంట్ అండ్ పవర్ఫుల్ పాత్రలో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఇక పాన్ ఇండియా రేంజ్ కు తగ్గట్లే అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ కు మంచి స్పందన రావడంతో.. ఇప్పుడు ఫస్ట్ సాంగ్ "పోయిరా మామా" తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇక జూన్ 20న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.

## ఎర్ర చీర కట్టులో సంయుక్త

మలయాళ సినిమా పాప్‌కార్న్‌తో దాదాపు దశాబ్ద కాలం క్రితం సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. వరుసగా మలయాళ సినిమాలు చేస్తూ వచ్చిన ఈమెకు 2018లో కలరి అనే తమిళ సినిమాలో నటించే అవకాశం దక్కింది. అత్యధిక మలయాళ సినిమాల్లో నటించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత తమిళ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించింది. ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు కూడా పలు సినిమాలతో సుపరిచితురాలు అయింది. తెలుగులో ఈమె భీమ్లా నాయక్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి విరూపాక్ష సినిమాతో భారీ విజయం దక్కింది. తెలుగులో వరుసగా సార్, విరూపాక్ష, బింబిసార సినిమాలతో సక్సెస్‌లు దక్కాయి. దాంతో ఈ అమ్మడు ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో ఈమె మూడు సినిమాల్లో నటిస్తోంది. మూడు సినిమాలు సైతం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న అఖండ 2 సినిమాలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రాలేదు. నారి నారి నడుమ మురారి సినిమాలోనూ ఈమె నటిస్తున్న విషయం తెల్సిందే. గతంతో పోల్చితే తెలుగులో ఈ సారి మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లు చేస్తున్న సంయుక్త మీనన్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా



సంయుక్త మీనన్ తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 3.3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఈమె మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు ఫోటోలతో సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే అందమైన ఎర్ర చీర కట్టు ఫోటోలతో సంయుక్త మీనన్ వైరల్ అవుతోంది. స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి, రెడ్ చీర కట్టులో అందంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన సంయుక్త మీనన్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2016లో షైన్ టామ్ చాకో కు జోడీగా పాప్‌కార్న్ సినిమాలో నటించడం ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. తక్కువ సమయంలోనే సంయుక్తకి మలయాళ సినిమా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కింది. ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తూ వచ్చింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఉన్న సంయుక్త మీనన్ కాస్త ఆలస్యంగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకు పోతుంది. అందమైన ఈ మలయాళి ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో రాబోయే రెండు మూడు ఏళ్లలో వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేస్తే మరిన్ని సినిమా ఆఫర్లు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## సింపుల్ స్టైల్‌తో గుండె గిల్లుతున్న శ్రద్ధ

సాహెూ, ఆషిఖీ 2 లాంటి చిత్రాలతో దక్షిణాదినా భారీ ఫాలోయింగ్ తెచ్చుకుంది శ్రద్ధా కపూర్. నటుడు శక్తికపూర్ నటవారసురాలిగా తండ్రి గర్వించదగిన స్థానానికి ఎదిగింది ఈ భామ. తనదైన నటన, అందం, చిరు నవ్వుతో మనసులు గెలుచుకోవడం శ్రద్ధా ప్రత్యేకత. అయితే శ్రద్ధా వృత్తిగత జీవితం కంటే, వ్యక్తిగత జీవితం కారణంగా ఎక్కువగా మీడియాలో చర్చగా మారుతోంది. ఈ బ్యూటీ ఇటీవల స్త్రీ 2 లాంటి బ్లాక్ బస్టర్ లో నటించింది. వరుసగా భారీ చిత్రాల్లో నటించనుంది. తదుపరి హృతిక్ రోషన్ సరసన ఓ భారీ చిత్రంలో నటించనుందని కథనాలొస్తున్నాయి. కెరీర్ పరంగా జర్నీ ఎలా ఉన్నా, శ్రద్ధా లవ్ లైఫ్ ప్రతిసారీ చర్చగా మారుతోంది. ఈ భామ ఇంతకుముందు సహనటుడు ఆదిత్య రాయ్ కపూర్ తో ప్రేమాయణం సాగించిందని గుసగుసలు వినిపించాయి. కానీ ఆ



ఇద్దరి దారులు వేరయ్యాయి. ఆ తర్వాత దర్శకనిర్మాత ఫర్హాన్ అక్తర్ తో కొన్నాళ్ల పాటు ప్రేమలో ఉన్న శ్రద్ధా అతడితోను బ్రేకప్ అయింది. ఇటీవల కొంతకాలంగా స్త్రీ ఫ్రాంఛైజీ స్క్రీన్ ప్లే రచయిత రాహుల్ మోడీతో ప్రేమలో ఉందని ప్రచారం సాగుతోంది. కానీ దీనిని ఇప్పటివరకూ శ్రద్ధా అధికారికంగా ఖాయం చేయలేదు. మరోవైపు శ్రద్ధా సోషల్ మీడియాల్లో తన ఫాలోవర్స్ ని యంగేజ్ చేసేందుకు నిరంతర ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. ఇందులో ఈ భామ సింపుల్ గా స్మైలిస్తూ హృదయాలను కొల్లగొట్టింది. శ్రద్ధా ఛామ్, గ్లో ఈ ఫోటోగ్రాఫ్ లో ఎంతో అందంగా ఒదిగిపోయి కనిపిస్తున్నాయి. ఒకే ఒక్క స్మైల్ తో గేమ్ ఛేంజర్ గా మారిందంటూ అభిమానులు కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. అన్నట్టు శ్రద్ధా తదుపరి టాలీవుడ్ లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈసారి ప్రభాస్ కాకుండా ఏ పెద్ద హీరో ఈ భామకు అవకాశం కల్పిస్తారో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536